ప్రజలే ప్రభువులు

# జనబలం

మే 2022 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-



## రిజర్వేషన్లు + ఉచితాలు ≠ సమానావకాశాలు

## స్థానిక ప్రభుత్వాలు - ప్రజాస్వామ్య పాఠశాలలు



## యువత భవితను కాపాడేలా డ్రగ్స్‌పై ఎఫ్‌డీఆర్ / లోక్‌సత్తా నమూనా చట్టం

## విద్యా ప్రమాణాలు పెరగాలె



## పార్టీ, పవర్‌ల నిర్వచనాన్ని మార్చిన నాయకుడు ఎన్.టి.ఆర్

# ప్రజలకు రాజ్యాంగం పట్ల అవగాహన ఉంటే.. పాలకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించరు

పాలకులు రాజ్యాంగాన్ని మార్చాలనే ప్రమాదకర ధోరణులకు స్వస్తి చెప్పి సక్రమంగా అమలు చేయటం మీద దృష్టి పెట్టాలని లోక్‌సత్తా పార్టీ నేతలు హితవు పలికారు. రాజ్యాంగానికి, సమాజానికి మధ్య అంతరాన్ని తగ్గించటం రాజకీయం లక్ష్యమని, ఆ బాధ్యతను నెరవేర్చకుండా రాజ్యాంగం మీద వంకలు పెట్టటం తగదన్నారు.

బాబాసాహెబ్ డా॥ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయనకు లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు సహచర నేతలతో కలిసి ఘనంగా నివాళులర్పించారు.

గాంధీ, అంబేద్కర్‌లు లోక్‌సత్తా పార్టీకి ఐకాన్లని, వారిద్దరి ఆశయాలూ కలగలిసిన నూతన రాజకీయ వ్యవస్థ నిర్మాణం కోసం దశాబ్దాలుగా లోక్‌సత్తా కృషి చేస్తోందని వారన్నారు. అంబేద్కర్ రాజ్యాంగ రూపశిల్పి మాత్రమే కాదని, ఈ దేశంలో రాజకీయాలు సహా వివిధ రంగాలలో మౌలిక మార్పులకు రాజ్యాంగబద్ధ పద్ధతుల్లో స్వయంగా కృషి చేసి చూపిన మహా నాయకుడు కూడా అన్నారు. ప్రజలకు రాజ్యాంగం పట్ల అవగాహన లేదనే ధీమాతోనే పాలకులు ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకుంటూ, తాత్కాలిక తాయిలాల్ని, ఉచితాల్ని పందేరం చేస్తూ, అరాచక ధోరణుల్ని ప్రోత్సహిస్తూ భవిష్యత్ తరాలతో చెలగాటమాడుతున్నారని లోక్‌సత్తా నేతలు అన్నారు. రాజ్యాంగ సంస్థలను బలోపేతం చేసుకోవటం, రాజ్యాంగ నైతికతను పరిరక్షించుకోవటం ఈవేళ ఎంతో అవసరమన్నారు. రాజ్యాంగంలో ఏవైనా లోపాలుంటే దిద్దుకునే అవకాశం రాజ్యాంగంలోనే ఉందన్నారు. యువత రాజ్యాంగం పట్ల అవగాహన పెంచుకుంటూ రాజ్యాంగబద్ధ పద్ధతుల్లో ప్రభుత్వాలను ప్రశ్నించగలగాలని, రాజ్యాంగాన్ని కాగితాల నుండి ఆచరణలోకి తేవాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ జిల్లాల్లో కూడా లోక్‌సత్తా నేతలు అంబేద్కర్‌కు నివాళులర్పించారు. రక్తదానం, చలివేంద్రాల ఏర్పాటు వంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


















ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

సంపుటి 25 సంచిక 05

మే 2022



సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

### కార్టూన్ కార్నర్




అప్పుడే యోగి రాజ్యమొచ్చిందంటావా!


కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్ట్స్, 71 , సోమాజీగూడ, త్రిబువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

# మీడియా స్వేచ్ఛపై పెరుగుతున్న నిర్బంధాలు - ఒత్తిళ్ళు

సంపాదకీయం

ప్రపంచ పత్రికా స్వేచ్ఛా సూచికలో భారత్ స్థానం గత కొన్నేళ్ళుగా దిగజారడం ఆందోళన కల్గించే పరిణామం. 180 దేశాల జాబితాలో గతంలో 142వ స్థానంలో ఉన్న భారత్ తాజాగా 150వ స్థానాన్ని పొందింది. పారిస్ కేంద్రంగా పనిచేసే' రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్' సంస్థ మే 3 ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం రోజున ప్రపంచ పత్రికా స్వేచ్ఛ స్థితిగతులపై ఒక నివేదిక విడుదల చేస్తోంది. ఆ వరుసలోని 20వ నివేదిక 2022 మే 3న విడుదల అయ్యింది. మీడియా స్వతంత్రత, మీడియాలో పనిచేసే వాతావరణం, స్వీయనియంత్రణ, చట్టబద్ధమైన ఏర్పాట్లు, పారదర్శకత, మీడియాకు గల మౌలిక సదుపాయాలు, మీడియాపై జరిగే దాడులు, మీడియా చేసే తప్పిదాలు, వాటికి చర్యలు వంటి పలు అంశాల ఆధారంగం పత్రికా స్వేచ్ఛ స్థితిగతులను అంచనా వేస్తారు. రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ సంస్థ పాత్రికేయులే నడిపే ఒక స్వచ్ఛంద సంస్థ.

ఒక ప్రశ్నావళిని జారీ చేసి దానికి వచ్చిన జవాబులను ఆధారం చేసుకుని పత్రికా స్వేచ్ఛ స్థితిగతులను అధ్యయనం చేసి, వివిధ దేశాలకు ర్యాంకింగులను ప్రకటిస్తారు. గత 20 ఏళ్లుగా ప్రతీ ఏటా ర్యాంకింగులు ప్రకటిస్తున్నారు. తాజా నివేదికలో మీడియాలో జరుగుతున్న విభజన రెండు రెట్లు పెరిగిందని, ఆయా దేశాలలో అంతర్గత విభజన తీవ్రతరం అవుతుండగా దేశాల మధ్య విభజన కూడా పెరుగుతోందని పేర్కొన్నది.

“సంప్రదాయకంగా బహుళత్వానికి పెద్దపీట వేసే భారతీయ మీడియాపై ఒత్తిళ్లు, వేధింపులు పెరుగుతున్నాయని' తాజా నివేదిక పేర్కొన్నది. 'ప్రభుత్వ అనుకూల పక్షపాత ధోరణులు పెరగడంతో పాటు భిన్నాభిప్రాయాలపై దాడి, విమర్శపై ఆంక్షలు, నిర్బంధాలు పెరుగుతున్నాయని నివేదిక పేర్కొన్నది. 'దేశద్రోహం, ఉగ్రవాద నిరోధక చట్టాలను వినియోగించి కేసులు పెట్టడం, అక్రమంగా నిర్బంధించడం ఒక ధోరణిగా ఉందని' నివేదిక ప్రస్తావించింది. గతేడాది ఒక జర్నలిస్టు హత్యకు గురికాగా, 13 మంది జైలు పాలయ్యారని కూడా ఉదహరించింది.

భారతదేశంలో 1 లక్షా 20 వేల పత్రికలు ఉన్నాయి. వాటి సర్క్యులేషన్ 17 కోట్లు, చదువరుల సంఖ్య 40 కోట్లు ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దాదాపు వెయ్యి టీవీ ఛానెళ్లు నడుస్తున్నాయి. అందులో 380 వరకూ ఇరవై నాలుగు గంటల వార్తా ఛానెళ్లు ఉన్నాయి. వంద కోట్ల మంది మొబైల్ ఫోన్ వినియోగదారులు ఉండగా అందులో 40 కోట్ల మంది ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్నారు. మీడియా / వినోద పరిశ్రమ రంగంలో పెట్టుబడులు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతూ వస్తున్నాయి. విదేశీ పెట్టుబడులను కూడా అనుమతించడంతో సాంకేతికంగా మీడియా వృద్ధి పరుగులు తీస్తోంది. మీడియాలో సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రభావాలు ఎలా ఉన్నా సాంకేతిక విప్లవం తీవ్ర మార్పులు తెస్తోంది. తరాల ఆలోచనలు, ప్రవర్తనా ధోరణులు, వాటి ప్రభావాలు మీడియాని ప్రభావితం చేస్తున్నాయి. సంప్రదాయకంగా మీడియాలో సంపాదకునికి గతం నుండీ ఉన్న ఆధిపత్య స్థానం గత మూడు దశాబ్దాలుగా అదృశ్యమైపోతూ వచ్చింది. ప్రస్తుతం కార్పొరేట్ ఆధిపత్యం సమాచారంపై గుత్తాధిపత్యం, పాలకపక్షాల చేతిలో మీడియాని బందీ చేస్తున్నది. ప్రస్తుతం దేశంలో మీడియాలోని 70 నుండి 80 శాతం యాజమాన్యాలు పాలకపక్ష అనుకూల ప్రచారానికి లోబడి పనిచేస్తున్నాయి. సామాజిక మాధ్యమాలలో సైతం ఇదే ధోరణి కన్పించడం మనం చూస్తున్నదే! చివరికి మీడియా స్థితి విశ్వాస సంక్షోభంలో పడింది.

భారతీయ మీడియారంగంలో పెట్టుబడుల కేంద్రీకరణ పెరిగిపోవడంతో సమాచారం ప్రసారం పూర్తి పక్షపాత ధోరణితో నిండిపోతోంది. అసలే అంతంతమాత్రంగా మిగిలిన సంపాదక స్వేచ్ఛ కాంట్రాక్టు ఉద్యోగ వ్యవస్థ కారణంగా పూర్తిగా అడుగంటింది. కార్మిక చట్టాల సవరణలో భాగంగా వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని, వేజ్‌బోర్డు వ్యవస్థనూ రద్దు చేశారు. దాంతో పాత్రికేయుల ఉద్యోగభద్రత, వేతన భద్రత గాలికి ఎగిరిపోయాయి. కొత్తగా తెచ్చిన కార్మికకోడ్‌లతో పాత్రికేయరంగానికి సంబంధించిన నియమాలు, విధివిధానాలు రూపొందించే పని ఇంకా మొదలు కాలేదు.

భారతీయ ప్రెస్ కౌన్సిల్‌కు గల అధికారాలు అంతంత మాత్రం కాగా, దాని పనివిధానాన్ని నీరు కార్చే ప్రక్రియ కొనసాగుతోంది. ప్రభుత్వం తన సొంత మనుషులతో నింపుకోవడానికి వీలుగా ప్రెస్ కౌన్సిల్ ఎన్నిక విధానాన్ని మార్చి వేశారు. ప్రస్తుతం ప్రెస్ కౌన్సిల్‌కు అధ్యక్షుని నియమించకపోవడంతో దాని పని స్తంభించిపోయింది. ప్రెస్ అక్రెడిటేషన్ నిబంధనలను ఏకపక్షంగా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో మార్చి వేసింది. రాష్ట్రాలలో సైతం ప్రభుత్వాలు తమ వంతుగా అక్రెడిటేషన్ నియమాలను మార్చి వేశాయి. పాత్రికేయుల ప్రాతినిధ్యం లేకుండా అధికారులతో మీడియా అక్రెడిటేషన్ కమిటీలను నింపివేసిన తీరు విస్మయం కలిగిస్తుంది. సెంట్రల్ ప్రెస్ అక్రెడిటేషన్ కమిటీలో జాతీయ జర్నలిస్టు సంఘాలకు గల ప్రాతినిధ్యాన్ని తీసేసి ప్రభుత్వం సొంత మనుషులతో కమిటీని ఏర్పాటు చేసింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలు మీడియా స్వతంత్రతను దెబ్బతీసే విధంగా తయారవుతున్నాయని స్పష్టం అవుతోంది. పత్రికాస్వేచ్ఛకు ప్రాధాన్యం ఇచ్చే ప్రాతిపదిక మన రాజ్యాంగంలో ఉంది. భావప్రకటనా స్వేచ్ఛను పత్రికా స్వేచ్ఛగా పరిగణిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పులు ఉన్నాయి.

స్వాతంత్రోద్యమంలో అత్యంత ప్రతిభావంతమైన పాత్ర పోషించిన భారతీయ మీడియా అనంతర కాలంలో జాతీయోద్యమ విలువలతో పనిచేసిన మాట తెల్సినదే!

అయితే మూడు, నాలుగు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులతో కార్పొరేట్ పరిశ్రమగా రూపాంతరం చెందిన మీడియా మొత్తం దేశ ప్రజల మనోగతానికి , ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించడం లేదు. యాజమాన్యాల, పాలక పక్షాల అడుగులకు మడుగులొత్తే వ్యవస్థగా రూపాంతరం చెందింది. అసమ్మతిని అణచివేయడంతో పాటు పాలక వ్యవస్థలకు అనుకూలంగా సమ్మతిని సృష్టించడంలో దేశంలోని అత్యధిక మీడియా సంస్థలు పాలుపంచుకుంటున్నాయి.

ప్రజాస్వామ్య మనుగడకు మూలాధారమైన మీడియా విశ్వసనీయత ప్రశ్నార్థకం అయిపోయింది. సోషల్ మీడియా సంగతి సరేసరి! పనిగట్టుకుని అసత్యాలను అర్థసత్యాలను, వక్రీకరణలను వ్యాప్తి చేసే ధోరణి పెరిగిపోయింది. ప్రపంచ పత్రికా స్వేచ్ఛాదినోత్సవం సందర్భంగా ఉరుగ్వే రిపబ్లిక్, యునెస్కో సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో 'డిజిటల్ ముట్టడిలో జర్నలిజం' అంశంపై జరిగిన చర్చలో పలు అంశాలు తెర ముందుకు వచ్చాయి. మీడియా స్వేచ్ఛ, పాత్రికేయుల భద్రత అత్యంత కీలకమైనవని ఆ సదస్సు పేర్కొన్నది. ప్రజాస్వామ్య హితైషులు తగిన విధంగా స్పందించాల్సిన అవసరం ఉందని రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ సంస్థ హెచ్చరిస్తున్న సంగతిని కూడా గమనించాల్సి ఉంది.

డి. సోమసుందర్

# యువత భవితను కాపాడేలా
# డ్రగ్స్‌పై ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా నమూనా చట్టం




ఇష్టారాజ్య విధానాలు, విచ్చలవిడి జనాకర్షక పందేరాలు, ఖజానా నిర్వహణలో కనీస క్రమశిక్షణ కూడా కొరవడటం, కుటుంబ రాజకీయాలతో మన దేశంలో కూడా కొన్ని రాష్ట్రాలు శ్రీలంక తరహా సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నాం. ఇప్పుడు ఇంకో తరహా ప్రమాదం కూడా వచ్చి పడుతోంది. కొలంబియా వంటి లాటిన్ అమెరికా దేశాల తరహాలో మాదక ద్రవ్యాల ఊబిలో కూడా కూరుకుపోయే దిశలో కొన్ని రాష్ట్రాలు పయనిస్తున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ సమస్య ఎప్పటి నుంచో ఉంది, పెరుగుతూ వస్తోంది. ఇటీవల బయటపడుతున్న కేసులు సమస్య తీవ్రతకు కొన్ని సాక్ష్యాల్ని అందించాయంతే. పంజాబ్‌లో పరిస్థితి అదుపు తప్పుతోందని కొన్నేళ్లుగా దేశమంతా అనుకుంటున్నా, మిగతా ప్రాంతాల్లో మరీ అంత లేదనే ధీమా ఉండేది. ఇటీవలి ఉదంతాలు ఆ భ్రమను కాస్తా బద్దలుకొడుతున్నాయి. .

కొవిడ్ బయటపెట్టిన మన డొల్లతనాల్లో డ్రగ్స్ తీవ్రత కూడా ఒకటి.

అవును, కొవిడ్ వచ్చాక మత్తు మందుల వినియోగం గణనీయంగా పెరిగింది. ఇది సెలబ్రిటీలు, సంపన్నులకే పరిమితమైన సమస్య కాదు. చాప కింద నీరులా మొత్తం సమాజాన్ని పిప్పిచేసేలా విస్తరిస్తున్న జాడ్యమని కూడా తెలిసొచ్చింది.

లాక్‌డౌన్ కాలంలో మన సమాజంలో డ్రగ్స్ వినియోగం ఎలా జడలు పరచుకున్నది, పలు కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో మత్తు విక్రయాలు జోరుగా ఎలా సాగుతున్నది, మాల్ గప్‌చిప్‌గా ఎలా చేతులు మారుతున్నది, దీని వెనక మాఫియా ముఠాలు రాజకీయ, పాలనా వ్యవస్థలతో ఎలా పెనవేసుకుపోయాయి, పాలకుల పాపం వల్ల కొనసాగుతున్న వ్యవసాయ సంక్షోభం ఎలా మత్తు పంటల సాగుకు దారితీస్తోంది, సరైన విద్య, ఉపాధి అవకాశాలులేక నిరుద్యోగం కోరల్లో చిక్కుకున్న యువత ఎలా పావులుగా మారుతున్నారు.. వంటి అంశాలు క్రమంగా బయటపడుతూ వచ్చాయి. ముంబయిలో సినీ నటుడు షారూక్ ఖాన్ కొడుకు, ఇంకొందరు సెలబ్రిటీలపై కేసులు, ఆంధ్రప్రదేశ్‌లోని ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సాగు, హైదరాబాద్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న ఓ పబ్‌లో సెలబ్రిటీలు, సంపన్నుల పిల్లలు సహా పలువురు పట్టుబడటం, విజయవాడ పరిసరాల్లో కొందరు పాఠశాల విద్యార్థులు సైతం మత్తు పదార్థాలు వినియోగించటం లాంటివి రచ్చకెక్కి మీడియాలో దుమారం

రేగటంతో సమస్య తీవ్రత, గతం కంటే వేగంగా డ్రగ్స్ విస్తరిస్తున్న వైనం వెలుగులోకి వచ్చాయి.

ఆంధ్రప్రదేశ్ పోలీసులు 2021 అక్టోబర్‌లో 'ఆపరేషన్ పరివర్తన' పేరుతో గంజాయి పంట నిర్మూలనకు చర్యలు చేపట్టారు. విశాఖ నుండి గోదావరి జిల్లాల వరకు ఏజెన్సీ గ్రామాలపై నిఘా పెంచి దాడుల్ని ముమ్మరం చేశారు. ఒక్క విశాఖ ఏజెన్సీలోనే దాదాపు రూ.8,600 కోట్ల విలువైన గంజాయి పంటను ధ్వంసం చేసినట్లు పోలీసు శాఖ ప్రకటించింది. విశాఖ మన్యంలో లభించే శీలావతి గంజాయి మన్యంలో కిలో రూ.2 వేలకు లభిస్తుండగా, ఇతర ప్రాంతాల్లో రూ.10 వేల వరకూ పలుకుతోంది. ఈ ఏజెన్సీలో 250కిపైగా గ్రామాల్లో గంజాయి సాగు చేస్తుండగా, ఒడిషా, జార్ఖండ్ వంటి రాష్ట్రాల నుండి కూడా విశాఖ మీదుగా సరకు వివిధ రూపాలలో హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు రవాణా అవుతోంది. ఏపీలో గత డిసెంబర్ నుండి మూడు నెలల వ్యవధిలో స్వాధీనం చేసుకున్న గంజాయే దాదాపు 50వేల కిలోల దాకా ఉంది.

తెలంగాణలో హైదరాబాద్, పరిసర ప్రాంతాలకే పరిమితమైన మత్తు మందుల వినియోగం క్రమంగా ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ మొదలైన జిల్లాలకు కూడా పాకుతోంది. ఇప్పటికే అక్కడ బెల్టు షాపుల వల్ల మద్యం విచ్చలవిడి అయిందని, లాక్‌డౌన్ తర్వాత మత్తు పదార్థాల వినియోగం కూడా పెరిగిందని చెబుతున్నారు. రామగుండం కమిషనరేట్ పరిధిలోని ఎన్‌టీపీసీ, గోదావరి ఖని, రామగుండం తదితర ప్రాంతాల్లో మత్తులో చిత్తవుతున్న యువత జులాయిగా తిరుగుతూ రోడ్డు మీద పోయేవారి మీద దాడులకు దిగుతున్నారని ఫిర్యాదులు వచ్చాయి. ముంబయి, పంజాబ్ సహా దేశంలోని వివిధ ప్రాంతాలలోని డ్రగ్స్ ముఠాలు హైదరాబాద్‌తో బలమైన సంబంధాల్ని నెలకొల్పుకున్నాయి. ఔషధ పరిశ్రమకు పేరుగాంచిన హైదరాబాద్‌లో ఏటీఎస్ తరహా మత్తుమందుల ఉత్పత్తి పెరిగింది. మూతపడ్డ పరిశ్రమల్లో నిపుణులైన సిబ్బందిని నియమించుకుని మరీ మత్తుమందుల తయారీ సాగిస్తున్నారు.

**త్రేతాయుగంలాంటి కాలంలోనూ**
**మత్తు వినియోగాన్ని ఆపలేరు..**
**నేటి యుగంలో అసలు ఆపలేరు**

అయితే సమస్య ఇలా ప్రమాదకరంగా మారుతున్నా.. మన ప్రతిస్పందన సమస్యని ఇంకా తీవ్రం చేసేలా ఉంది తప్ప పరిష్కారాన్ని అందించేలా లేదని ఇటీవల హైదరాబాద్‌లోని ఓ పబ్‌లో బయటపడ్డ డ్రగ్ ఉదంతం తెలియచేస్తోంది.

మాదక ద్రవ్యాల పట్ల మనకు ఎలాంటి అభిప్రాయమైనా ఉండొచ్చు.. కానీ వాటి వినియోగం ఉన్నకొద్దీ పెరుగుతుందే తప్ప తగ్గదనేది చేదు నిజం. ఇళ్లలోనే కాఫీ, టీల్లా మద్యం తాగే రోజులు వస్తాయని, అది గౌరవానికి కూడా భంగకరం కాకుండా అని కొన్ని తరాల క్రితం ఊహించగలిగామా!

దేశ జనాభాలో యువత అత్యధికంగా ఉండటం, సాంకేతికత ఉన్నకొద్దీ విస్తరిస్తుండటం, రకరకాల బట్వాడా యాప్‌లు అరచేతిలో ఉండటం, నగరీకరణలో కుటుంబ వ్యవస్థ బలహీనపడటం, అపరిచితులతో లావాదేవీలు పెరగటం, ముక్కూమొహం తెలియనివారి మధ్య వినోదాలు, ఆహార విహారాలు, పోటీ ప్రపంచంలో ఒత్తిడి వంటి కారణాల రీత్యా డ్రగ్స్ వ్యాప్తికి గతంలో ఎన్నడూ లేని స్థాయి అవకాశాలు ఇప్పుడున్నాయి. అందువల్ల మాదక ద్రవ్యాలు అనూహ్య స్థాయిలో రకరకాలుగా విస్తరించటమే కాకుండా, వాడకం బలంగా వేళ్లూనుకుపోతోంది. ఎవరూ ఆపలేని మార్గాలివి. మత్తు పదార్థాల వ్యాప్తిని అరికట్టటం ఈ కలికాలంలో మాత్రమే కాదు, ధర్మం నాలుగు పాదాల్లో నడిచిందని చెప్పుకునే త్రేతాయుగంలాంటి కాలంలో కూడా అసాధ్యమే. అందుకే మన భారతీయ పరంపరలో గంజాయి వినియోగం కూడా భాగంగా వస్తోంది.

గంజాయి దమ్ము, చరస్, భంగ్ వినియోగం మన ప్రాచీన సాహిత్యంలో వివిధ సందర్భాల్లో కనిపిస్తుంది. కుటుంబ విలువలకు పెద్దపీట వేసే మన సమాజంలో వీటికి ఎందుకు స్థానం కల్పించారోనన్న వివేచన లేకుండా, ఏదో అమెరికాలో చేశారని మన దేశం కూడా సుమారు 37 ఏళ్ల క్రితం గంజాయి వినియోగాన్ని నిషేధించింది (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టెన్సెస్ చట్టం, 1985). మాదక ద్రవ్యాల వినియోగంలో ఎవరి పట్ల, ఏయే కోణాల్లో కఠినంగా వ్యవహరించాలో లోతైన అధ్యయనం చేయకుండా, గుడ్డిగా అమెరికాను అనుకరించి వినియోగదారుల్ని దోషులుగా చేసే పద్ధతి వల్ల తాత్కాలికంగా సమాజంలో సంచలనం, ఆమోదం లభిస్తుండవచ్చుగానీ.. చాలా ప్రమాదకరమైన పరిణామాల్లోకి అది దేశాన్ని నెడుతోంది. 2019లో యూనియన్ సామాజిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. చట్టవిరుద్ధంగా గంజాయిని వినియోగిస్తున్నవారు దేశంలో సుమారు 1.3 కోట్ల మంది ఉన్నారు. చట్టబద్ధమైన భంగ్ తాగేవాళ్లు మరో 2.2 కోట్ల మంది ఉన్నారు.

ఐక్యరాజ్యసమితి 2021లో విడుదల చేసిన మాదక ద్రవ్య నివేదిక కూడా భారత్‌ను హెచ్చరించింది. 2019లో ప్రపంచంలో 15-64 వయసులో వారు 5.5 శాతం మంది ఏదో ఒక మాదక ద్రవ్యాన్ని వినియోగించినవారేనని, భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో డ్రగ్స్ వినియోగం రాబోయే కాలంలో మరింత పెరుగుతుందని తెలిపింది.

ఒకసారి డ్రగ్ సంస్కృతి అలా వ్యాపిస్తూ కమ్మేసిందంటే, దాన్నుంచి ఒక సమాజంగా బయటపడటం ఎంతో కష్టమైన పని. లాటిన్ అమెరికా దేశాలు ఎన్ని దశాబ్దాలుగా పోరాడుతున్నాయో కథలు కథలుగా వింటూనే ఉన్నాం, సినిమాలుగా ఓటీటీ యుగంలో కూడా చూస్తూనే ఉన్నాం.

**గంజాయిపై నిషేధం ఎత్తివేత వల్ల కాలిఫోర్నియాకు ట్రిలియన్ డాలర్ల ఆదాయం**

గంజాయి వినియోగాన్ని అమెరికాను చూసి నిషేధించాం. కానీ ఆ పాలసీ విఫలమైందని గుర్తించి అమెరికాలోని కాలిఫోర్నియా వంటి రాష్ట్రాలు గంజాయి వాడకాన్ని నేర నిర్వచనం నుండి తప్పించాయి. వైద్య అవసరాలకే కాకుండా సరదా కోసం గంజాయి సేవనం ఇప్పుడు అక్కడ పలు రాష్ట్రాల్లో నేరం కాదు. అయినా మనం ఇంకా కొన్నేళ్లు చూద్దామన్నట్లు తాత్సారం చేస్తున్నాం. భవిష్యత్ భారతంతో చెలగాటమాడుతున్నాం. ఇటీవల ఒక సీనియర్ జర్నలిస్టు తన కాలమ్‌లో స్వీయ అనుభవాన్ని వివరిస్తూ గంజాయిపై నిషేధాన్ని ఎత్తివేయండి మహాప్రభో అని మొత్తుకున్నారు. తాను గంజాయి పీల్చానని, దాని వల్ల తన మనసంతా దూదిపింజలా తయారైందని, అయితే తన భావాలను స్పష్టంగా వ్యక్తం చేయలేకపోయానని, అందువల్ల తాను ఆరోజు నుండి ఎప్పుడూ గంజాయి వాడలేదని తెలిపారు. అలాగే తన మిత్రుల్లో గంజాయి, హషిష్, చరస్ పీల్చే అలవాటున్నవారెవరూ హెరాయిన్, ఓపిఆయిడ్/ఓపీఎం, కొకైన్ వంటి ప్రమాదకరమైన డ్రగ్స్‌కి బానిసలవలేదని తెలిపారు.

దేశంలో కోట్ల మంది గంజాయిని సేవిస్తున్నప్పుడు, అది ప్రమాదకరం కానప్పుడు నిషేధించటం అర్థరహితమే కాదు, ఆర్థిక భారం కూడా. నార్కోటిక్ కేసులలో కూడా 60% వ్యక్తిగత వినియోగానికి సంబంధించినవే, చిన్న పరిమాణంలో ఉన్న ప్యాకెట్లే తప్ప సరఫరాకు ఉద్దేశించినవి కావు. గంజాయి వినియోగం, యాదృచ్ఛికంగా ఏదో ఒకసారి డ్రగ్స్ వాడకంలో అరెస్టులు, కేసులు, కోర్టు విచారణలు లేనిపోని భారమే తప్ప ప్రభుత్వం సాధించేదేమీ ఉండదు.. ఎంతమందిని జైల్లో పెడతారు? 2018 జనవరిలో గంజాయిపై నిషేధాన్ని ఎత్తివేశాక కాలిఫోర్నియాకు దాదాపు 1 ట్రిలియన్ డాలర్ల ఆదాయం సమకూరింది.

ఇంకా విచిత్రమేమంటే, ఐక్యరాజ్యసమితి కమిషన్ ప్రవేశపెట్టిన తీర్మానంలో 1961 ఒప్పందంలోని షెడ్యూల్ 4లోని హెరాయిన్ వంటి ప్రమాదకర మాదక ద్రవ్యాల జాబితా నుండి గంజాయిని తొలగించటానికి అనుకూలంగా భారత్ ఓటు చేసి కూడా స్వదేశంలో స్వల్ప పరిమాణంలో గంజాయి సేవించినవారిని కూడా బజారుకీడుస్తూ పోలీసు కేసులతో వేధింపులకు గురిచేస్తుండటం. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గురించి మాట్లాడేవారు సైతం మన పరంపరను హేతుబద్ధంగా విశ్లేషించుకుని ఈ విషయంలో ఆచరణాత్మకంగా ఆలోచన చేయలేకపోతున్నారు.

మన దేశంలో మధ్యతరగతి యువత గంజాయిని ఎక్కువగా పీలుస్తుంటే, సంపన్నులు కొకైన్, హెరాయిన్ వంటివి తీసుకుంటున్నారు. ప్రమాదరహితమైన గంజాయి వినియోగమే ఎక్కువగా ఉన్నప్పటికీ, మన డ్రగ్ పాలసీ సక్రమంగా లేకపోవటం వల్ల ప్రమాదకరమైన ధోరణులు పెరుగుతున్నాయి. గంజాయి పీల్చటం, గంజాయి సరఫరా – ప్రమాదకర మాదక ద్రవ్యాల వినియోగం, సరఫరాల మధ్య తేడాను చెరిపేసేలా మన ప్రస్తుత చట్టం నేరముఠాలకు అవకాశమిస్తోంది. పంజాబ్, మహారాష్ట్ర వంటి చోట్ల ప్రమాదకరమైన కృత్రిమ మాదక ద్రవ్యాల వాడకం పెరుగుతోంది. డ్రగ్స్ దందాలో కొందరు రాజకీయ నేతల పాత్ర ఉండటంతోపాటు కొన్ని చోట్ల ఎన్నికల్లో కూడా డబ్బు, మద్యం తరహాలో మాదక ద్రవ్యాల్ని పంచుతున్నారు. మాదక ద్రవ్యాలు వాడేవారు పెరుగుతుండటంతో అక్రమ మార్గాల్లో సరఫరా కూడా పెరుగుతోంది. రసాయనాల పూత పూసిన మాత్రలు, చూర్ణం, ద్రవాల రూపంలో పదేళ్ల క్రితం వరకు 25 రకాలున్న సింథటిక్ డ్రగ్స్.. చౌక ప్రత్యామ్నాయాలుగా వివిధ దేశాల్లో దాదాపు 700 వరకు చేరినట్లు ఐక్యరాజ్యసమితి మాదక ద్రవ్యాలు నేరాల నియంత్రణ కార్యాలయం వెల్లడించింది.

మన సామాజిక పరిస్థితులు, ప్రపంచ దేశాల అనుభవాలు, వైద్యులు, ఇతర నిపుణుల అభిప్రాయాలను అధ్యయనం చేసి మాదక ద్రవ్యాలపై భారత్ ఒక సమగ్ర చట్టాన్ని తీసుకురావటాన్ని ఇక ఏమాత్రం ఆలస్యం చేయకూడదు.

గంజాయి కంటే ప్రమాదకరమైన నికోటిన్, సారాయికి లైసెన్సు ఇచ్చి, ఎడిక్షన్‌కి అవకాశంలేని గంజాయిని నిషేధించి ప్రభుత్వమే సమస్యను పెంచుతోందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ లాంటి వారు ఎప్పటి నుండో చెబుతున్నారు. భారతదేశం నిర్మూలించాల్సిన ఏడు జాడ్యాలలో మత్తుపదార్థాలు ఒకటన్నది లోక్‌సత్తా భావజాల పాఠం. ముంబయి నుండి హైదరాబాద్ వరకు ఇటీవలి పరిణామాల నేపథ్యంలో మాదక ద్రవ్యాలపై సమగ్రమైన నమూనా చట్టాన్ని తీసుకొచ్చేందుకు జేపీ అధ్యయనం చేస్తున్నారు.

**సామాన్యుల్ని బలిపశువుల్ని చేసే పద్ధతి మాని.. సప్లయ్‌దారులను అణచివేసేలా చట్టం ఉండాలి**

"డ్రగ్స్‌పై ఇప్పుడున్న విధానాలు మారాలి. ఈ మాట చాలా స్పష్టంగా చెబుతున్నాను. ఈమధ్య కాలంలో చాలా చర్చ జరుగుతోంది ముంబయి నుండి హైదరాబాద్ దాకా. మనం చాలా ప్రమాదకరమైన పరిస్థితుల్లోకి వెళ్లబోతున్నాం. గుడ్డెద్దు చేలో పడ్డట్టు మాదక ద్రవ్యాల చట్టాన్ని అమలు చేస్తున్నాం. ఆ చట్టమే చాలా లోపభూయిష్టమైనది. చాలా పొరపాటైన చట్టం. 1985లో, ఉదాహరణకి, గంజాయిని నిషేధించి దీన్లో చేర్చారు. అప్పటిదాకా ఈ జాబితాలో లేదు" అని జేపీ అన్నారు.

"నా చిన్ననాడు గుర్తున్నది. గంజాయి మొక్కలు దొరికేవి. మనకు సామెత కూడా ఉంది. తులసి వనంలో గంజాయి మొక్క అని. అంటే గంజాయి కలుపుమొక్కలాగా అన్నిచోట్లా పెరుగుతుంది. ఆరోజుల్లో ఓపీయం కూడా ఉండేది. ఓపీయం మొక్కలు కూడా ఉండేవి. డ్రగ్స్‌పై హేతుబద్ధమైన విధానాలు చేపట్టకుండా గుడ్డెద్దు చేలో పడ్డట్టు చేపట్టాం. ఈవేళ ప్రపంచమంతా మార్చుకుంది. అమెరికాలో 26 రాష్ట్రాల్లో

# ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతోంది..

మహిళలు మరింత వేగంగా 'మత్తు'కు బానిసలవుతున్నారు మత్తుమందుల వినియోగం మునుపెన్నడూ లేనంతగా ప్రజారోగ్యానికి పెనుముప్పుగా మారుతోందని ఐక్యరాజ్యసమితికి చెందిన 'మత్తుమందులు, నేరాల నిరోధక సంస్థ' (యూఎన్‌వోడీసీ) నివేదిక కోవిడ్‌కు ముందే హెచ్చరించింది. కొకైన్, ఓపీయం (నల్లమందు)ల ఉత్పత్తి గతంలో ఎన్నడూలేని గరిష్ఠ స్థాయికి చేరుకున్నట్టు తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా మత్తుమందుల సరఫరాతోపాటు ఆరోగ్యంపై వాటి ప్రభావాన్ని కూడా వివరించింది.
ఈ నివేదిక ప్రకారం.. ఔషధరంగ వినియోగం కోసం ఉత్పత్తి చేసే మత్తుమందులను అక్రమమార్గంలో ఉపయోగిస్తున్నవారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. మొత్తంగా మత్తుమందుల వల్ల సంభవిస్తున్న మరణాల్లో ఔషధరంగ మత్తుమందులను దుర్వినియోగం చేస్తుండటంతో సంభవిస్తున్న మరణాలే 76 శాతంగా ఉంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఓపీయం ఉత్పత్తి 2016–17 తర్వాత 65 శాతం పెరిగి.. 10,500 టన్నులకు చేరింది. 2016లో కొకైన్ ఉత్పత్తి 1,410 టన్నులకు పెరిగింది. మత్తుమందులు తీసుకునేవారిలో అత్యధికులు పురుషులే. ఆందోళన, మానసిక ఒత్తిడిని తగ్గించే ఔషధరంగ మత్తుమందులను వైద్య అనుమతి లేకుండా తీసుకోవడంలో మహిళలు కూడా పురుషులతో సమానస్థాయిలో ఉన్నారు. మగవారితో పోలిస్తే స్త్రీలు కాస్త పెద్ద వయసులో మత్తుమందులు తీసుకోవడం ప్రారంభిస్తున్నారు. కానీ, ఒక్కసారి వాటిని ఉపయోగించడం ప్రారంభిస్తే.. పురుషుల కంటే వేగంగా మహిళలు మద్యం, గంజాయికి బానిసలుగా మారుతున్నారు.

# డ్రగ్స్ ఉత్పత్తిలోనూ వేగంగా పెరుగుతున్న ఇండియా

వినియోగంలోనే కాకుండా మాదక ద్రవ్యాల ఉత్పత్తిలోనూ మన దేశం వేగంగా పెరుగుతోంది. ప్రపంచ మాదక ద్రవ్యాల నివేదిక–2020 ప్రకారం, ఓపీయం, మార్ఫిన్, హెరాయిన్ ఎగుమతుల్లో మన దేశం వరుసగా నాలుగు, ఏడు, పన్నెండు స్థానాల్లో నిలిచింది. యాంఫిటమైన్ టైప్‌స్టిమ్యులెంట్లు (ఏటీఎస్) తరహా రసాయన మత్తు మందుల తయారీ పరిశ్రమలు ఆసియా ఖండం మొత్తమ్మీద మయన్మార్, ఇండియాల్లోనే అత్యధికంగా ఉన్నాయి.

# డ్రగ్స్‌తో పెచ్చరిల్లే వ్యాధులు

హెరాయిన్, నల్లమందు, సింథటిక్ మాదక ద్రవ్యాల వాడకం వల్ల కాలేయ క్యాన్సర్, సిరోసిస్, ఎయిడ్స్, హెపటైటిస్ సి వంటి వ్యాధులు పెచ్చరిల్లుతాయి. డ్రగ్స్‌తో ఏటా దాదాపు 1.3 కోట్ల అకాల మరణాలు చోటు చేసుకుంటున్నాయి.

గంజాయిని చట్టబద్ధం చేసి దాన్నుంచి పన్నులు సేకరిస్తున్నారు. కొన్ని వేల కోట్లు పన్నులు వస్తున్నాయి. గంజాయి ఎడిక్షన్ వచ్చేది కాదు. అలవాటుకు మనిషిని బానిసను చేసేది కాదు. తీసుకున్న వ్యక్తికి కొంచెం కిక్ వస్తుంది. నా దృష్టిలో ఆ వాడకం కూడా చేయకుండా ఉంటే మంచిది. కానీ మనమెవరం చెప్పటానికి బలవంతంగా. మీ జీవితం మీరు నిర్ణయించుకుంటారుగానీ బలవంతంగా ఇంకొకళ్లు నిర్ణయించలేరు. నేను తాగను, ఇంకొకళ్లు తాగొద్దని నేనెలా చెబుతాను. రేయ్, ఒక పరిధిలో ఉండు, తాగి డ్రైవ్ చేయకు.. ఇలాంటివి చెప్పగలంగాని!

"నాకు గంజాయి లాంటివి పడవు. ఒకళ్లకి అది ఉందని చెబితే మనకెందుకు. వాడి జీవితం వాడిది. అంచేత ఎక్కడ మనం నిషేధించాలి? మాదక ద్రవ్యాలు ఎడిక్షన్‌కు దారితీసినప్పుడు నిషేధించాలి. భౌతికంగా దానిపై ఆధారపడి శరీరం కుళ్లిపోయే పరిస్థితి వస్తే అక్కడ కఠినంగా మనం నియంత్రించాలి. అక్కడ కూడా ఏం చేయాలీ? ఏదో బాల్యచాపల్యంతో, యవ్వన చాపల్యంతో చిన్న చిన్న సిగరెట్లు ఇష్టం లేకున్నా తాగుతారు చిన్నప్పుడు. ఎందుకని?– రెబిలియన్. తల్లిదండ్రుల మీద, పెద్దవాళ్ల మీద ఎదురుతిరగటానికి అదొక చిహ్నం. ఆ వయసులో దాదాపు ప్రతివారూ తల్లిదండ్రుల మీద ఎదురుతిరుగుతారు. చిన్నప్పుడు పల్లెటూరులో పదేళ్ల వయసులో నాకు గుర్తింది – గోగు పుల్లల పొగను ఊదాం. ఆ పొగ పీల్చితే చాలా ప్రమాదకరం. ఇలా పీల్చి అలా వదిలేసేవాళ్లం. ఏంటది, గోగు పుల్లల మీద మోజు కాదు, రెబిలియన్. కాబట్టి అలా తెలిసో తెలియకో వినియోగం చేసినవారి మీద కాదు పడాల్సింది. అలాంటివవారిని కాపాడటమెట్లాగ? ఎడిక్షన్ లేకుండా డీఎడిక్షన్ చేయట మెట్లాగ? సరఫరా గొలుసులు ఆపటానికి కఠినంగా నియంత్రించటమెట్లాగ? అని ఆలోచించి వ్యవహరించాలి.

"కానీ మనమేం చేస్తున్నాం.. పొరపాటున గంజాయి స్మోక్ చేశాడని చెప్పి, వాడిని భయంకర నేరస్తుడిగా చిత్రించి, టీవీ కెమెరాల ముందుంచి, వాడికి బెయిల్ కోసం కొన్నిచోట్ల కోట్ల రూపాయలు లంచాలు తీసుకుని వేధిస్తున్నారు. మనం చూశాం పత్రికల్లో ఆ షారూక్‌ఖాన్ కొడుకు గురించి. చివరికి అతని దగ్గర డ్రగ్స్ లేను కూడా లేవు, పక్కవాడి దగ్గర ఉన్నాయి. అంటే ఏం చేశాం మనం, ఈ అవినీతి పెరగటానికి, ప్రజల్ని వేధించటానికి, సామాన్యుల్ని నేరస్తులుగా చిత్రించటానికి,

## యూఎన్ఓడీసీ నివేదిక 2021 ప్రకారం..

+ మన దేశంలో 2020లో అధికారికంగా 51,101 డ్రగ్స్ కేసులు నమోదయ్యాయి. 3.9 లక్షల కిలోల గంజాయి, 3 వేల కిలోల ఓపీయం, 2 వేల కిలోలకు పైగా హషిష్, 3 వేల కిలోల హెరాయిన్, రెండున్నర కోట్ల కృత్రిమ డ్రగ్స్ ట్యాబ్లెట్లు పట్టుబడ్డాయి.

+ 2019 చివరి నాటికి ప్రపంచ వ్యాప్తంగా 20 కోట్ల మంది గంజాయి వినియోగిస్తున్నారు. ఇది ప్రపంచ జనాభాలో 4 శాతం. కొకైన్‌ను రెండు కోట్ల మంది ఉపయోగిస్తున్నారు.

+ 2020-21లో ప్రపంచ వ్యాప్తంగా 27.5 కోట్ల మంది డ్రగ్స్‌ను వినియోగించారు. ఇందులో 36 లక్షల మంది తీవ్ర అనారోగ్యం, ఇతర సమస్యల బారిన పడ్డారు.

+ కరోనా ప్రభావం చూపిన గత రెండేళ్లలో కొన్ని ప్రాంతాల్ని మినహాయించి ప్రపంచ వ్యాప్తంగా డ్రగ్స్ వినియోగం దాదాపు 20 శాతం పెరిగింది.

+ ప్రస్తుత పరిస్థితుల ప్రకారం.. 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా మరో 3-4 కోట్ల మంది డ్రగ్స్ బారిన పడతారని అంచనా. + డ్రగ్స్ డీ ఎడిక్షన్ చికిత్సలో వినియోగించే మెథడోన్ వంటి మందులు 50 శాతం దేశాల్లోనే అందుబాటులో ఉన్నాయి.

+ ఇంజెక్షన్ల ద్వారా డ్రగ్స్ తీసుకోవటం వల్ల కోటి మందికి హెచ్ఐవీ, హెపటైటిస్ సి, ఇతర వ్యాధులు సోకాయి.

+ మానవ అక్రమ రవాణా, దోపిడీలు, హత్యలు, గృహహింస, వేధింపులు వంటి ఎన్నో నేరాలకు డ్రగ్స్ వినియోగం కారణమవుతోంది.

యువత మొత్తాన్నీ కూడా ఒక భయంకర వలయంలోకి జారటానికి మార్గంగా డ్రగ్స్ వ్యవహారాన్ని తయారుచేశాం.

"చాలా లోతైన అవగాహనతో చట్టాల్ని మార్చాలి, విధానాల్ని మార్చాలి. గంజాయి లాంటి వాటిని అమెరికాలాంటి దేశాల్లోలా, మన దేశంలో 1985 దాకా ఉన్నట్లుగా నియంత్రించకుండా లైసెన్సు ఇవ్వండి, పన్నులు గట్టిగా తీసుకోండి. సిగరెట్ లేదా సారాయి మీద పన్నులున్నాయి. దీనిపైనా బాగా పన్నులు తీసుకోండి. ఆదాయం కూడా పెరుగుతుంది. కానీ నిషేధించబోకండి. అది ఆరోగ్యానికి హానిచేయటం కానీ, శరీరం బానిస కావటం కానీ లేదు. వైద్యపరమైన అంశం. కానీ మిగతావి, ఓపీయం (నల్లమందు) లాంటి వాటికి నిజంగా బానిస అవుతారు. అవి తీసుకుంటే శరీరం అలవాటు పడిపోతుంది. సారాయికి బానిస అయిపోయాక, ఇక మనిషి తట్టుకోలేడు. సారాయి లేకపోతే చేతులు వణికిపోతాయి, నాలుక పిడచగట్టుకుపోతుంది, శరీరమంతా గందరగోళమైపోతుంది. ఫిజికల్ డిపెండెన్స్ అన్నమాట. ఓపీయం లాంటి డ్రగ్స్‌కి ఆ సమస్య ఉంది. వాటిని కచ్చితంగా మనం నిరోధించాలి. కానీ అది తీసుకున్నవాడిని కాదు మనం శిక్షించాల్సింది. వాడికి అది వైద్యపరమైన అంశంగా గుర్తించి, డీఎడిక్షన్, డీటాక్సిఫికేషన్, కౌన్సెలింగ్ చేయండి. సప్లయ్‌దారులను పూర్తిగా అణచివేసేట్లుగా చట్టాన్ని పెట్టి కఠినంగా అమలు చేయండి. మనమేం చేస్తున్నాం, కోట్లాది మంది సామాన్య ప్రజల్ని బలిపశువుల్ని చేసి, వాళ్లని భయపెట్టి లంచాలు మింగి, మీడియాలో విపరీత ప్రచారం చేసి ఆర్భాటం చేస్తున్నాం, ఫలితం రావటంలా. ఇది పద్ధతి కానేకాదు. ప్రపంచంలో చాలాచోట్ల ప్రయోగాలు జరిగాయి. అమెరికా లాంటి చోట, పోర్చుగల్ లాంటి దేశాల్లో. పోర్చుగల్‌లో ఒకప్పుడు భయంకరంగా బానిసలయ్యారు మత్తు పదార్థాలకి. వాళ్లు హేతుబద్ధ విధానాలు అమలు చేశాక, మత్తు మందులకు బానిసలయ్యేవాళ్లు తగ్గారు, చచ్చిపోయేవాళ్లు తగ్గారు, నేరాలు తగ్గాయి, నేర ముఠాలు అదుపులోకి వచ్చాయి. ప్రపంచమంతా కోకొల్లలుగా ఉదాహరణలున్నాయి. మనం అవేం లేకుండా గుడ్డిగా ఒక చట్టం చేస్తాం. ఆ చట్టంలో ఇష్టమొచ్చినట్లు సర్వాధి కారాలు ఇస్తాం, తెలిసో తెలియకో గంజాయి సేవించాడని వాటితో వేధిస్తాం, ఒక కుటుంబాన్ని పట్టుకుని వీధులపాలు చేస్తాం. లక్షల రూపాయలు వసూలు చేస్తాం. ఇది పద్ధతి కాదు.

## నాగరికత ప్రారంభమైన నాటి నుండి కూడా

ప్రపంచంలో నాగరికత ప్రారంభమైన ఆరేడు వేల ఏళ్ల క్రితం నుండే గంజాయి సహా కొన్ని రకాల మాదక ద్రవ్యాల వినియోగం ఉండేదని చరిత్రకారుల అంచనా. భారత్‌లో నల్లమందు ఉత్పత్తి, చెలామణిని ఒక పెద్ద పరిశ్రమగా తయారు చేసిన బ్రిటిషర్లు మన పొరుగున ఉన్న చైనాతో అందుకోసం యుద్ధాలు కూడా చేశారు. 19వ శతాబ్దం చివరి నాటికి పొరుగున ఉన్న చైనాలో నల్లమందుకు బానిసైనవారు 1.5 కోట్ల మంది ఉన్నారని అంచనా. ఆ డ్రగ్ పంపిణీ హక్కు కోసం బ్రిటన్ చైనాతో రెండు యుద్ధాల్ని చేసింది. ఈ సంక్షోభం నుండి కోలుకోవటానికి చైనాకు అనేక దశాబ్దాలు పట్టింది.

"హేతుబద్ధ విధానాలు, రాజ్యాంగ పద్ధతులు అధ్యయనం చేసి, నిపుణులతో కూర్చుని ఒక ప్రామాణిక చట్టాన్ని రూపొందిస్తున్నాం.

"ఈవేళ్టి డ్రగ్ సమస్య రేపొద్దున కచ్చితంగా అనేక రెట్లు

# కుటుంబం, పాఠశాల, సరైన చట్టం కీలకం

ఒకసారి, రెండుసార్లు మాదక ద్రవ్యాలు సేవించినవారిని జైళ్లలో పెట్టడం మొదలుపెడితే ఉన్న కారాగారాలు చాలవు. ఇలాంటి కఠినచట్టం వల్ల లక్షలమంది జైళ్లలో మగ్గినా డ్రగ్స్ భూతం అదుపులోకి రాలేదని అమెరికా అనుభవం చెబుతోంది. వీటన్నిటినీ పరిగణలోకి తీసుకుని మనదేశం డ్రగ్స్ కట్టడికి చర్యలు తీసుకోవాలి. కుటుంబం, పాఠశాల/కళాశాల, చట్టసవరణ.. ఈ మూడు చోట్లా చర్యలుండాలి. పిల్లలు, యువత ప్రవర్తనను అప్రమత్తంగా గమనిస్తూ, వారికి ప్రేమతో విలువల్ని, వ్యక్తిగత, సమాజ ప్రయోజనాలను తెలియచెప్పటానికి కుటుంబంలో మంచి అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులు, ఇతర సభ్యులు ఈ విషయంలో తమ వంతు బాధ్యతను సక్రమంగా నెరవేర్చితే, సమస్యను నిరోధించవచ్చు, ప్రాథమిక దశలోనే నియంత్రించవచ్చు. డ్రగ్ ఎడిక్షన్ దశలో కూడా కుటుంబసభ్యుల తోడ్పాటుతో నయం చేయవచ్చు. ఇక విద్యాసంస్థల్లో, ముఖ్యంగా పాఠశాలల్లో.. తల్లిదండ్రుల భాగస్వామ్యంతో కౌన్సెలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఇందులో ఉపాధ్యాయులు కూడా చురుకైన పాత్ర పోషించాలి. మూడోది చట్టం! చట్టాలు కఠినంగా, అమలు అధ్వాన్నంగా ఉండటం మనదేశంలో ఆనవాయితీ. ఈ ధోరణి మారాలి. చట్టాలు తేలిగ్గా, ఆచరణసాధ్యంగా, వాటి అమలు మాత్రం కఠినంగా ఉండాలి. ఇప్పుడున్న యాంటీ డ్రగ్ చట్టాన్ని కూడా అదేరీతిలో మార్చాలి. పరిస్థితుల ప్రభావంతో డ్రగ్స్ తీసుకున్నవారిని, అప్పుడప్పుడు తీసుకున్నవారిని కౌన్సెలింగ్‌కే పరిమితం చేయాలి. గంజాయిలాంటివి మాదక ద్రవ్యాల జాబితా నుండి తొలగించాలి. పెద్దగా ప్రభావం చూపని గంజాయి వాడేవారిని, అప్పుడప్పుడు సేవించినవారిని కూడా నేరస్తులుగా పరిగణిస్తే డ్రగ్ మాఫియాకు బలం చేకూరుతుంది. సాధ్యమైనంత వరకు డ్రగ్ మాఫియాకవలలో ప్రజలు చిక్కకుండా నిబంధనలుండాలి. డ్రగ్స్‌తో వ్యాపారం చేసేవారి పట్ల మాత్రం సరైన విచారణా ఏర్పాట్లతో కఠినమైన చర్యలుండాలి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు ఈ సమస్య చాలా రాష్ట్రాల్లో ఉంది. పంజాబ్ వంటి చోట్ల ప్రమాదకరంగా ఉంది. వేగంగా విస్తరిస్తోంది. అందుకే రాష్ట్రాలు తమ పరిధిలో కుటుంబం, పాఠశాల, తెలివైన చట్టం.. కోణాల్లో చర్యలు తీసుకుంటూనే జాతీయస్థాయి ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటుండాలి. అప్పుడే మాదక ద్రవ్యాలను చాలామేర అదుపుచేయగలం.

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**

## తరగతి గదుల్లోనే చర్చ జరగాలి

విద్యాసంస్థల్లో డ్రగ్స్ వాడకం నిరోధించాలంటే తరగతి గదుల్లోనే చర్చ జరగాల్సుంది. మాదక ద్రవ్యాల వాడకం నిర్మూలించాలంటూ బ్యానర్లు ప్రదర్శిస్తూ, ర్యాలీలు చేస్తే సరిపోదు. ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుని కృషి చేయాలి.

**- అకున్ సబర్వాల్,**
**మాజీ ఎక్సయిజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, తెలంగాణ**

పెరగబోతోంది. ప్రపంచీకరణ, వాట్సాప్ చాటింగ్‌లు, సోషల్ మీడియా వంటివి అందుకు దోహదం చేస్తున్నాయి. హేతుబద్ధంగా, శాస్త్రీయంగా అధ్యయనం చేసి మన పిల్లల్ని కాపాడుకోవటం, అదే సమయంలో నేరస్తులుగా మారకుండా, నేర ముఠాలు పెరగకుండా డ్రగ్స్‌పై నమూనా చట్టాన్ని రూపొందిస్తున్నాం" అని జేపీ తెలిపారు.

మాదక ద్రవ్యాలు సరిహద్దులు దాటిన సమస్య కూడా. ఉగ్రవాదం, అంతర్యుద్ధాలు ఉన్న దేశాల్లో ఉగ్రవాద సంస్థలు, మిలీషియాలతోపాటు కొన్ని సందర్భాల్లో ప్రభుత్వాలు సైతం మాదక ద్రవ్యాలను నిధుల సమీకరణకు మార్గంగా ఎంచుకున్నాయి. పొరుగున ఉన్న ఆఫ్ఘనిస్తాన్, మయాన్మర్‌ల నుండి కూడా మనకు ఈ సమస్య ఉంది. అందుకే కేవలం రాష్ట్రాలు ఈ సమస్యను పరిష్కరించలేవు. సమగ్రంగా రూపొందించిన చట్టాన్ని యూనియన్ ప్రభుత్వం రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ పటిష్ఠ యంత్రాంగంతో అమలు చేయాలి.

జీవితంలో సంతృప్తి, ఆనందం ఉన్నవారికి మత్తుమందులతో పనిలేదు. ఎంత అభివృద్ధి చెందిన దేశంలోనైనా, ఆ పరిణతి అందరిలో, నిరంతరం ఉంటుందని ఆశించలేం. జనాభాలో గణనీయ శాతం మాదక ద్రవ్యాలకు బానిసలయితే, అందులోనూ ఎక్కువమంది యువత ఉంటే ఆ ప్రమాదాన్ని ఏమాత్రం ఉపేక్షించలేం. అందుకే భారతదేశం మాదక ద్రవ్యాల సరఫరాను కఠినంగా అణచివేయటంతోపాటు, ప్రమాదరహిత మత్తుల్ని క్రిమినల్ పరిధి నుండి మినహాయించాలి. అదేసమయంలో డ్రగ్స్ వినియోగాన్ని నిరుత్సాహపరుస్తూ ప్రచారాన్ని చేస్తూ డీఎడిక్షన్ కేంద్రాలను అందుబాటులో ఉంచాలి. ఈ మొత్తానికీ సమగ్రంగా చట్టపరమైన ఏర్పాట్లు చేయాలి.

# 'డ్రగ్ ఫ్రీ ఇండియా' సాధించగల లక్ష్యమేనా?

- కాత్యాయనీ విద్మహే -

మద్యం పరిశ్రమ, మాదక ద్రవ్యాల వ్యాపారం ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక ఆదాయ వనరులని జాతీయ, అంతర్జాతీయ అధ్యయనాలు చెబుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో పది దేశాలలో జనాభా సంఖ్యను బట్టి రెండవ స్థానంలోనూ, పేదరికంలో ప్రథమ స్థానంలోనూ ఉన్న భారతదేశం వీటికి అతి పెద్ద మార్కెట్. వలస పాలనలో బ్రిటన్, చైనా నుండి టీ, సిల్క్ కొనుక్కోవటానికి భారతదేశపు నల్లమందు పైనే ఆధారపడేది. అందుకనే బ్రిటిషువారు భారత్‌లో నల్లమందు ఉత్పత్తికి, అంతర్జాతీయ అమ్మకాలకు పెద్ద వ్యవస్థను తయారు చేశారు. టాటాలు, బిర్లాలు, మాల్యాలు అందులో భాగస్వాములుగా ఎదిగినవాళ్ళే.



స్వతంత్ర భారతదేశంలో 1980 నుండి దేశ సరిహద్దులు దాటి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ప్రమాదకర స్థాయిలో జరుగుతున్నది. భారత్-పాక్‌లకు సంబంధించిన 344 మైళ్ళ సరిహద్దు మార్గం పంజాబ్ రాష్ట్రాన్ని ఆనుకొని వెళుతుంది. ఆ మార్గం గుండా రవాణా అవుతున్న మాదక ద్రవ్యాల వ్యాపారం గుప్పిట్లో యువత చిక్కుకున్నది. పంజాబ్‌లో 75 శాతం యువత వీటికి అలవాటు పడింది. అమృత్‌సర్‌కు బయట పాకిస్తాన్ సరిహద్దు గ్రామం మక్బుల్‌పురాలో డ్రగ్స్ వినిమయం, దాని దుష్పరిణామాలు ఏ స్థాయికి చేరాయంటే అది వితంతువుల నిలయంగా మారిపోయింది. వీటిని నియంత్రించటం లక్ష్యంగా 1985లో భారత ప్రభుత్వం 'ది నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టెన్స్ యాక్ట్'తో పాటు 'ప్రివెన్షన్ ఆఫ్ ఇల్లిసిట్ ట్రాఫికింగ్ ఇన్ నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టెన్స్' చట్టం కూడా చేసింది. ఈ చట్టాల ప్రకారం నార్కోటిక్ కమిషన్‌కు నల్లమందు తదితర మాదక ద్రవ్యాల ఉత్పత్తి వ్యాపారాల నియంత్రణాధికారం లభించింది. మాదక ద్రవ్యాల సాగు, ఉత్పత్తి, తయారు చేయటం, దగ్గర ఉండటం, భద్రపరచటం, అమ్మటం, కొనటం, వినియోగించటం, రవాణా వంటివి బెయిలు లేని నేరాలు అయినాయి. నేర స్థాయిని బట్టి రూ.10 వేల నుండి లక్ష వరకు జరిమానా, ఒక సంవత్సరం నుండి ఇరవై ఏళ్ళ వరకు జైలు శిక్ష విధించబడుతుంది. అయినా మాదక ద్రవ్యాల వినియోగం ఎక్కడా తగ్గటం లేదు.

కేరళలో కూడా ఈ సమస్య తీవ్రమైనదిగానే ఉంది. గోవా, ముంబయిల నుండి సింథటిక్ డ్రగ్స్, తెలంగాణ, తమిళ ప్రాంతాల నుండి గంజాయి వెళుతుంది. కేరళలో మాదక ద్రవ్యాల రాకెట్లు ప్రధానంగా యువతను, వలస కార్మికులను లక్ష్యంగా చేసుకొని పని చేస్తున్నాయి. ముంబయి, హైదరాబాదు, తిరుపతి, విజయవాడ, విశాఖ వంటి పెద్ద నగరాలలో మాదక ద్రవ్యాల వినియోగం విస్తరిస్తున్నదని 2010 నాటికే గుర్తించారు. విశాఖకు ఆఫ్రికన్ దేశాల నుండి, మాల్దీవుల నుండి, శ్రీలంక నుండి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా జరుగుతుంటుంది. అడవులకు సమీపంలో ఉండే జనం అక్రమ రవాణాలో భాగమవుతారు. ఆంధ్రప్రదేశ్‌లో పదహారేళ్ళ పిల్లల్లో చాలా ఎక్కువ శాతం మంది మాదక ద్రవ్యాలు, పొగాకు, మద్యం వాడుతున్నట్లు పోలీసుల సమాచారం. కొకైన్ పంపిణీకి హైదరాబాద్ ప్రాంతీయ హబ్‌గా మారింది. ధూల్‌పేట గంజాయి కేంద్రం అన్నది తెలిసిందే!

2007లో ప్రయాస్ అనే ఎన్‌జీఓ, మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ కలిసి 13 రాష్ట్రాల్లో చేసిన సర్వే ప్రకారం మద్యానికి, మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన పిల్లల్లో 18 సంవత్సరాలలోపు పిల్లలు 32.1 శాతం, 20 ఏళ్ళ వయసులోపు వారు 13.1 ఉన్నారు. హెరాయిన్, నల్లమందు, మద్యం ఏదైతేనేం 20 మిలియన్ల పిల్లలు వాటికి బానిసలు అయ్యారు. 2008 లెక్కల ప్రకారం పన్నెండేళ్ళ పిల్లల నుండి మొదలుకొని పెద్దల వరకూ కొకెయిన్ వంటి మాదక ద్రవ్యాలు వాడే వాళ్ళ సంఖ్య 5.3 మిలియన్లు. ఒక ఎన్‌జీఓ చేసిన సర్వే ప్రకారం ద్రవ్యాల అలవాటు నుండి విముక్తి చికిత్సకు వచ్చే వాళ్ళలో 63.6 శాతం 15 ఏళ్ళలోపు వాళ్ళే. రాకుండా మిగిలిపోయిన వాళ్ళ గురించి ఊహిస్తే మొత్తం మీద యువతను బానిసలుగా చేసుకొన్న మాదక ద్రవ్యాల వ్యాపార వికృతి అర్థం అవుతుంది. 2017లో సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ మంత్రిత్వ శాఖ, సేవ్ ది చిల్డ్రన్ అనే ఎన్‌జీఓ విడివిడిగా చేసిన సర్వేల ప్రకారం ఢిల్లీలో 50 వేల 923 మంది వీధిబాలల్లో 46,410 మంది

మాదక ద్రవ్యాలు వాడుతున్నట్లు తెలుస్తున్నది.

బచ్‌పన్ బచావో ఆందోళన్ అనే ఎన్‌జీఓ పక్షాన నోబెల్ బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి వేసిన పిటిషన్ మీద విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు 2016లో పిల్లలలో మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టటానికి ఒక జాతీయ ఆచరణ ప్రణాళిక రూపొందించమని కేంద్ర ప్రభుత్వానికి ఆదేశం ఇచ్చింది. దాని ఫలితమే 'The national action plan for drug demand reduction' (2018-2023). చైతన్య పరచటం, అలవాటును మాన్పించటం, పునరావాసం కల్పించటం అనే మూడు కోణాలలో పనిచేయటం, స్థానిక ప్రభుత్వ పాలనా సంస్థల బాధ్యులను, ప్రజా సమూహాలను భాగస్వాములను చేయటం సామాజిక సాంస్కృతిక కార్యకలాపాలలో యువత పాత్రను ప్రోత్సహించటం వంటి లక్ష్యాలు దీనికి ఉన్నాయి. కానీ ఆచరణలోకి ఎలా అనువాదమైందో చూశాం.

మాదక ద్రవ్యాల వినియోగం పెంచుతున్న నేరవ్యవస్థ గురించి పట్టింపు ఉందా? దొంగతనాలు, ముఠా తగాదాలు, హత్యలు, ఆడపిల్లల మీద అత్యాచారాలు, అక్రమ రవాణాలో భాగస్వామ్యం, అక్రమ ఆదాయం మొదలైన వాటి మాటేమిటి? రాత్రి జీవితాన్ని మత్తు పదార్థాలతో, సంగీతంతో ఆకర్షవంతమైన వ్యాపారంగా మార్చిన పబ్‌లకు, రేవ్ పార్టీలకు, గోవా పార్టీలకు పెట్టుబడులు ఎవరివి? పోషకులు ఎవరు? మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు దన్నుగా ఉన్న శక్తులు ఏమిటి? వాటిని ముట్టుకోగలిగిన సత్తా గానీ, శక్తి గానీ, ఆసక్తి గానీ లేని ప్రభుత్వాలు ఏవైనా ఏమి చెబుతాయి?

ఐక్యరాజ్యసమితి పిలుపును అనుసరించి జూన్ 26ను మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవంగా జరుపుకోవచ్చు. మాదక ద్రవ్యాల వినిమయంలో హానికర ప్రభావాల గురించి చెప్పి వాటి పట్ల విముఖతను పెంచవచ్చు. మన జీవితాలను, మన సమూహాలను, మన వ్యక్తిత్వాలను మాదక ద్రవ్యాలు లేకుండా అభివృద్ధి చేసుకొందామని హితోపదేశం చెయ్యవచ్చు. కానీ ఈ మొత్తం మీద మాదక ద్రవ్యాల డిమాండ్‌ను తగ్గించే దిశగా ప్రయత్నమే తప్ప సప్లయ్‌ని సంబోధించిన సందర్భమే లేదు. డిమాండ్ లేకపోతే సప్లయ్ దానంతట అదే తగ్గుతుందన్న వైఖరి ఇది. డిమాండ్ చేస్తున్నారని ప్రజలను తప్పుపట్టడమే ఇందులో అసలు విషయం. యువతను నిర్వీర్యం చేస్తున్న దేశద్రోహులుగా, మానవతా విద్రోహులుగా గుర్తించి శిక్షింపవల్సిన వాళ్ళు మాదకద్రవ్య వ్యాపారవేత్తలు. దానిని సౌకర్యవంతంగా విస్మరించి డిమాండ్‌ను తగ్గించకుండా సప్లయ్‌ని నివారించటం కష్టం అంటున్నది సామ్రాజ్యవాద నీతి. ఈ పరిస్థితులలో డ్రగ్స్‌పై సమగ్ర ఆచరణ ప్రణాళిక ఎప్పటికి తయారయ్యేట్టు, 'డ్రగ్ ఫ్రీ ఇండియా' లక్ష్యం ఎప్పటికి నెరవేరేట్టు? అంతవరకు మాదక ద్రవ్యాల వినియోగ బలహీనతను జయించటానికి శ్రీశ్రీ రవిశంకర్ చెప్పిన యోగానే యువతకు శరణ్యం అయ్యేట్టుంది.

**(కర్టెసీ: ఆంధ్రజ్యోతి)**



## భారతదేశాన్ని అగ్రరాజ్యంగా మార్చడానికి 'నేను' బదులు 'మనం' అని ఆలోచించాలి.. ఈ ఏడు జాడ్యాలనూ నిర్మూలించాలి!

1) పెరుగుతున్న అసమానతలు, యాచక ప్రవృత్తి, నిరుద్యోగం, పేదరికం 2) కులం, మతం, భాష, ప్రాంతం పేరుతో ప్రజల్ని విభజించే ధోరణి 3) గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య అగాధం పెరుగుతూ... గ్రామాలు ఖాళీ అవటానికి, పట్టణాలు, నగరాలు జనాభాతో కిక్కిరిసిపోవటానికి దారితీయటం 4) అవినీతి, నల్లధనం 5) అధికారాన్ని విపరీతంగా కేంద్రీకరించి, ప్రజల్ని నిర్వీర్యుల్ని చేయటం 6) చట్టబద్ధ పాలన కొరవడటం 7) మద్యం, మత్తుపదార్థాల విచ్చలవిడి వినియోగం

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**

# రిజర్వేషన్లు + ఉచితాలు ≠ ప్రజాస్వామ్య పాలన





వివక్ష లేకుండా ఎదిగేందుకు అందరికీ సమానావకాశాలను అందించే విధానాలను అమలు చేయకుండా రిజర్వేషన్లు, తాత్కాలిక తాయిలాల ఉచితాలను అందిస్తూ ప్రభుత్వాలు ప్రజల్ని మభ్యపెడుతున్నాయని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. కొన్ని మార్పులతో ఇప్పుడున్న మేర రిజర్వేషన్లు అవసరమేనని, అలాగే కొంతమేర ఉచితాలు సముచితమేనని.. అయితే ఇవి ఉపశమనాలే తప్ప అందరికీ సమానావకాశాలను అందించలేవని స్పష్టం చేశారు. వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలు లభించాలంటే అవసరమైన నాలుగు కీలకాంశాలను జేపీ వివరించారు. ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం, చట్టబద్ధపాలన, స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధులతోనే ప్రజలకు ఎదిగే అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు.

అందరికీ సమానావకాశాలపై హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులనుద్దేశించి జేపీ మాట్లాడారు.

అందరికీ సరైన విద్యను అందించటంలో మన దేశం ఘోరంగా విఫలమైందని, ఒక సమాజంగా ఇది మనం చేస్తున్న పెద్ద పాపమని జేపీ అన్నారు. తల్లిదండ్రులకు చదువు, డబ్బు ఉన్నవారికి, ఎవరో కొందరు అదృష్టవంతులకు తప్ప మిగిలిన 80 శాతం మంది పిల్లలకు ఏమాత్రం సరైన చదువు అందటం లేదన్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగినవారు విద్యార్థుల్లో కేవలం 1% మంది మాత్రమేనన్నారు.

"ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లలో 8వ తరగతి చదివే విద్యార్థుల్లో.. 25-30 శాతం మంది కనీసం చదవలేరు, 30-40 శాతం మంది సాధారణ రెండంకెల తీసివేతను చేయలేరు, 50-60 శాతం మంది మూడంకెల సంఖ్యను ఒక అంకెతో భాగాహారం చేయలేరు. భాగాహారం, తీసివేత వంటివి ఎందుకు, ఏ సందర్భంలో చేయాలి.. వంటి చిన్నపాటి క్లిష్ట ప్రశ్నలు కూడా ఇందులో లేవు. కేవలం చిన్న కాన్సెప్ట్‌తో లెక్క చేయటం మాత్రమే వీరికి ఇచ్చారు. ఆ మాత్రం ప్రశ్నకే జవాబులు ఆ స్థాయిలో ఉన్నాయి" అని జేపీ అన్నారు.

అలాగే 2009లో 'పీసా' సర్వేను పదిహేనేళ్ల వయసు విద్యార్థులలో అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేయటానికి 74 దేశాలు/ఎంటిటీల మధ్య నిర్వహించారని, ఇందులో భారతీయ విద్యార్థులు దిగువ నుంచి రెండో స్థానంలో ఉన్నారని జేపీ వివరించారు. మనకంటే అట్టడుగున ఉన్నది కిర్గిజిస్థాన్ మాత్రమే! పీసా సర్వేను చూశాక భారత ప్రభుత్వ ప్రతిస్పందన విద్యాప్రమాణాలను పెంపొందించటం కాదు.. ఆ సర్వేను తిరస్కరించటం! ప్రపంచ స్థాయి సర్వే నుంచి భారత్ వైదొలుగుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.. అని తెలిపారు.

ఆరోగ్యం విషయంలో నిధుల కేటాయింపు తక్కువగా ఉందని, కానీ విద్యలో ఇప్పుడున్న కేటాయింపులు తక్కువేమీ కాదని జేపీ వెల్లడించారు. దాదాపు 35-40 శాతం మంది ప్రయివేటు విద్యాసంస్థల్లో చదువుకుంటున్నప్పుడు ప్రభుత్వాలు చేస్తున్న ఈ వ్యయాన్ని గణనీయ మొత్తంగానే చెప్పుకోవాలన్నారు. తెలంగాణ ఒక్కో బిడ్డ మీద ఏడాదికి సుమారు రూ.65,000, ఆంధ్రప్రదేశ్‌లో రూ.90,000 ఖర్చు చేస్తున్నారన్నారు. ప్రయివేటు పాఠశాలలో పిల్లలకు ఏడాదికి రూ.90,000 ఫీజు కట్టే తల్లిదండ్రులు ఎంతమంది ఉంటారని ప్రశ్నించారు. అయినా విద్యాప్రమాణాలు అధ్వాన్నంగా ఉన్నాయని, ఆ పిల్ల, పిల్లవాడి కెరీర్‌కి, జీవితానికి ఉపయోగపడే చదువు అందటం లేదన్నారు. ఏపీలో విద్యారంగం ఖర్చులో భాగంగా చూపిస్తున్న 'అమ్మ ఒడి' పథకానికి, చదువుకు ఏమాత్రం సంబంధం లేకుండా పోయిందన్నారు. అమ్మ ఒడి కేవలం ఓట్ల కోసం అమలు చేస్తున్న ఓ తాయిలం మాత్రమేనన్నారు.

అలాగే ఆరోగ్య రంగంలో కేవలం ప్రభుత్వాల వైఫల్యం వల్ల దేశంలో అనారోగ్యం ఉన్నకొద్దీ పెరుగుతుండటంతోపాటు, కేవలం ఆరోగ్య సమస్యలకయ్యే ఖర్చులు, సరైన వైద్యం అందక ఉత్పాదక శక్తిని కోల్పోవటం వల్ల ఏటా 6 కోట్ల మంది అప్పటి దాకా పేదలు కానివారు పేదలుగా మారిపోతున్నారన్నారు. ఈ సంఖ్య ఐదున్నర కోట్లా, ఆరు కోట్లా అన్న చర్చ ఉండొచ్చుగానీ, ఆరోగ్య రంగంలో వైఫల్యం వల్ల మన దేశంలో ఏటా కోట్ల మంది పేదలవుతున్నారన్నది మాత్రం వాస్తవమన్నారు.

ఈ వైఫల్యాలకు తోడుగా.. అధికారాన్ని అంతా

ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్ వద్దే కేంద్రీకరించుకోవటం వల్ల ప్రజలకు రోజువారీ సేవలు కూడా సక్రమంగా అందటం లేదని, లంచాలివ్వటంతోపాటు స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధినో, ఎమ్మెల్యేనో ఆశ్రయించటం చేస్తున్నారని, తాము కట్టే పన్నుల డబ్బుకి – తమ జీవితానికి మధ్య సంబంధమేంటో తెలియకుండానే ఓట్లు వేస్తున్నారని జేపీ అన్నారు. స్థానిక ప్రభుత్వాల సాధికారత పేరుతో తెచ్చిన 73, 74 రాజ్యాంగ సవరణలు పటాటోపం తప్ప పవర్‌లేనివన్నారు. తగినన్ని వనరులు, అధికారాలు లేకుండా ఓ చిన్న, సాంప్రదాయ, కులతత్వ గ్రామానికి ప్రాతినిధ్యం కల్పించటం మొత్తం మూడో అంచె ప్రభుత్వాన్ని, స్థానిక రిజర్వేషన్లను నీరుగార్చిందన్నారు.

ఇంకోపక్క, సమానావకాశాలకు వెన్నెముక వంటి చట్టబద్ధపాలన మన వద్ద కేవలం కాగితానికే పరిమితమైందని జేపీ అన్నారు. ప్రభుత్వ జోక్యం లేకుండా న్యాయస్థానాలు స్వతంత్ర ప్రతిపత్తితో ఉంటాయి, చట్టప్రకారం పోలీసులు, ప్రాసిక్యూషన్ నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా వ్యవహరించాలి అని రాజ్యాంగం చెబుతుందని.. కానీ వాస్తవంలోకి వస్తే, చట్టం ద్వారా రక్షణ పొందటం కొందరికే సాధ్యమన్నారు. చట్టబద్ధపాలనలో ఎక్కువ తక్కువలు మన సమాజంలో స్పష్టంగా కనిపిస్తాయన్నారు. కోర్టుల్లో కుప్పలుగా కేసులు పేరుకుపోయి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సాధారణంగా ఏ దేశంలోనైనా సివిల్ కేసులు ఎక్కువగా ఉంటాయని, కానీ మన దేశంలో కోర్టుల పట్ల విశ్వాసం లేక ప్రజలు దూరంగా ఉండటం వల్ల ఆ కేసులు తక్కువగా ఉన్నాయన్నారు. ప్రజలు బండ న్యాయంతో సెటిల్ చేసుకోవటమో లేక గుడ్ల నీరు కుక్కుకుని మౌనంగా భరించటమో చేస్తున్నారన్నారు. కోర్టుల్లో నిందితులు నేరాన్ని ఒప్పుకోవటమనేది మనదేశంలో పేదలపై థర్డ్ డిగ్రీ పద్ధతుల్ని, హింసను ప్రదర్శించటం ద్వారానే జరుగుతోందని, ఈ రకంగా బలవంతపు నేరాంగీకారం లేకుంటే, దేశంలో నేరాల్ని ఒప్పుకునేవారి సంఖ్య కేవలం 10 శాతం వరకు మాత్రమే ఉంటుందని, ప్రపంచంలోనే ఇది అతి తక్కువని వివరించారు. భారతదేశంలోని 4,70,000 ఖైదీల్లో 75 శాతం మంది విచారణ దశలో జైళ్లలో ఉన్నవారేనని, ఎక్కువమంది చిన్న చిన్న నేరాల ఆరోపణల మీద మగ్గుతున్నవారేనన్నారు. బెయిలుకు దరఖాస్తు చేసుకుని, సమర్థవంతమైన న్యాయ సహాయం పొందేందుకు డబ్బులేని పేదలు వీరు అని తెలిపారు. భద్రత, సత్వర, చౌక న్యాయం అందుబాటులో లేప్పుడు అంతరాలు పెరుగుతాయన్నారు. తాను కులాంతర వివాహాలు వంటి సమాజం బాధ్యతల గురించి చెప్పటం లేదని, ప్రభుత్వాల చేతుల్లో ఉన్న చట్టబద్ధపాలన గురించే చెబుతున్నానన్నారు.

అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాల సాధికారత, చట్టబద్ధపాలన అందించటం ప్రభుత్వాల మౌలిక బాధ్యతని, ఆ బాధ్యతను నెరవేర్చటానికి రిజర్వేషన్లు, అనుత్పాదక ఉచితాలు వంటివి ఎప్పుడూ ప్రత్యామ్నాయం కావని జేపీ స్పష్టం చేశారు. ప్రభుత్వాలు తమ మౌలిక బాధ్యతల్ని నెరవేర్చినప్పుడు మాత్రమే అందరికీ సమానావకాశాలున్న ప్రజాస్వామ్య పాలన సాధ్యమన్నారు.

అనంతరం విద్యారంగంపై కరోనా ప్రభావం, సంస్కరణలు ముందు రాజకీయంలో రావాలా లేక ఆయా రంగాల్లో రావాలా, మద్యనిషేధం, జాతీయ విద్యావిధానం, మాతృభాషలో బోధన, ట్రాన్స్‌జెండర్లకు ఆరోగ్య సేవల్లో సమానావకాశాలు, వైద్య ఆరోగ్యంలో ప్రయివేటు రంగం పాత్ర మొదలైన అంశాలపై విద్యార్థుల ప్రశ్నలకు జేపీ జవాబులిచ్చారు.

(సోర్స్: www.youtube.com/JP Loksatta)

## ప్రజల భూ హక్కులను పరిరక్షించండి




కర్నూలు జిల్లాలో నూతన పత్తికొండ రెవిన్యూ డివిజన్‌లోని దేవనకొండ, కృష్ణగిరి మండలాల్లో భూ రికార్డుల సమస్యలు ఉన్నాయని, వాటిని సరిచేసి ప్రజల భూ హక్కులను పరిరక్షించాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనందాచారి విజ్ఞప్తి చేశారు. లోక్‌సత్తా ఆదోని డివిజన్ కన్వీనర్ శేఖర్, ఆలూరు నియోజకవర్గ ఇంఛార్జి రామదాసు గౌడ్, పత్తికొండ పట్టణాధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి బాషా తదితరులతో పత్తికొండ మొదటి ఆర్‌డీవోను కలిసి అభినందనలు తెలిపారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో జెమిని (భూమి) సమస్యలు ఉంటే తమ దృష్టికి ఆధారాలతో సహా తీసుకొస్తే చర్యలు తీసుకుంటానని ఆర్‌డీవో హామీ ఇచ్చారు. లోక్‌సత్తా నేతలు నీలకంఠ, సూరి, దేవనకొండ సీనియర్ నాయకుడు ఎం. రమేష్, శ్రీను, జయరాముడు తదితరులు కూడా పాల్గొన్నారు.

**గ్రామీణ ప్రాంతాలకు బస్సుల్ని నడపాలి:** పత్తికొండ డిపో నుండి ప్యాపిలి, డోన్ వైపు ఉన్న గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం లేదని, పల్లె బస్సు సర్వీసుల్ని వెంటనే ఏర్పాటు చేయాలని ఆనందాచారి డిమాండ్ చేశారు. డిపోను ఆధునీకరించి విస్తరించాలని అధికారులను కలిసి విజ్ఞప్తి చేశారు.

# మన ఆత్మవంచనను ప్రశ్నిస్తున్న జవాబది

విద్య పట్ల గౌరవం తప్ప విద్య అంటే ఏమిటో అర్థం చేసుకోకపోవటం వల్ల మన సమాజంలో అత్యధికులు నాణ్యమైన విద్యను పిల్లలకు అందించలేకపోతున్నారని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.


ఎమ్మెల్యేగా గెలిచేందుకు
## ఓటర్లకు డబ్బులు ఇస్తరు
- బిర్యానీలు, మందుబాటిళ్లు, చీరలు పంచుతారు
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఏడో తరగతి స్టూడెంట్ ఆన్సర్

'ఎమ్మెల్యే ఎన్నికలు ఎలా జరుగుతాయి?' అని ఇటీవల తెలంగాణలో జరిగిన ఏడో తరగతి సోషల్ స్టడీస్ వార్షిక పరీక్షలో అడిగిన ప్రశ్నకు ఓ విద్యార్థి రాసిన సమాధానం వైరల్ అయింది. ఎమ్మెల్యే అభ్యర్థులు తాము ఎన్నికల్లో గెలిచేందుకు ఇల్లిల్లూ తిరిగి ఓటుకింతని డబ్బులు పంచుతారని, మగవాళ్లకు బిర్యానీలు, మద్యం బాటిళ్లు, మహిళలకు చీరలు కానుకగా ఇస్తారని ఆ పిల్లవాడు రాశాడు. దీనిపై జేపీ స్పందిస్తూ, తరగతి గదిలో, సమాజంలో, ఇంట్లోనూ పిల్లలకు అందే అంశాలు సక్రమంగా లేనప్పుడు నాసిరకం జవాబులే కాకుండా అలాంటి తప్పు సమాధానాలు కూడా వస్తాయన్నారు. హుజూరాబాద్‌లాంటి చోట్ల అందరి మనసుల్నీ హత్తుకునేలా భారీఎత్తున డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాల్ని ఎలా పంచారో చూశామని, రోల్‌మోడల్స్‌గా ఉండాల్సిన రాజకీయ నేతలు డబ్బు పంచుతున్నా, ఓటు వేయటానికి కుటుంబ సభ్యులో చుట్టుపక్కల వాళ్లో అలా డబ్బును తీసుకుంటున్నా, స్కూల్‌లో పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు కాన్సెప్ట్‌లు పట్టుపడేలా నాణ్యమైన విద్యను బోధించకున్నా, చివరికి అనేకమంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా ఓటుకు నోటు, ప్రలోభాలు, ఉచితాల్ని ఆశిస్తున్నా.. పిల్లలు సవ్యంగానే ఆలోచిస్తారనుకోవటం అత్యాశే అవుతుందన్నారు. పాఠ్యాంశాల్లోని నీతులు, హేతుబద్ధత, శాస్త్రీయత సమాజంలో, పాలనలో కొరవడితే ఆ ప్రభావం విద్యార్థుల మీద తప్పక ఉంటుందన్నారు. ఇప్పుడు ఈ విద్యార్థి రాసిన సమాధానం సోషల్ మీడియాలో వైరల్ అయిందంటే, సమాజంలో మార్పు కోసం బలమైన ఆకాంక్ష ఉందని.. అయితే సమస్య చుట్టూ చర్చకే పరిమితం కాకుండా పరిష్కారం గురించి ఆలోచించాలన్నారు. ఆచరణసాధ్యమైన పరిష్కారాలు అందుబాటులోనే ఉన్నాయన్నారు.

డబ్బు, మద్యం, తాత్కాలిక తాయిలాల అవసరం లేకుండా నిజాయతీగా, ఎజెండాను చూపి ఓట్లు సంపాదించేలా ఎన్నికల వ్యవస్థను మార్చాలని జేపీ అన్నారు. ఒక్క ఓటు ఎక్కువ వస్తే గెలుపు, తక్కువ వస్తే ఓటమి, ఓడి పోయినవారికి వేసే ఓట్లన్నీ వృధా అనే ప్రస్తుత ఎన్నికల వ్యవస్థ స్థానంలో ప్రతి ఓటుకూ విలువ ఉండే దామాషా ఎన్నికల పద్ధతిని తీసుకురావటం, రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి ఎమ్మెల్యేల మీద ఆధారపడాల్సిన అవసరం లేకుండా ప్రత్యక్ష ఎన్నిక నిర్వహించటం వంటి ఏర్పాట్లు చేయాలన్నారు. జాతీయ నూతన విద్యావిధానాన్ని ఉపయోగించుకుని విద్యాప్రమాణాల్ని పెంచాలని, సమాజం సవ్యంగా నడిచేలా చట్టబద్ధపాలనని, ఇతర పాలనా సంస్కరణల్ని తీసుకురావాలన్నారు.

ఒక సమాజంగా, దేశంగా మన ఆత్మవంచనకి ఈ ఉదంతం చిన్న ఉదాహరణని, ఒకవేళ ఆ విద్యార్థి బట్టీ పట్టి సరైన సమాధానం రాసినా అంతా బాగున్నట్లు కాదని గుర్తించి ఈ సంస్కరణల్ని తీసుకురావాలని జేపీ అన్నారు.

## విభజన హామీలపై ఢిల్లీని ప్రశ్నించని రాష్ట్ర ప్రభుత్వం

విభజన హామీలపై యూనియన్ ప్రభుత్వాన్ని రాష్ట్రం ప్రశ్నించటం లేదని, పోలవరం, పన్ను రాయితీలు సహా రాష్ట్రానికి నెరవేరాల్సిన హామీలపై అఖిలపక్షంగా పోరాడటానికి వైకాపా, బీజేపీ కూడా ముందుకు రావాలని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.వెంకటరమణబాబు కోరారు. వివిధ రాజకీయ పార్టీలు రాయదుర్గంలో ఏర్పాటు చేసిన ఉక్కు ఐక్యవేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పరిశ్రమను రాయలసీమలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకుడు మహ్మద్ గౌస్, వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు దేవర శ్రీకృష్ణ, కాంగ్రెస్ నాయకుడు తులసి రెడ్డి, సీపీఎం మాజీ ఎమ్మెల్యే గఫూర్, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాలు పెరగాలె

## - డాక్టర్ జయప్రకాష్ నారాయణ్





తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించేందుకు శక్తికి మించి ఖర్చు పెడుతున్నారు. విద్యార్థులు కూడా అన్ని సబ్జెక్టుల్లో పాస్ అవుతున్నారు. కానీ అందులో పనికొచ్చే చదువు మాత్రం నూటికి 30 శాతమే ఉంటోంది. ఎనిమిదో తరగతి చదివే స్టూడెంట్లలో నూటికి 25 మంది సెకండ్ క్లాస్ బుక్‌లో ఒక పేరా చదవలేకపోతున్నారు. నూటికి 40 మందికి చిన్న తీసివేత రావడం లేదు. నూటికి 60 మందికి భాగహారాలు కూడా వస్తలేవు. పధ్నాలుగు పద్దెనిమిదేండ్ల మధ్య వయసులో కూడా నూటికి 50 మందికి గడియారం చూసి టైమ్ చెప్పడం రావడం లేదు. తక్కెట్లో తూకం ఎలా వెయ్యాలో కూడా తెలియదు. అటు గవర్నమెంట్ అయినా.. ఇటు ప్రైవేట్ అయినా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు. ఈ విధానంలో మార్పు రావాలి. క్వాలిటీ ఎడ్యుకేషన్ అందించడంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

తెలంగాణ ప్రభుత్వం విద్య కోసం ఒక్కో స్టూడెంట్‌పై రూ. 65 వేల చొప్పున ఖర్చు పెడుతోంది. ప్రైవేటు స్కూళ్లలో మంచి చదువు దొరుకుతుందున్న ఆశతో చాలామంది బీద కుటుంబాలు, దిగువ మధ్యతరగతి కుటుంబాలు వాళ్ల శక్తికి మించి ఫీజులు కట్టి వాటిల్లో చేర్పిస్తున్నారు. కానీ అక్కడ కూడా నాణ్యమైన విద్యేమీ దొరకడం లేదు. ప్రైవేటు, గవర్నమెంట్ బడులకు పెద్ద తేడా ఏమీ కనబడటం లేదు. ఏవో కొన్ని ఖరీదైన ప్రైవేటు స్కూళ్లలో తప్ప. చదువు కోసం ఖర్చు కనపడుతోంది కానీ, బిడ్డల భవిష్యత్తును తీర్చిదిద్దే చదువు మాత్రం అందడం లేదు. డబ్బుండీ, తల్లిదండ్రులు చదువుకొని ఉన్న ఫ్యామిలీల్లో.. మంచి స్కూలులో చేర్పిస్తే, అక్కడ టీచర్లు కూడా మంచిగుంటే నూటికి 20 మందికి నాణ్యమైన విద్య అందుతోంది. మిగతా ఎనభై మందికి తెలివితేటలు ఉంటాయి.. తల్లిదండ్రులు తపన పడుతున్నారు.. త్యాగాలు చేస్తున్నారు.. బండెడు పుస్తకాలు మోస్తూ పిల్లలూ కష్టపడి చదువుతున్నారు.. కానీ వాళ్లకి ఎందుకూ పనికిరాని చదువు అందుతోంది. గవర్నమెంట్ బాగా డబ్బు ఖర్చు పెడుతోంది. పిల్లలు బాగుపడాలనే కోరికతో అన్ని కులాల, మతాల, వర్గాల తల్లిదండ్రులూ ఖర్చుకు వెనుకాడటం లేదు. అలాగే సమాజం కూడా విద్యకు మంచి గౌరవం ఇస్తోంది. ర్యాంక్‌లొచ్చిన వాళ్లని, మంచి ఉద్యోగం వచ్చిన వాళ్లని ప్రజలు ఎంతో గౌరవిస్తున్నారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉందన్న చందంగా ప్రస్తుత మన వ్యవస్థ ఉంది. ఎన్ని వనరులు ఉన్నా ఉపయోగించే విధానంలో మార్పు రానంత వరకు గ్రోత్ కనిపించదు.

**నిధుల సమర్థ వ్యయంపై దృష్టి పెట్టాలె..**

విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు సరైన రీతిలో ఉపయోగిస్తే ప్రభుత్వం బడ్జెట్‌లో పెట్టే నిధులు కచ్చితంగా సరిపోతాయి. మన దేశంలో గతంతో పోలిస్తే లక్షల కోట్ల రూపాయలు విద్య మీద ఖర్చు పెట్టాం. ఒక్క సర్వశిక్షా అభియాన్, మాధ్యమిక శిక్షా అభియాన్ పేరుతోనే ప్రభుత్వం పది లక్షల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టింది. తెలంగాణలోనూ ఒక్కో బిడ్డ మీద ప్రభుత్వం 65 వేల రూపాయలు ఖర్చు చేస్తోంది. అది చిన్న మొత్తమేమీ కాదు. ఏపీ ప్రభుత్వం ఇంకా ఎక్కువ ఖర్చు పెడుతోంది. 'అమ్మ ఒడి' పథకం చేపట్టి ఒక్కో స్టూడెంట్‌పై సుమారు రూ.90 వేల రూపాయలు ఖర్చు పెడుతోంది. కాబట్టి డబ్బు ఖర్చులో లోపం ఏమీ లేదు. అలాగే విద్యార్థుల, టీచర్ల నిష్పత్తి ప్రకారం చూస్తే 17 మంది పిల్లలకు ఒక టీచరు ఉన్నాడు. అంతకంటే ఎక్కువ రేషియో అవసరం లేదు. కాకపోతే టీచర్లను సమానంగా పంచడం లేదు. కొన్ని స్కూళ్లలో మరీ అధ్వాన్నంగా పిల్లల కంటే టీచర్లు ఎక్కువమంది ఉంటున్నారు. మరికొన్ని స్కూళ్లలో పిల్లలు చాలా ఎక్కువమంది ఉండగా, టీచర్లు కొద్దిమంది మాత్రమే ఉంటున్నారు. పిల్లలుండీ టీచర్లు అసలు లేని స్కూళ్లు కూడా ఉన్నాయి. వ్యవస్థలో డబ్బులు, వనరులు, టీచర్లు, పిల్లలు, క్లాస్ రూంలు లేకపోవడం లోపం కాదు. కావాలనుకుంటే క్లాస్ రూమ్‌లను పెంచుకోవచ్చు. కాబట్టి విద్యారంగంలో సమస్య వనరుల వల్ల కానే కాదు.

ఆరోగ్యంలో డబ్బు ఖర్చు పెట్టడం లేదు. విద్యలో ఖర్చు పెడుతున్నా ఫలితాలు చూపలేకపోతున్నారు. డబ్బుని సమర్థంగా ఎలా ఖర్చు పెట్టాలో ముందు తెలుసుకోవాలి.

**ఎలాంటి మార్పులు రావాలంటే..**

గవర్నమెంట్ స్కూళ్లు, ప్రైవేట్ స్కూళ్లకి పెద్ద తేడా లేదు. ప్రైవేటు స్కూళ్లలో కొంచెం మెరుగ్గా ఉండొచ్చేమో అంతే. అయితే ఉన్నత వర్గాల పిల్లలు వెళ్లే స్కూళ్లు కొంచెం బాగుంటాయి. మిగతా వర్గాల స్కూళ్లలో చదువు అంతంత మాత్రమే. తల్లిదండ్రులు ఆశకొద్దీ వేలకు వేలు ఫీజు కట్టి మరీ స్కూళ్లకు పంపినా అక్కడ వాళ్లు నేర్చుకునే చదువు ఎంతమాత్రం సరైంది కాదు. గవర్నమెంట్ ఏడాదికి ఒక్కో స్టూడెంట్‌పై రూ.65 వేలు ఖర్చు పెట్టే విధానానికి, రూ.10 వేలు ఖర్చయ్యే ప్రైవేట్ స్కూలు విద్యకు ఎంత తేడా ఉంటుందో మనం బేరీజు వేయొచ్చు. చాలా ప్రైవేట్ బడుల్లో విద్య బాగుండటం లేదు. విద్య సరిగా నేర్చుకున్నారు అన్న దానికి సంకేతం పరీక్ష పాసవడమే. కానీ బడుల్లో, కాలేజీలో బట్టీ పట్టే వాళ్ల సంఖ్యే ఎక్కువగా కనబడుతోంది. అంటే వీళ్లకు సబ్జెక్ట్ మీద ఎలాంటి అవగాహన ఉండదు. కానీ ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయిపోతారు. ఈమధ్య కాలంలో బట్టీ కూడా మానేసి విపరీతంగా కాపీలు కొట్టడం మొదలెట్టారు. ఈ విధానంలో మనల్ని మనం మోసం చేసుకుంటున్నాం అంతే. ప్రోగ్రాం ఫర్ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ ఎసెస్‌మెంట్ (పీసా) వారు సంపన్న దేశాలు, ఇతర దేశాలను పోలుస్తూ 17 ఏండ్ల వయసు పిల్లలపై సర్వే చేస్తారు. ఈ సర్వేలో బట్టీ పట్టే విధానం చూడరు. పిల్లలు భాషను ఉపయోగిస్తున్నారా, విషయాలను అర్థం చేసుకుంటున్నారా, గణితాన్ని సరిగా ఉపయోగిస్తున్నారా, తర్కం, సైన్స్ పరిజ్ఞానం ఎంత ఉంది, సరైన నిర్ధారణ చేయగలుగుతున్నారా, లేదా? అన్న విషయాలను పరిగణలోకి తీసుకుంటారు. అంటే వాళ్లు సర్టిఫికెట్లు చూడరు, విషయ పరిజ్ఞానాన్ని మాత్రమే పరిశీలన చేస్తారు. ఇలాంటి పరీక్షలో మన ఇండియా ఒకే ఒక్కసారి పాలుపంచుకుంది. ఇందులో 74 దేశాల మధ్య సర్వే జరిగితే మన దేశానికి అట్టడుగు నుంచి రెండో స్థానం వచ్చింది. చైనాకు మొదటి స్థానం రాగా, హాంకాంగ్ రెండో స్థానం, సింగపూర్ మూడో స్థానంలో నిలిచాయి. డబ్బు ఖర్చు పెట్టటం కాదు, పిల్లల్లో విషయ పరిజ్ఞానం ఎంతవరకు ఉంటోందన్నది గమనించాలి. చెప్పే పాఠం వాళ్ల బుర్రల్లోకి వెళ్తోందా, లేదా? అర్థం చేసుకున్నదాన్ని వాళ్లు ఉపయోగిస్తున్నారా, లేదా? అన్నది పరిశీలించాలి. అప్పుడే వారికి పరీక్షలు నిర్వహించాలి. అలాంటి విద్యను అందరికీ అందించగలగాలి. నిజమైన ప్రతిభను పరిశీలించలేనప్పుడు ఎన్ని పరీక్షలు పెట్టినా అనవసరం. తార్కిక శక్తి, భావ ప్రకటనలపై శ్రద్ధ పెట్టాలి. కాబట్టి పరీక్షల పద్ధతిలో మార్పులు తెస్తూ, వాటిని నిజాయతీగా అమలు చేయాలి. కాపీయింగ్‌కి అవకాశం లేకుండా, పిల్లలపై ఒత్తిడి లేకుండా చేయాలి. విషయ పరిజ్ఞానం, దాన్ని ఉపయోగించగలగడం అన్న కాన్సెప్ట్ పైనే దృష్టి పెట్టగలిగితే, విద్యావిధానంలో ఎన్నో విజయాలు సాధించవచ్చు. తల్లిదండ్రులు, టీచర్లు, సమాజం, ప్రభుత్వం ఇలా ప్రతి ఒక్కరూ ఇలాంటి విధానం గురించి ఆలోచించాలి.

## విద్యాబోధనలో మార్పులు

అయిదు క్లాస్‌రూమ్‌లు, క్లాస్‌లో 20 మంది పిల్లలు, ఐదుగురు టీచర్లు ఉన్నప్పుడు అది ప్రాథమిక పాఠశాల అయినా కూడా విద్యాసంస్థ అనిపించుకుంటుంది. దానిపై అజమాయిషీ, జవాబుదారీతనం ఉంటుంది. అక్కడ పిల్లలకు సరైన విద్య అందుతుంది. విసిరేసినట్టు ఒక క్లాస్‌రూమ్‌లో ఒకరినో, ఇద్దరినో పిల్లలను పెట్టి, ఒక టీచర్‌ను ఆ బడిలో పెట్టామని చెప్పుకుంటూ, ఆ టీచర్ బడికి వెళ్లాడో లేదో మనకి తెలియకుండా ఉండి ఉంటే అది సరైన విద్యావ్యవస్థ కిందకు రాదు. ఒక ప్రైమరీ స్కూల్‌లో కనీసం వందమంది స్టూడెంట్స్ ఉండాలి. హైస్కూల్‌లో కనీసం రెండొందల మంది పిల్లలు ఉండాలి. దానికి తగిన వాతావరణాన్ని, సౌకర్యాలను కల్పించాలి. చిన్న ఊళ్లలో స్కూళ్లు సాధ్యంకానప్పుడు బస్సులకు సబ్సిడీ ఇవ్వడం మంచిది. గవర్నమెంట్ ఇంత ఖర్చు పెడుతున్నప్పుడు ఇంకో పది రూపాయలు ఇస్తే సరిపోతుంది. మా కాలంలో కంటే ఇప్పుడు విద్యను బోధించే విధానంలో ఎన్నో మార్పులు వచ్చాయి. విజువలైజేషన్‌తో కూడుకున్న విద్యను అందిస్తే పిల్లల్లో ఎంతో మార్పు వస్తుంది. విజువల్ మీడియా, వనరులు అన్నీ సిద్ధంగా ఉన్నాయి. ఇలాంటప్పుడు కొద్దిపాటి ఖర్చుతో ముందడుగేస్తే ఎన్నో మంచి ఫలితాలు చూడొచ్చు.

**ప్రమాణాలు లేని బడులను మూసేయాలి**

ప్రభుత్వ విద్యావ్యవస్థ మీద నమ్మకం లేక, ప్రతి ఏడాది కొన్ని లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు స్కూళ్ల దారి పడుతున్నారు. ప్రైవేటు స్కూళ్లలో దేశం మొత్తం మీద గత పదేండ్లుగా ఐదారు కోట్ల మంది దాకా విద్యార్థుల సంఖ్య పెరిగింది. గవర్నమెంట్ స్కూళ్లలో తగ్గిపోయింది. కొన్ని ప్రభుత్వ స్కూళ్లను మూసేస్తున్నారు కూడా. ఎందుకంటే వాటిపై నమ్మకం లేకపోవడమే. అందుకే ప్రైవేటా? గవర్నమెంట్ స్కూలా అన్న విషయం మరచిపోవాలి. పిల్లలందరికీ నాణ్యమైన విద్య అందేలా చూడాలి. వారికి ఫీజులు గవర్నమెంట్ అందించగలగాలి. ప్రమాణాలు లేని బడులను మూసేయాలి. అవి అసలు బడులే కాదు. పిల్లలపై శక్తికి మించి ఖర్చు పెడుతున్నవాళ్ల భారాలు తగ్గించాలి. ఇలా చేయడం ద్వారా విద్యావ్యవస్థను వేగంగా మార్చవచ్చు. టీచర్లకు మంచి ట్రైనింగ్ ఇచ్చుడు, బడులకు మంచి బిల్డింగ్‌లు కట్టుడు సమస్య కాదు. ప్రమాణాలులేని విద్యను అందిస్తుండడమే అసలు సమస్య. 30 ఏండ్ల నుండి ప్రభుత్వం ఇవన్నీ చేస్తున్నామని చెబుతూనే ఉంది. కానీ ఏమీ చేయడం లేదు. మనం ఈ దేశంలో పుట్టడం ఎంతో అదృష్టం. ఇక్కడ ఎన్నో వనరులున్నాయి. ప్రభుత్వం కూడా ఎంతో ఖర్చు పెడుతోంది. కానీ అంతా వృధా అయిపోతోంది. అంటే సరైన రీతిలో ఖర్చు చేయడం లేదు. నూతన విద్యావిధానాన్ని జాతీయ స్థాయిలో తీసుకెళ్లగలగాలి.

# స్థానిక ప్రభుత్వాలు - ప్రజాస్వామ్య పాఠశాలలు

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

స్వతంత్ర భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో అతి పెద్ద వైఫల్యం స్థానిక ప్రభుత్వాలను బలంగా ఏర్పాటు చేయకపోవటం! ప్రభుత్వ సేవల్లో అతి పెద్ద వైఫల్యం మంచి ప్రమాణాల పాఠశాల విద్యను ప్రతి బిడ్డకూ అందించకపోవటం!!

ఈ రెండూ వేర్వేరు అంశాల్లా అనిపించొచ్చు కానీ, రెంటికీ మధ్య సంబంధం ఉంది. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో 1970ల దశకం తొలినాళ్ల దాకా స్థానికంగా నాణ్యమైన పాఠశాల విద్య అందటం చాలామేర స్థానిక ప్రభుత్వాల నాయకుల చొరవ వల్లే సాధ్యమైంది. స్థానిక ప్రభుత్వాల నాయకులు ఒక ఉద్యమ స్ఫూర్తితో సమాజం మొత్తాన్ని ఏకం చేసి, పాఠశాల నిర్వహణలో వారికి పాత్రను కల్పించి, వనరులులేని కాలంలో కూడా ఉన్నంతలో మంచి విద్యను అందించారు. ఆనాడు స్కూళ్లకు భవనాలు లేవు, మరుగుదొడ్లు లేవు, ఉపాధ్యాయుల సంఖ్య సరిపోయేది కాదు, జీతాలు తక్కువగా ఉండేవి. ఇన్ని ప్రతికూల పరిస్థితుల్లో కూడా స్థానిక ప్రభుత్వాలు, సమాజం భాగస్వామ్యంతో లక్షలాది మంది సామాన్య కుటుంబాల్లోని పిల్లలు మంచి విద్యను పొంది వివిధ రంగాల్లో అపార సేవలు అందించారు, దేశాభివృద్ధికి దోహదం చేయగలిగారు. విద్యాసంస్థల్ని కేంద్రీకరించిన తర్వాత స్థానిక ప్రభుత్వాల పాత్ర నామమాత్రమైపోయింది. దాంతో దేశంలో లక్షల కోట్ల రూపాయల్ని అదనంగా పాఠశాల విద్య కోసం డబ్బు ఖర్చు పెట్టినా, ఉపాధ్యాయులకు జీతభత్యాల్ని పెంచినా, కొత్తగా ఉపాధ్యాయుల్ని నియమించినా, భవనాలు, మరుగుదొడ్లు, మంచినీళ్లు ఏర్పాటు చేసినా, మౌలిక సదుపాయాల్ని కల్పించినా, మధ్యాహ్న భోజన పథకం అమలు చేసినా నూటికి 80 మంది బిడ్డల ప్రతిభ వికసించటం లేదు, వాళ్లకి నైపుణ్యం అందటం లేదు, వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడే శక్తి కొరవడుతోంది. అధికార కేంద్రీకరణ, విద్యారంగం వైఫల్యం వీటి మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని అర్థం చేసుకుంటే - స్థానిక ప్రభుత్వాలు కేవలం ప్రజాస్వామ్య సౌధాలు మాత్రమే కాదు, ఈ దేశంలో సామాన్యుడికి అవకాశాలు కల్పించటానికి, ప్రభుత్వ సేవలు సక్రమంగా అందటానికి అధికార వికేంద్రీకరణ, బలమైన జవాబుదారీతనమున్న స్థానిక ప్రభుత్వాల నిర్మాణం అత్యంత కీలకమని స్పష్టమవుతుంది.



రాజ్యాంగ నిర్మాణంలోనే స్థానిక ప్రభుత్వాల విషయంలో ఒక పెద్ద పొరపాటు జరిగింది. ఫెడరల్ వ్యవస్థ నిర్మాణంలో భాగంగా జాతీయ స్థాయిలో యూనియన్ ప్రభుత్వం, రాష్ట్రాల్లో ప్రభుత్వాలు, వాటి ఏర్పాటు రాజ్యాంగంలో చేశారు. అలాగే స్పష్టమైన అధికారాల విభజన కోసం, వనరుల విభజన కోసం నిర్దిష్టమైన ఏర్పాట్లు చేశారు. ఏడవ షెడ్యూల్‌లో యూనియన్, రాష్ట్రాల అధికారాల విభజన, వివిధ పన్నుల వసూళ్లలో యూనియన్, రాష్ట్రాల స్పష్టమైన పాత్ర.. యూనియన్ నుండి రాష్ట్రాలకు వనరుల పంపిణీ కోసం ఆర్థిక సంఘం పేరుతో పటిష్ఠమైన రాజ్యాంగబద్ధ ఏర్పాట్లు, యూనియన్, రాష్ట్రాల మధ్య వివాదాలుంటే వాటి పరిష్కారానికి సుప్రీంకోర్టుకు అధికారం.. ఇవన్నీ ఒక పటిష్ఠమైన సమాఖ్య వ్యవస్థకి దారితీశాయి. స్వతంత్రం వచ్చిన తొలినాళ్లలో చాలా మేరకు కేంద్రీకరణ ఉన్నా, కాలక్రమేణా రాష్ట్రాలు బలపడ్డాయి. ఇప్పుడు రాష్ట్రాల భవిష్యత్తు చాలా మేరకు ఆ రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వం, నాయకత్వాల మీదే ఆధారపడి ఉంది. దేశంలో బలపడ్డ బహుళ పార్టీల వ్యవస్థ, ప్రాంతీయ ఆకాంక్షల్ని ప్రతిబింబిస్తూ ప్రాంతీయ పార్టీల ఎదుగుదల, 1991లో చేపట్టిన ఆర్థిక సరళీకరణ ద్వారా లైసెన్స్-పర్మిట్-కోటా రాజ్యాన్ని అంతం చేయటం, ఆర్థిక సంఘాల ద్వారా రాష్ట్రాలకు వనరుల్ని సక్రమంగా, నిష్పాక్షికంగా కేటాయించటం, ఆర్థిక స్వేచ్ఛని ప్రజలకి, రాష్ట్రాలకు ఇవ్వటం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రాబల్యం తగ్గటం, 356 అధికరణం దుర్వినియోగాన్ని సుప్రీంకోర్టు బొమ్మయ్ కేసు తీర్పుతో చాలామేరకు అరికట్టటం - ఇవన్నీ రాష్ట్రాలు బలపడటానికి, బలమైన సమాఖ్య వ్యవస్థ నిర్మాణానికి దారితీశాయి.

కానీ స్థానిక ప్రభుత్వాల పాత్ర నామమాత్రమవటంతో అధికారం ఇప్పటికీ కేంద్రీకృతమై ఉంది. మన దేశంలో చాలా పెద్ద రాష్ట్రాలు విడిగా ఉంటే జనాభా రీత్యా ప్రపంచంలో అతి పెద్ద దేశాల సరసన ఉంటాయి. మన సగటు జిల్లాలు సైతం (తెలంగాణ మినహాయించి) ప్రపంచంలో సగం దేశాల కంటే పెద్దవి. భారతీయ సమాజం ప్రపంచం మొత్తంలోనూ అత్యంత వైవిధ్యభరితమైన సమాజం. ఇంత సంక్లిష్టమైన పెద్ద దేశంలో అధికార కేంద్రీకరణ ప్రజాస్వామ్య వ్యవస్థకి శాపంగా

పరిణమించింది. పరిపాలనా యంత్రాంగం స్థానిక నాయకత్వానికి జవాబుదారీగా ఉండే ఏర్పాటు లేకపోవటంతో రోజువారీ అందుకోవలసిన కనీస సేవల్ని కూడా సామాన్య ప్రజలు పొందటం కష్టమవుతోంది. హక్కుగా కావలసిన పనులకు కూడా చాలా సందర్భాల్లో పది సార్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది, లంచాలు ఇవ్వాల్సి వస్తోంది, ఎవరో సిఫార్సు కోసమో, దయాదాక్షిణ్యాల కోసమో, పలుకుబడి కోసమో నిరీక్షించాల్సి వస్తోంది. ఉత్సవ విగ్రహాలుగా ఉన్న స్థానిక ప్రభుత్వాలకి ప్రజలకి సరైన సేవలందించే అధికారమూ లేదు, అందుకు తగ్గ వనరులూ లేవు. దాంతో జీవన అవసరాలైన మంచినీరు, మురుగునీటి పారుదల, వరదనీటి పారుదల, స్థానిక రోడ్లు, దోమల నివారణ అన్నీ అస్తవ్యస్థమైపోయాయి. రోజువారీ జీవితం దుర్భరమవుతున్నది. కేంద్రీకరించిన పాలనలో వేసే ఓటుకి, ఓటరు కుటుంబానికి అందే ఫలితాలకు మధ్య సంబంధం తెగిపోయింది. అలాగే మనం కట్టే పన్ను డబ్బులకి, ఆ పన్నుల డబ్బుతో మనకందాల్సిన సేవలకి మధ్య ఏ సంబంధమూ లేకుండా పోయింది. దాంతో ఎన్నికలు ఒక కోలాహలంగా, ఓ పెద్ద సంబరంగా, కొందరు పెద్దల మధ్య అధికార క్రీడగా మారిపోయాయి. తన ఓటు వల్ల ఓటరుకు అర్థమయ్యే తీరులో జీవితంలో మార్పు కానరావటం లేదు. దాంతో ఎన్నికల సమయానికి పేదరికంలో మగ్గుతున్న సామాన్య ఓటరు డబ్బుకి, ఇతర ప్రలోభాలకి లొంగిపోతున్నాడు. కేంద్రీకృత పరిపాలనలో ఎవరు నెగ్గినా, ఎవరు ఓడినా జీవితంలో పెద్ద తేడా కనిపించనప్పుడు ఒక బీద సమాజంలో ఓటర్లు ఓటు వేయటానికి డబ్బులు ఆశించటంలో ఆశ్చర్యం లేదు. దీన్ని కేవలం నీతి నియమాల సమస్యగా భావిస్తే చాలా పొరపాటు. తమ జీవితంతో సంబంధంలేని రాజకీయ వ్యవస్థలో "చచ్చినవాడి పెళ్లికి వచ్చిందే కట్నం" తీరున సామాన్య ఓటర్లు డబ్బులు ఆశిస్తున్నారు. అన్ని ప్రధాన పార్టీలూ ఈ డబ్బుల పంపిణీలో ఆరితేరి ఎన్నికల్ని వ్యాపారంగా మార్చేశాయి. ఈ డబ్బు పంపిణీని కూడా అందరు ప్రధాన అభ్యర్థులూ విరివిగా చేయటంతో ఎన్నికల బరిలో ఉన్న పార్టీలవారు.. బీదరికాన్ని తొలగించటానికి, ఆదాయాల్ని పెంచటానికి, దీర్ఘకాలంలో ప్రభుత్వాలు చేయవలసిన పనుల్ని పక్కనపెట్టి తాత్కాలికమైన తాయిలాలతో ఓటర్లని ఆకర్షించి ఆదాయాలను పెంచని, పేదరికాన్ని తొలగించని ఉచిత హామీలతో ప్రజల డబ్బుని ప్రజలకే పంపిణీ చేసి దానకర్ణుల్లా నటిస్తున్నారు. దీనివల్ల తాత్కాలిక ఉపశమనమేగానీ, బీద కుటుంబాలకి బీదరికం మాత్రం శాశ్వత సత్యమై పోయింది. పుట్టుకతో సంబంధం లేకుండా మంచి ప్రమాణాల విద్య, నైపుణ్యాలు, ఆర్థికాభివృద్ధి, ఉత్పాదక కార్యాక్రమాల్లో పెట్టుబడులు, ఉపాధి కల్పన, దాన్నుంచి వచ్చే ఆదాయం – ఇదొక్కటే బీదరికాన్ని తొలగించటానికి ఉన్న ఏకైక మార్గం. కేంద్రీకృత పాలనలో ఈ దీర్ఘకాలిక దృక్పథం, ప్రభుత్వాల సామర్థ్యం పూర్తిగా కొరవడ్డాయి. ప్రతి రోజూ పరగడుపు అన్నట్లుగా ఎప్పటికప్పుడు తాత్కాలిక ఎన్నికల ప్రయోజనాల కోసం ప్రభుత్వాలు .. తాత్కాలిక సాయం కోసం బీద ప్రజలు నిరంతరం వెంపర్లాడే పరిస్థితి వచ్చింది. దాంతోపాటు ప్రభుత్వం తాను చేయాల్సిన పనుల్ని – చట్టబద్ధపాలన, నిత్యజీవితావసరాలు, మౌలిక సదుపాయాలు, ప్రజలకి భారం కాకుండా మంచి ప్రమాణాల విద్య, మంచి ప్రమాణాల ఆరోగ్యం – సమర్థంగా చేయనప్పుడు, కేంద్రీకరించిన ప్రభుత్వం వీటిల్లో విఫలమైనప్పుడు ప్రజల జీవన ప్రమాణాలు నిరంతరం నాసిగానే ఉంటాయి.




ఒక ఉదాహరణ చూద్దాం. నగరాల్లో బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లు సాధారణమైపోయాయి. ఒక అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో ప్రతి ఇంటికీ నెలకు సదుపాయాల నిర్వహణ కోసం ఫీజు చెల్లిస్తారు. అలాగే అందరూ కలిసి తమకు నమ్మకం ఉన్నవాళ్లని, సమర్థులను అపార్ట్‌మెంట్ నిర్వహణ కోసం ఎన్నుకుంటారు. అక్కడ ప్రతి ఇంటికి, ప్రతి కుటుంబానికీ నెలనెలా ఎంత డబ్బు చెల్లిస్తున్నామో, ఏమేమి అవసరాలు తీరాలని కోరుకుంటున్నామో స్పష్టంగా తెలుస్తుంది. బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్‌లో లిఫ్ట్ సరిగా పనిచేయకపోతే జీవితం దుర్భరమవుతుంది. అలాగే ప్రతి ఇంటికీ మంచినీళ్లు అందకున్నా, ఉమ్మడి వ్యవస్థల్ని సరిగా నిర్వహించకున్నా, వాహనాల పార్కింగ్‌కి సరైన ఏర్పాట్లు లేకున్నా ఆ కుటుంబాల జీవితం దుర్భరమవుతుంది. తాము ఓటు వేసి తమకు ఉమ్మడి సేవలను అందించేవారిని ఎన్నుకున్నామన్న స్పృహ ప్రతి ఇంటికీ ఉంటుంది. అలాగే తాము నెలనెలా కడుతున్న డబ్బు తమకు అందవలసిన సదుపాయాల కోసమన్న అవగాహన ప్రతి కుటుంబానికీ ఉంటుంది. అలాంటప్పుడు అక్కడ ఎన్నికయ్యే నాయకత్వం ఓటర్లను డబ్బుతో ప్రలోభపెట్టటమో లేదా తాత్కాలికమైన తాయిలాలతో మభ్యపెట్టటమో సాధ్యం కాదు. పొరపాట్లు జరిగితే, ప్రతి ఒక్కరూ గొంతు విప్పుతారు, నాయకత్వాన్ని నిలదీస్తారు, తప్పును వెంటనే సరిదిద్దుతారు. అది నిజమైన ప్రజాస్వామ్యం. అందుకే స్థానిక ప్రభుత్వాలు ప్రజాస్వామ్యానికి పాఠశాలలు. అధికారం ప్రజలకి ఎంత దూరంగా ఉంటే, జవాబుదారీతనం అంత తక్కువగా ఉంటుంది. మన పన్నుల డబ్బుకి అందే సేవలు చాలా

అసమర్థంగా, నీరసంగా ఉంటాయి. దీన్ని విస్మరించి మన దేశంలో ఎంతసేపటికీ అధికారమంతా ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్ – ఈ ముగ్గురి చేతుల్లోనే 90 శాతం కేంద్రీకరించటం జరిగింది.

రాజ్యాంగ నిర్మాణంలో జరిగిన పొరపాటు వల్ల యూనియన్ ప్రభుత్వం, రాష్ట్రాలు ఏర్పడి ఎన్నికలు జరుగుతున్నా, స్థానిక ప్రభుత్వాల ఊసే లేకుండా పోయింది. స్వతంత్రం వచ్చాక 12 ఏళ్లకి కొన్ని రాష్ట్రాల్లో చట్టాల ద్వారా స్థానిక ప్రభుత్వాలను ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర, గుజరాత్, కేరళ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక లాంటి రాష్ట్రాల్లో కొంతమేరకు బలమైన స్థానిక ప్రభుత్వాలు ఏర్పడినాయి. మంచి ప్రమాణాల నాయకత్వం స్థానిక ప్రభుత్వాల్లో ఎదిగింది. ఆనాడు ఒక సమితి ప్రెసిడెంట్ పదవి ఎమ్మెల్యే కంటే ప్రతిష్టాత్మకమైనది. అలాగే జడ్పీ అధ్యక్షులు మంత్రుల కంటే బలమైనవాళ్లు. ఒక 10–15 సంవత్సరాల పాటు స్థానిక ప్రభుత్వాలు బలంగా ఉన్న రాష్ట్రాల్లో ఆ నాయకత్వం అద్భుతమైన ఫలితాల్ని సాధించింది. కానీ 1970ల దశకంలో దేశమంతా అధికార కేంద్రీకరణ జరగటంతో దాదాపు అన్నిచోట్లా స్థానిక ప్రభుత్వాలు నశించిపోయాయి. ఆ తర్వాత కాలంలో కాలక్రమేణా స్థానిక శాసన సభ్యులు, ఉన్నతాధికారులు స్థానిక ప్రభుత్వాలను తమకు పోటీగా భావించి అవి బలపడకుండా అడ్డుకుంటున్నారు. చాలా ఆర్భాటంతో 1990ల దశకంలో 73, 74 రాజ్యాంగ సవరణల్ని చేశారు. 7,700 పదాలతో అమెరికన్ రాజ్యాంగం కంటే ఎక్కువ పొడవుతో సుదీర్ఘమైన రాజ్యాంగ సవరణని చేపట్టినా, ఫలితం లేకుండా పోయింది. ఇందుకు మొదటి కారణం – స్థానిక ప్రభుత్వాల నిర్మాణాన్ని విపులంగా, రాష్ట్రాలకు ఏమాత్రం చొరవ లేకుండా, స్థానిక పరిస్థితుల్ని బట్టి మార్పులకి, చర్యలకు అవకాశం లేకుండా ఒక మూసలో రాజ్యాంగంలో ఏర్పాటు చేశారు. దాంతో స్థానిక అవసరాలకి, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా స్థానిక ప్రభుత్వాల నిర్మాణం చేయటం సాధ్యం కాకుండా పోయింది. రెండోది, ఒక మూస పోసిన నిర్మాణాన్ని ఇంత వైవిధ్యభరితమైన దేశంలో పిడుక్కి, బియ్యానికి ఒకటే మంత్రంలా అందరికీ వర్తించేటట్లు రాజ్యాంగంలో ఏర్పాటు చేశారుగానీ, వాటికి ఏమాత్రం స్పష్టమైన అధికారాల్ని నిర్వచించలేకపోయారు. 11, 12 షెడ్యూళ్ల పేరుతో స్థానిక ప్రభుత్వాల పరిధిలో ఉన్న అంశాల ప్రస్తావన చేశారుగానీ, 7వ షెడ్యూల్‌లోలా ఆ అధికారాల్ని స్థానిక ప్రభుత్వాలకు బదిలీ మాత్రం చేయలేదు. దీంతో స్థానిక ప్రభుత్వాలు పూర్తిగా ఉత్సవ విగ్రహాలుగా నీరుగారిపోయాయి.

మన ప్రజాస్వామ్యం నిజంగా పటిష్టం కావాలీ అంటే, స్వపరిపాలన ఫలితాలు ప్రజలకు అందాలీ అంటే, బలమైన, స్పష్టమయిన అధికారాలు, బాధ్యతలతో కూడిన, వనరులున్న, జవాబుదారీతనమున్న స్థానిక ప్రభుత్వాలను ఏర్పాటు చేయటం అత్యవసరం. మనతో పోలిస్తే ప్రజాస్వామ్య సంప్రదాయంలో చాలా బలహీనంగా ఉన్న పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో కూడా స్థానిక ప్రభుత్వాలు బలంగా ఉన్నాయి. ప్రపంచంలో ప్రతి ప్రజాస్వామ్య దేశంలో స్థానిక ప్రభుత్వాలు మన దేశంలో కంటే చాలా బలమైనవి. చివరికి, నియంతృత్వం రాజ్యమేలుతున్న చైనా లాంటి దేశంలో కూడా స్థానిక ప్రభుత్వాలకి మన దేశంలో కంటే చాలా విశిష్టమైన అధికారాలు, వనరులు, స్వయం ప్రతిపత్తి ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యంత బలహీనమైన, ఉత్సవ విగ్రహాలుగా మారిన స్థానిక ప్రభుత్వాలు ఉన్నది మన దేశంలోనే. మన ప్రజల్లో అపారమైన శక్తిసామర్థ్యాలున్నాయి. మన ప్రజాస్వామ్యంలోని సంక్షోభానికి గాని, ఉమ్మడి జీవితంలో సమస్యలకు గాని పరిష్కారాలు మన ప్రజల నుండి వస్తాయి. మన నగరాలు, పట్టణాలు, గ్రామాలలో మంచి విద్య,




నాయకత్వం, ప్రజాస్వామ్య దృక్పథం, చొరవ ఉన్న పౌరులు కోకొల్లలుగా ఉన్నాయి. ఆ అపార శక్తిసామర్థ్యాలను సమస్యల పరిష్కారానికి వినియోగించాలీ అంటే, ప్రజలు కేవలం అర్జీలు ఇచ్చి నిరసనలు తెలిపే స్థితికి దిగజారటం కాకుండా పరిష్కారంలో భాగం కావాలీ అంటే స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయటం, వాటి జవాబుదారీతనానికి పటిష్టమైన ఏర్పాట్లు చేయటం అత్యవసరం.

అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏం చేయాలి? మొదటిది, స్థానిక ప్రభుత్వాలకు స్పష్టమైన అధికారాలను రాజ్యాంగబద్ధంగా నిర్వచించాలి. 11, 12 షెడ్యూళ్లలో నిర్వచించిన బాధ్యతల్ని కేవలం సూచనలుగా కాకుండా విధిగా స్థానిక ప్రభుత్వాలు చేపట్టే బాధ్యతలుగా రాజ్యాంగంలో స్పష్టమైన ఏర్పాట్లు చేయాలి. అంటే 7వ షెడ్యూల్‌లో స్పష్టంగా రాష్ట్రాలకు అధికారాల్ని, బాధ్యతల్ని పంపిణీ చేసినట్లుగా, స్థానిక ప్రభుత్వాలకు కూడా స్పష్టమైన అధికారాలు, బాధ్యతలు పంపిణీ కావాలి. రెండోది, ఒక మూస పోసిన విధానం ఇంత వైవిధ్యభరితమైన దేశానికి సత్ఫలితాలనివ్వదు. కాబట్టి, స్థానిక ప్రభుత్వాల నిర్మాణం ఆయా రాష్ట్రాల అనుభవాలు, అవసరాలను బట్టి ఏర్పాటు చేసే అధికారం రాష్ట్రాలకు ఉండాలి. విధిగా, ప్రజాస్వామ్యబద్ధంగా

ఎన్నికైన స్థానిక ప్రభుత్వాల ఏర్పాటు అయ్యేవరకు, వాటికి అధికారాల్ని, వనరుల్ని పంపిణీ చేసే వరకు వాటి నిర్మాణం చేపట్టటంలో స్వేచ్ఛని రాష్ట్రాలకు ఇవ్వాలి. మూడోది, వనరుల పంపిణీకి పటిష్ఠమైన ఏర్పాట్లు ఉండాలి. రాజ్యాంగంలో రాష్ట్ర ఆర్థిక సంఘాలకు ఏర్పాట్లు జరిగినా, దాదాపు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అవి పేలవంగా, నిరర్థకంగా ఉన్నాయి. అలాకాకుండా జాతీయ ఆర్థిక సంఘాలు – ఇప్పటికి 15 సంఘాలు ఏర్పాటయ్యాయి – యూనియన్, రాష్ట్రాల వనరుల పంపిణీని చాలా పటిష్ఠంగా, సమర్థవంతంగా, నిర్మాణాత్మకంగా, నిష్పాక్షికమైన పద్ధతిలో చేస్తున్నాయి. స్థానిక ప్రభుత్వాల వనరుల విషయంలో కూడా అలాంటి పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలి. నాలుగోది, కాలక్రమేణా గ్రామాలు నిర్జనమవుతున్నాయి. ఆర్థిక వ్యవస్థ అంతా పట్టణాలు, నగరాల్లోనే పెరగటంతో లక్షలాది మంది పొట్ట చేత పట్టుకుని వలసలు పోవాల్సి వస్తోంది. ఏమాత్రం విద్య, నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు ఉన్నా, గ్రామాల్లో వారి ఆశలు నెరవేరే అవకాశం లేక పట్టణాలకు వలస పోవాల్సి వస్తోంది. దాంతోపాటు, ఇంకా కులానికో పేట గ్రామాల్లో కొనసాగుతున్నది. సమాజం కుల వ్యవస్థ పేరుతో సృష్టించిన అంతరాలు ఇంకా ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల వ్యవస్థని ప్రభావితం చేస్తున్నాయి. ఈ భయంతోనే డా॥ అంబేద్కర్ స్థానిక ప్రభుత్వాల ఏర్పాటును రాజ్యాంగంలో చేయలేదు. కేవలం ఆదేశిక సూత్రాల్లో ప్రస్తావన చేసి దాంతో సరిపుచ్చారు. ఈనాటి పరిస్థితుల్లో 6 లక్షల గ్రామాలకి, 15 లక్షల ఆవాసాలకి మౌలిక సదుపాయాలనందించటం, సమర్థమైన సేవలందించటం అసాధ్యం. కేరళ రాష్ట్రంలో సుమారు 3.5 కోట్ల జనాభా ఉన్నా, కేవలం 900 పంచాయతీలు మాత్రమే ఉన్నాయి. అంటే మన ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో పాత జిల్లాల్లో ఉన్న పంచాయతీల కంటే కేరళ పంచాయతీల సంఖ్య తక్కువ. 25–30,000 జనాభాతో కొన్ని గ్రామాల్ని కలిపి ఒక పంచాయతీగా ఏర్పాటు చేసినట్లయితే, ఉమ్మడి సేవలు అందించటం, స్థానిక ప్రభుత్వాల కార్యాలయాలను నిర్మించటం, కంప్యూటరీకరణ చేయటం, రికార్డులు నిర్వహించటం, ఉమ్మడి సదుపాయాల్ని చేపట్టటం సులభమవుతుంది. అలాగే ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీల్లో సమర్థమైన నాయకులు ఎదగటం సులభమవుతుంది, స్థానిక ప్రభుత్వాలకు తగినంత సమర్థ నాయకత్వం లభిస్తుంది. కొన్ని గ్రామాల్ని కలిపివేయటంతో ప్రజాస్వామ్యంలో, ఎన్నికలలో కులం ప్రభావం, పెత్తందారుల ప్రభావం, ఫ్యూడల్ శక్తుల ప్రభావం బలహీనపడతాయి. దీంతోపాటు ఎక్కడికక్కడ చిన్న పట్టణాల్లో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసి – ముఖ్యంగా మంచినీరు, మురుగు నీటిపారుదల, 24 గంటల విద్యుత్తు, మంచి ప్రమాణాల విద్య, మంచి ప్రమాణాల ఆరోగ్యం – ఎక్కడో సుదూరంగా ఉన్న నగరాలకు వలస పోవాల్సిన అవసరం లేకుండా, దగ్గర్లో ఉన్న పట్టణాల్లో అన్ని వసతులూ ఉండే ఏర్పాట్లు జరిగితే.. పట్టణీకరణ ఎక్కడికక్కడ స్థానికంగా జరుగుతుంది. సొంత ఊళ్లో వ్యవసాయం చూసుకుంటూ, పట్టణాల్లో నివాసముంటూ, ఒక వృత్తినో వ్యాపారాన్నో చేపట్టవచ్చు. కాలక్రమేణా సహజమైన పట్టణీకరణ జరిగి ఆర్థికాభివృద్ధి ఫలితాలు గ్రామీణ ప్రాంతాలకు అందుతాయి. వీటితోపాటు దేశంలో 10 లక్షలు దాటిన మహానగరాల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం 60కి పైగా మహానగరాలు అలాంటివి ఉన్నాయి. వేగంగా పెరుగుతున్న మహానగరాల అవసరాలు, సమస్యలు ప్రత్యేకమైనవి. కాబట్టి ఆ నగరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని, పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు, ఉపాధి కల్పనకి నగరాల ప్రాధాన్యత దృష్ట్యా నగర ప్రభుత్వాల నిర్మాణానికి, ప్రపంచ ప్రమాణాలతో ప్రత్యేకమైన ఏర్పాట్లుండాలి. మూస పోసిన స్థానిక ప్రభుత్వాల నిర్మాణం, పెరుగుతున్న నగరాల అవసరాలకి సరిపడవు. వీటన్నిటితోపాటు స్థానిక ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా ఉండే, అధికార దుర్వినియోగం చేయకుండా ఉండేలా ప్రతి జిల్లాకి, నగరానికి బలమైన, స్వతంత్ర అంబుడ్స్‌మన్ వ్యవస్థని, అలాగే ప్రజలకు విధిగా సకాలంలో సేవలు అందించేందు బలమైన సిటిజన్స్ చార్టర్లను (పౌర సేవల పత్రాల్ని) ఏర్పాటు చేసి అమలు చేయటం అవసరం.

మన ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు, స్వేచ్ఛ పుష్కలంగా ఉన్నాయి. కానీ నిజమైన ప్రజాస్వామ్యం ఇంకా వేళ్లూనుకోలేదు. ఓటు, అడపాదడపా నిరసనలు, చట్టసభల్లోనూ, బహిరంగ చర్చల్లోనూ, టీవీ ఛానళ్లలోనూ అరుపులు, కేకలు, పెడబొబ్బలు ఇవి మాత్రమే ప్రజాస్వామ్యం అనుకుంటే పొరపాటు. చట్టబద్ధపాలన, ప్రజల సాధికారత, బలమైన, ప్రజలకు జవాబుదారీగా ఉన్న సమర్థమైన స్థానిక ప్రభుత్వాలు, మారుతున్న అవసరాలకి వేగంగా స్పందించి పొరపాట్లను సవరించే ఏర్పాట్లు – ఇవన్నీ ఉంటేనే అది నిజమైన ప్రజాస్వామ్యం. మన జాతి నిర్మాతలు ఒక అసాధారణమైన ప్రజాస్వామ్య వ్యవస్థకి శ్రీకారం చుట్టారు. మున్నెన్నడూ ప్రపంచంలో బీదరికంలో, నిరక్షరాస్యతలో కుంగిపోతున్న ఒక సమాజంలో ప్రజాస్వామ్య నిర్మాణం చేసే సాహసం చేయాలేదు. మన రాజ్యాంగ నిర్మాతలు అపారమైన ఆత్మవిశ్వాసంతో, ఆశావాదంతో ఈ ప్రజాస్వామ్య వ్యవస్థను నెలకొల్పారు. కానీ స్థానిక ప్రభుత్వాలు మూడవ అంచెలో పేలవంగా, బలహీనంగా, నామమాత్రంగా ఉండటంతో ఈ ప్రజాస్వామ్య వ్యవస్థ అసంపూర్ణం, నిర్మాణం బలహీనం, ఫలితాలు పరిమితం అయ్యాయి. ఇప్పటికీ బలమైన ప్రజాస్వామ్య నిర్మాణం చేయటంలో మన వైఫల్యం మనల్ని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, పాలనాపరంగా తీవ్రంగా బలహీనపరిచింది. ఇప్పటికైనా మనం గతానుభవాల నుండి, ప్రపంచ అనుభవాల నుండి పాఠాలు నేర్చుకోవాలి. ప్రజలకు అధికారాల్ని బదిలీ చేసి పటిష్ఠమైన స్థానిక ప్రభుత్వాల ద్వారా నిజమైన, అర్థవంతమైన ప్రజాస్వామ్యాన్ని ఏర్పాటుచేయటం మన పిల్లల భవిష్యత్తుకి అత్యవసరం.

# ఆరోగ్యంపై నిర్లక్ష్యాన్ని కళ్లకు కట్టిన కొవిడ్




ఆరోగ్య రంగంలో గడచిన 75 ఏళ్లలో నిర్లక్ష్యాన్ని కొవిడ్ కాలం కళ్లకు కట్టిందని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. 'రైస్ ఏటీఎం అండ్ ప్రాజెక్ట్ ప్రిషా' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్యాండమిక్ 2021-22 ఫొటోగ్రఫీ పోటీల్లో విజేతలకు హైదరాబాద్ రవీంద్ర భారతిలో బహుమతీ ప్రదానోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జేపీ మాట్లాడుతూ, మంచి చిత్రం సమాజానికి అద్దం పడుతుందని, కొవిడ్ కాలంలో మన పత్రికలు చక్కగా స్పందించాయన్నారు. హేతుబద్ధమైన చర్యలు ఆలస్యం కాకుండా చేపడితే మార్పు ఎలా ఉంటుందో టీకా కార్యక్రమం నిరూపించిందన్నారు. అయితే ఆరోగ్య వ్యవస్థ అధ్వాన్నంగా ఉండటం వల్ల కొవిడ్ ప్రభావం పాశ్చాత్య దేశాల్లో కంటే తక్కువగా ఉన్నా కూడా మన దేశంలోనే ఎక్కువగా నష్టపోయామన్నారు. మళ్లీ పరగడుపే అన్నట్లు కాకుండా మన ఆరోగ్య వ్యవస్థ వైఫల్యాన్ని సరిదిద్దుకోవాలన్నారు. ఆరోగ్య రంగంలో కొద్దిమేర అదనపు నిధుల్ని ఇవ్వాలని, అలాగే ఇప్పుడు చేస్తున్నట్లు కాకుండా సరైన రీతిలో ఫలితాలు వచ్చేలా ఖర్చు చేయాలన్నారు.

ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వం టివి ఉన్నా ఎందుకు ప్రజలకు ఆరోగ్యం అందటం లేదో ప్రభుత్వాలు, సమాజం ఆలోచించాలన్నారు. జాతీయాదాయంలో కేవలం అంశాతం పెంచితే, తెలుగు రాష్ట్రాలు స్థూల ఉత్పత్తిలో కేవలం 1 శాతం దాకా పెంచితే, అందరికీ ఉచితంగా నాణ్యమైన ఆరోగ్యాన్ని ఎలా అందించవచ్చో లోక్‌సత్తా ఒక సమగ్ర విధాన పత్రాన్ని రూపొందించి ప్రభుత్వాలకు అందించిందని, అమలే తరువాయని జేపీ వివరించారు. అనంతరం వివిధ జిల్లాల ఫొటోగ్రాఫర్లకి బహుమతులు అందచేశారు. రైస్ ఏటీయం వ్యవస్థాపక నిర్వాహకుడు దోసపాటి రాముని అభినందించారు. సంగీత దర్శకుడు ఆర్.పి పట్నాయక్, రైస్ ఏటీయం నిర్వాహకురాలు జొన్నలగడ్డ యశస్విని తదితరులు పాల్గొన్నారు. ✦



# ఎన్నికల ప్రవాహంలో కొట్టుకుపోవటం తప్పు..
# దేశం దశ-దిశ పట్ల అవగాహన ఏదీ?

ఎన్నికల ప్రవాహంలో కొట్టుకుపోవటం తప్ప దేశ రాజకీయ వ్యవస్థను లోతుగా అధ్యయనం చేసి పరిష్కారాల్ని గుర్తించిన నేతలు అరుదైపోవటం వల్ల భారత్ తన సామర్థ్యానికి తగ్గట్లు ఎదగటం లేదని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రధానమంత్రి స్థాయి వరకూ ఇదే పరిస్థితి ఉందన్నారు. అనుభవంతో, ఇంగిత జ్ఞానంతో కొన్ని విషయాల్ని ఆకళింపు చేసుకోవటం తప్ప.. దేశ రాజకీయాల గురించి శాస్త్రీయ, తులనాత్మక అధ్యయనం కొరవడిందన్నారు. ఆ రకమైన అధ్యయనం చేయటంతోపాటు, సమగ్ర పరిష్కారాల సాధనకు కూడా వేదిక కావటం లోక్‌సత్తా సాధించిన అతి పెద్ద విజయమన్నారు. సివిల్ సర్వీసెస్ శిక్షణార్థులతో హైదరాబాద్‌లోని జి.ఆర్ స్టడీ సర్కిల్ నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో జేపీ పాల్గొన్నారు. నల్లధనం, దళితబంధు, కేపిటలిజం, హిందూత్వ, ఇంగ్లీషు మీడియం – విద్యా ప్రమాణాలు, ప్రభుత్వోద్యోగాలు, దిశ కేసులో ఎన్‌కౌంటర్, ఉరిశిక్ష, రాజ్యవ్యవస్థ పాత్ర, సివిల్ సర్వీసెస్‌లో సంస్కరణలు, ఐఏఎస్‌లు ఎదుర్కొనే రాజకీయ సవాళ్లు, కొత్త రాజ్యాంగం అవసరమా, తెలంగాణలో గవర్నర్ వివాదం, అవినీతిపై వ్యవస్థీకృత పోరు, సోషల్ మీడియాలో నిజాల్ని తెలుసుకోవటం, చట్టబద్ధపాలన, ఉచితాలు తదితర అంశాలపై జేపీ వివరించారు.



# గన్నీ బ్యాగుల కోసం ఏటా వెతుకులాట -
# కొరవడిన పారదర్శకత



సారు ఏం చేస్తున్నారయ్యా అంటే.. బురదలో పెట్టిన కాలును కడుక్కుంటున్నారట!

బురద రాజకీయం వర్కవుట్ అయివుంటే ఎలా ఉండేదో గానీ, ఇప్పుడు మాత్రం.. ఉద్దేశపూర్వకంగా తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు ధాన్యం రైతులతో చెలగాటమాడారనే అభిప్రాయం పలువురిలో నెలకొంది.

.. తెలంగాణ యాసంగి ధాన్యంలో నూక ఎక్కువ నేపథ్యంలో ఇప్పటి దాకా అనుసరిస్తున్న ఉప్పుడు బియ్యంగా మార్చి అమ్మే పద్ధతిని ఇక కొనసాగించబోమని యూనియన్ ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా చెప్పిందీ కేసీఆర్ ప్రభుత్వమే,

ప్రాజెక్టు ఖర్చుకి, పంటల ద్వారా వచ్చే ఆదాయానికి పొంతన లేకపోయినా, రాష్ట్రంలోని వాటర్ టేబుళ్లు మారిపోయే ప్రమాదమున్నా కాళేశ్వరం వంటి అసంబద్ధ ప్రాజెక్టును నిర్మించి పెద్దఎత్తున వరి వేయటానికి (ఒక కిలో ధాన్యం ఉత్పత్తికి దాదాపు 3 నుండి 5 వేల లీటర్ల వరకు నీటి వినియోగం జరుగుతోంది) కారణమైనదీ ముఖ్యమంత్రే,

ధాన్యం కొంటున్నది తామేనని చెప్పుకుంటూ 2014కు ముందు, ఆ తర్వాతా లెక్కల్ని గతేడాది దాకా ఏకరువు పెట్టిందీ ముఖ్యమంత్రే,

ధాన్యం కొనాల్సింది యూనియన్ ప్రభుత్వమేనని ఆ తర్వాత గొంతు సవరించుకున్నదీ ప్రభుత్వమే,

వికేంద్రీకృత సేకరణ పద్ధతి రీత్యా తెలంగాణలో ధాన్యం రూపంలో సేకరించాల్సింది రాష్ట్ర ప్రభుత్వం, బియ్యం రూపంలో తీసుకోవాల్సింది యూనియన్ ప్రభుత్వం కాగా.. ధాన్యం రూపంలో యూనియన్ ప్రభుత్వమే తీసుకోవాలని దబాయించిందీ కేసీఆర్ ప్రభుత్వమే,

యూనియన్ ప్రభుత్వం 2020లో తెచ్చిన నూతన వ్యవసాయ చట్టాలు మంచివేనని తొలుత అంగీకరించి ఆ తర్వాత వాటిని తీవ్రంగా విమర్శించి రద్దును స్వాగతించిందీ కేసీఆరే,

డిమాండ్ లేదు కాబట్టి వరి వేయవద్దని నిజాయతీగా చెప్పిందీ రాష్ట్ర ప్రభుత్వమే,

ఆ తర్వాత ధాన్యం కొనటం లేదని చెప్పి యూనియన్ ప్రభుత్వంతో నెలల తరబడి యుద్ధం చేసిందీ కేసీఆర్ సర్కారే,

చివరికి ఇప్పుడు ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసి యూనియన్ చెబుతున్న రీతిలో ముడి బియ్యం, ఫోర్టిఫైడ్ ఉప్పుడు బియ్యం తరహాలోనే అందించటానికి (తెలంగాణ సర్కారు ప్రతిపాదించినట్లు 40.20 లక్షల టన్నుల మెట్రిక్ టన్నుల సాధారణ బియ్యం, 2.60 లక్షల మెట్రిక్ టన్నుల ఉప్పుడు బియ్యం తీసుకునేందుకు సిద్ధమేనని యూనియన్ ప్రభుత్వం అధికారికంగా సమాచారం అందించింది) యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నదీ కేసీఆర్ ప్రభుత్వమే

.. ఈ మొత్తంలో యూనియన్‌లో అధికారంలో ఉన్న బీజేపీ జాతీయ స్థాయిలో ఒక స్పష్టమైన, నిలకడయిన వైఖరితోనే వ్యవహరించగా, రాష్ట్రంలోని ఆ పార్టీ నాయకులు మాత్రం వరి రైతులను రెచ్చగొట్టేలా వ్యవహరించారనటంలో సందేహం లేదు. బీజేపీ రాష్ట్ర పార్టీ వైఫల్యాన్ని ఏ రాజకీయ ఎత్తుగడలో భాగంగా, ఏ వ్యాపార వర్గాల ప్రయోజనాల పరిరక్షణలో భాగంగా కేసీఆర్ వినియోగించుకోవాలనుకున్నారోగానీ అతి విశ్వాసానికి పోయారు. అప్పటిదాకా తాను చెప్పిన హేతుబద్ధ మాటలను పక్కన పడేసి, ఇష్టారాజ్యమున్నట్లు మాట్లాడారు.

యూనియన్ ప్రభుత్వం మొండిగా వ్యవహరించటంతో.. బీజేపీని విలన్‌గా చూపించి, ఆ తర్వాత నూకల నష్టాన్ని కేసీఆర్ ప్రభుత్వమే భరించి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందనే విషయం రైతులకే కాకుండా రాష్ట్రంలో అన్ని వర్గాలకూ అర్థమైంది. అందుకే ఆయన ఢిల్లీ దాకా వెళ్లి భారీ పటాలంతో ఆందోళన చేసినా పెద్దగా స్పందన కనిపించలేదు.

ఈ ప్రహసనంలో సాంప్రదాయ రాజకీయం డొల్లతనం

వెల్లడవుతున్నా, ఇందులో రైతు గోస మాత్రం వాస్తవం. వ్యవసాయ సంక్షోభం మాత్రం వాస్తవం (అప్పుల ఊబిలో కూరుకున్న అత్యధిక వ్యవసాయ కుటుంబాల్లో ఏపీ, తెలంగాణ మొదటి రెండు స్థానాల్లో ఉండగా, తర్వాతి స్థానాల్లో కేరళ (69.9%), కర్ణాటక (67.7%), తమిళనాడు (65.1%), ఒడిషా (61.2%), మహారాష్ట్ర (54%), పశ్చిమ బెంగాల్ (50.8%) ఉన్నాయి. వ్యవసాయ కుటుంబాల రుణభారంపై నిర్వహించిన 70వ రౌండ్ సర్వే (2012-13) ప్రకారం అప్పుల్లో చిక్కుకున్న వ్యవసాయ కుటుంబాల సంఖ్య ఏపీలో 92.9% ఉండగా, 77వ రౌండ్ సర్వే (2018-19) నాటికి 93.2 శాతానికి చేరింది. ఇదే సమయంలో తెలంగాణలో రుణభారం మోస్తున్న రైతు కుటుంబాల సంఖ్య 89.1% నుండి 91.7 శాతానికి చేరింది).

ఏటా వస్తున్న వ్యవసాయ సమస్య 2022 యాసంగిలో కాస్త నాటకీయ మలుపులు తిరిగింది తప్ప, విషయం పాతదే. కాబట్టి వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించి, రైతుకు ఆదాయాన్ని పెంచే రీతిలో ఉత్పత్తి నుండి ఎగుమతుల వరకూ సమగ్ర పరిష్కారం కోసం చిత్తశుద్ధితో ప్రయత్నం చేయటమే ఇప్పుడు కేసీఆర్ నెరవేర్చాల్సిన అసలైన బాధ్యత.

ఒక నూతన వ్యవసాయ విధానాన్ని రూపొందించేందుకు హైదరాబాద్‌లో శాస్త్రవేత్తలు, నిపుణులు, ఇతర సంబంధిత వర్గాలతో జాతీయ సదస్సును నిర్వహిస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించటం స్వాగతించదగ్గ విషయం. సంకుచిత రాజకీయ ఎజెండా రుద్దేందుకు కాకుండా రైతుల సమస్యను సమగ్రంగా చర్చించి శాశ్వతంగా పరిష్కరించి ఓట్లు పొందేందుకు కేసీఆర్ ఈ సదస్సును వినియోగించుకుంటారని, యూనియన్ ప్రభుత్వం కూడా కలసివస్తుందని ఆశిద్దాం.

ఇక తక్షణ పరిష్కారంగా యాసంగి ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం చురుగ్గా చర్యలు తీసుకుంటున్నా, ఇక్కడా సరిదిద్దుకోవాల్సిన అంశాలున్నాయి. ఇందులో గోనె సంచుల సమస్య ఒకటి.

ప్రస్తుత యాసంగి ధాన్యం సేకరణకు సుమారు 16 కోట్ల గోనెసంచులు అవసరమని అంచనా వేస్తుండగా, కొనుగోళ్లు ప్రారంభించిన ఏప్రిల్ రెండో వారం నాటికి ప్రభుత్వానికి అందుబాటులో ఉన్నవి కేవలం 1.2 కోట్లు మాత్రమే. సుమారు ఎనిమిది కోట్ల పాత సంచుల కోసం ప్రభుత్వం టెండర్లు పిలిచింది. అక్కడ సమస్య రావటంతో తక్షణావసరం కోసం కొంతమేర మిల్లర్లు, వ్యాపారస్తుల నుండి సేకరించారు. మిగిలిన గోతాల కోసం జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జేసీఐ)ను సంప్రదించారు.

వరి కాకుండా పత్తి, మిర్చి, మక్కలు వంటి ఇతర పంటలకు కూడా గోనె సంచుల అవసరముంది. అయినా గన్నీ బ్యాగుల టెండర్ దగ్గర్నుంచి, సంచుల సరఫరా వరకు పారదర్శకత లేకుండా రహస్యమన్నట్లు జరుగుతుండటంతో ఏటా గందరగోళం, హడావుడి కొనసాగుతున్నాయి. దీనిపై కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో ముఖ్యమంత్రి స్వయంగా స్పందించి అధికారులకు సూచనలిచ్చినా పరిస్థితిలో మార్పు రాలేదు.

కొవిడ్ తొలి దశలో అన్ని రంగాలూ అల్లకల్లోలమైనా వ్యవసాయోత్పత్తుల దిగుబడి దండిగా ఉంది. ఎన్ని అవాంతరాలున్నా ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కేసీఆర్ లాక్‌డౌన్ సమయంలో మీడియా ద్వారా రైతులకు హామీ ఇచ్చారు. కొనుగోళ్లకు సంబంధించిన ఇతరత్రా సవాళ్లతోపాటు గన్నీ బ్యాగుల కొరత గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఏటా ఈ సమస్య ఎదురవుతోందని, బెంగాల్, బంగ్లాదేశ్‌ల నుంచి గోనెసంచుల్ని దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని, తెలంగాణలోనే వీటి ఉత్పత్తికి ఏర్పాట్లను పరిశీలించాలని అధికారులకు సూచించారు. కానీ లాక్‌డౌన్ ఎత్తేశాక ఆ అంశం మరుగున పడిపోయింది. మళ్లీ గన్నీ బ్యాగుల్ని దిగుమతి చేసుకుని ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఆ తర్వాత వానాకాలం ధాన్యం కొనుగోళ్లు మొదలయ్యాయి. ఆ సీజన్‌లో రాష్ట్రంలో 18.76 కోట్ల గన్నీ బ్యాగులు అవసరమవుతాయని మంత్రి చెప్పారు. వీటిల్లో 10.13 కోట్ల బ్యాగులు కొత్తవికాగా, మిగిలిన వాటికి పాత సంచులనే ఏర్పాటు చేస్తున్నట్లు వార్తలొచ్చాయి. కానీ ఏం జరిగిందో వివరాల్లో పారదర్శకత లేదు.

వాస్తవానికి రైతుల దగ్గర కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు పంపిన తర్వాత మర ఆడించి ప్రభుత్వానికి అప్పచెప్పాలి. కానీ సంచులను డ్యామేజ్ పేరిట పక్కనపెట్టి ప్రైవేటు వ్యాపారులకు అమ్ముతున్నారని సమాచారం. దీంతో మిల్లుల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన బ్యాగులు ప్రైవేటు వ్యక్తుల దుకాణాల్లో తేలుతున్నాయి. పంట విస్తీర్ణానికనుగుణంగా గోనె సంచుల సరఫరా లేదు. కొన్ని సందర్భాల్లో కొత్త బ్యాగులు సరఫరా చేస్తామని చెప్పి పాతవి, మరమ్మతు చేసినవి ఇస్తున్నారని సొసైటీల చైర్మన్లు చెబుతున్నారు. కాంట్రాక్టరు టెండరు ఎంతకు దక్కించుకుంటున్నాడు, ప్రభుత్వం ధర ఎంత చెల్లిస్తోంది, దుకాణాలకు కాంట్రాక్టరు ఎంతకు అమ్ముతున్నాడు వంటి అంశాలు వెల్లడి కావటం లేదు. గోనె సంచుల కొరతను పరిష్కరించకపోవటం వల్ల ఏటా పంట చేతికొచ్చే సమయానికి రైతులు ఇక్కట్లు పడుతున్నారు. పంట తడిసి నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో గన్నీ బ్యాగులపై ఒక స్పష్టమైన విధానంతో ప్రభుత్వం వ్యవహరించాలి.

భవిష్యత్తులో వ్యవసాయంలో హేతుబద్ధ విధానాలు వచ్చి రైతులు పంటలను మార్కెట్‌లోనే ఎక్కువగా అమ్ముకున్నా.. ప్రభుత్వ, ప్రయివేటు తేడా లేకుండా కొనుగోలుదారులకు, రైతులకు కూడా గన్నీ బ్యాగులు ఏటా అవసరమే కాబట్టి, యూనియన్ ప్రభుత్వ వాటాను పరిగణలోకి తీసుకుంటూ ముఖ్యమంత్రి చెప్పినట్లు రాష్ట్రంలోనే ఉత్పత్తి చేయటం మేలా, దిగుమతి చేసుకుంటేనే గిట్టుబాటా అనేది ఆలోచించాలి. గన్నీ బ్యాగులు సహా ప్రతి అంశంలో రైతువేదికలను కూడా విశ్వాసంలోకి తీసుకుని సమాచారాన్ని పారదర్శకంగా పంచుకోవాలి.

# పార్టీ, పవర్‌ల నిర్వచనాన్ని మార్చిన నాయకుడు ఎన్.టి.ఆర్

## - డా॥ జయప్రకాష్ నారాయణ్

**ఎన్.టి రామారావు గారు రాజకీయ రంగంలో రెండు గొప్ప విజయాల్ని సాధించారు.**

**ఒకటి, కాంగ్రెస్ పార్టీ గుత్తాధిపత్యం ఉన్న ఒక దక్షిణాది రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయాన్ని ఆయన సృష్టించారు. క్రమంగా దేశంలో కూడా కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఒక రాజకీయ కూటమికి పునాదులు వేశారు.**

**రెండోది, దేశ ఫెడరల్ వ్యవస్థను బలోపేతం చేయటంలో కీలక పాత్ర పోషించారు.**

**కాంగ్రెస్ గుత్తాధిపత్యానికి చెక్**

1977లో ఉత్తర భారతంలో ఒక ఉద్రేక, ఉద్వేగభరిత వాతావరణంలో కొట్టుకుపోవటాన్ని మినహాయిస్తే.. కాంగ్రెస్‌కతప్ప గత్యంతరం లేదు అనే పరిస్థితే దేశంలో ఉండేది ఆరోజుల్లో. 1982-83లో పరిస్థితులు ఎలా ఉన్నాయో మనం గుర్తించాలి. ఇప్పటి పరిస్థితులు వేరు, అప్పటి పరిస్థితులు వేరు. కాంగ్రెస్ తప్ప ఇంకోటి లేదు ఆనాడు. పశ్చిమ బెంగాల్‌లో చాలాకాలం అధికారంలో ఉన్న మార్క్సిస్టులు అప్పటికే 5,6 ఏళ్లుగా అధికారంలో ఉండటం, కేరళలో తరచూ అధికారం మారటం, తమిళనాడులో 1967లో అధికారం కోల్పోవటం మినహాయిస్తే, అసలు దేశంలో కాంగ్రెస్‌కు ఎదురులేదు. వీటిల్లో కూడా కేరళ, పశ్చిమ బెంగాల్‌లలో అధికారం కోసం కాంగ్రెస్ ఆనాడు సమానంగా పోటీ పడింది. తమిళనాడులోనే స్థానం లేకుండా పోయింది. కాంగ్రెస్‌కు ఎదురులేదు, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం లేదు అనే ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ లాంటి దక్షిణాది రాష్ట్రంలో కాంగ్రెస్‌కి ప్రత్యామ్నాయం సృష్టించటమే కాకుండా, దేశంలో ఒక ప్రత్యామ్నాయ రాజకీయ కూటమికి పునాదులు వేసింది కేవలం ఎన్.టి.ఆర్ గారు. ఆయన వ్యక్తిత్వం, జనాకర్షణ, ఆయన ముందుచూపు అందుకు దోహదం చేశాయి.

1984 ఎన్నికల్లో ఇందిర హత్యానంతర పరిస్థితుల వల్ల కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా 50 శాతం దాకా ఓట్లు సంపాదించి 415 సీట్లను పొందగలిగినా, రాష్ట్రంలో ఎన్.టి.ఆర్ నాయకత్వంలో తెలుగుదేశం 35 సీట్లను సంపాదించింది. బీజేపీ దేశవ్యాప్తంగా రెండు సీట్లు గెలుచుకుంటే, అందులో ఒకటి ఎన్.టి.ఆర్ పార్టీతో పొత్తు వల్ల ఆంధ్రప్రదేశ్‌లో గెలిచినది. అలాంటి ఒక అసాధారణ సమయంలో జాతీయస్థాయిలో ప్రతిపక్ష పాత్రని ఎన్.టి.



రామారావు పోషించి కాంగ్రెస్‌కు జాతీయ రాజకీయల్లో కూడా ఒక ప్రత్యామ్నాయ కూటమిని ఏర్పాటు చేశారు. ఎన్.టి.ఆర్ లేకుంటే, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం రావటానికి మరో దశాబ్దానికిపైగా పట్టేది.

**రాష్ట్రాలంటే బంట్రోతులు కాదని చాటిచెప్పారు**

రెండోది, ఫెడరల్ వ్యవస్థని ఆనాడు చాలా చులకన చేశారు. ఎన్.టి.ఆర్‌నే ఆనాడు పదవిలోకి వచ్చిన సంవత్సరంలోనే దింపిపారేశారు. 1984లో. అందరికీ తెలుసు ఆనాడు ఏం జరిగిందో! పెద్ద ఉద్యమం చేసి తెలుగు ప్రజలు ఆనాడు ఆయన్ను కాపాడుకున్నారు. అలాగే దేశంలో ఎన్నో రాష్ట్రాల్లో ప్రభుత్వాల్ని దింపివేయటం, రాష్ట్రాల్ని బంట్రోతుల్లా చూడటం, ఏ చిన్న పని కావాలన్నా ఢిల్లీకి మోకరిల్లాల్సిన అవసరం రావటం, రాష్ట్రంలో పెట్టుబడులు కావాలంటే, మన రాష్ట్రానికి నిధులు రావాలంటే ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణాలు చేయాల్సి రావటం సర్వసాధారణంగా ఉండేది. ఆ పరిస్థితుల్లో ఫెడరల్ వ్యవస్థ బలపడటం కోసం ఎన్.టి.ఆర్ ఆనాడు ముఖ్యమంత్రులైన ప్రతిపక్ష నాయకులు, జ్యోతిబసు, బిజూ పట్నాయక్, కరుణానిధి వంటి వారందరినీ కలిపి నాయకత్వం వహించారు.

అసలు ఫెడరలిజం అంటే ఏమిటో తెలియని కాలమది. ఇప్పటికీ ఫెడరలిజం అంటే ఏమిటో దేశంలో చాలామందికి తెలియదు. అందుకే ఎంపీకి, ఎమ్మెల్యేకి, మునిసిపల్ కార్పొరేటర్, కౌన్సిలర్‌కి ఒకే తరహాలో ఓటు వేస్తుంటారు.

అలాంటి ప్రజలకి ఫెడరలిజం అంటే తెలియచేప్పేందుకు కాంక్లేవ్‌ల పేరుతో దక్షిణాది నుండి సదస్సుల్ని ఎన్.టి.ఆర్ నిర్వహించారు. ప్రజలకు అర్థమయ్యే భాషలో నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు. పర్యవసానంగానే సర్కారియా కమిషన్ ఏర్పాటైంది. చివరికి ఈ దేశంలో ఫెడరలిజం బలోపేతమవటానికి కీలక కారణమయ్యారు. తద్వారా ఒక చరిత్రాత్మక పాత్రను ఆయన పోషించారు.

**పెత్తందారీ రాజకీయాన్ని మాస్ పాలిటిక్స్‌గా మార్చిన నేత**

వీటితోపాటు, ఎన్.టి.ఆర్ వచ్చేదాకా రాజకీయం అంతా కూడా ఒక పెత్తందారు రాజకీయంగా ఉండేది. ఊరిలో మోతుబరులు, మునసబు, కుల నాయకులు వంటి వారిని కలిస్తే రాజకీయం అయిపోయేది. దాన్ని మాస్ పాలిటిక్స్‌గా మార్చి సామాన్య ప్రజల దగ్గరకు తీసుకుపోయింది ఎన్.టి.ఆర్. ఆ రకంగా ఆయన ఒక విశిష్టమైన మార్పుకి నాంది పలికారు. ఇవాళ ఎలాగైతే మంచి మార్పు కావాలని కోరుకుంటున్న పార్టీలు.. ఆప్ కావచ్చు, లోక్‌సత్తా పార్టీ కావచ్చు, మంచివాళ్లు, నిజాయతీ పాలన కావాలనుకునేవాళ్లంతా కూడా చేతులు కలుపుతున్నారో, ఆనాడున్న పరిస్థితుల్లో అట్లాగ తెలుగునాట కాస్త ముందుచూపు ఉన్నవాళ్లు, చదువుకున్నవాళ్లు, పరిస్థితులు మారాలనుకున్నవాళ్లు, ఉన్న పరిస్థితుల పట్ల విసిగిపోయినవారంతా కూడా ఆయనతో చేతులు కలిపారు. ఒక పెద్ద మార్పుకి ఆయన ఆకర్షణ ఉపయోగపడింది.



**కష్టం నుండి ఎదిగిన వ్యక్తి.. అవినీతిని అసహ్యించుకునేవారు**

అలాగే సామాన్యుల పట్ల ఆయనకు అపారమైన ప్రేమ. కాలే కడుపుకి అన్నం పెట్టకపోతే ఎట్లా బ్రదర్ అని ఎన్నోసార్లు పబ్లిగ్గా అనేవారు. అది ఊరికే ప్రచారం కోసమో, ఎన్నికల కోసమో వచ్చింది కాదు. అలా అప్రయత్నంగా వచ్చేసేది. కష్టం నుండి వచ్చిన వ్యక్తి ఆయన. సామాన్య రైతు కుటుంబం వారిది. ఉన్న కాస్త ఆస్తిని కూడా 1929లో గ్రేట్ డిప్రెషన్ కాలంలో కోల్పోయారు. రూ.2,000 అప్పుతో 7,8 ఎకరాల భూమి పోయింది. చివరికి, విజయవాడ సమీప ప్రాంతానికి వచ్చి పాలు అమ్ముకోవటం, ఆ పనయ్యాక వెళ్లి చదువుకోవటం చేశారు. ఈ రకంగా కష్టం నుండి ఎదిగిన వ్యక్తి. అవినీతి అంటే అసలు ఏ రకంగానూ గిట్టనటువంటి మనిషి. అవినీతిని అసహ్యించుకునేవారు. అదే విలువల్ని ఆయన రాజకీయంలో కూడా పెట్టారు. ఓసారి ఒక మంత్రిపై ఓ చిన్న అవినీతి ఆరోపణ పట్ల ఆయన ఆగ్రహించిన తీరుకి సదరు మంత్రి ఒళ్లంతా చెమటలతో వణికిపోయారు. బతుకుజీవుడా అన్నట్లు బయటకు పరుగుపెట్టారు.

**రూ.5 ఖర్చు కూడా లేకుండా రాజ్యసభ సీటు**

రాజకీయంలో అప్పటికే డబ్బు ప్రభావం కనిపిస్తోంది. రాజ్యసభలో సీటు కోసం దాదారు రూ.2 లక్షల దాకా చేతులు మారిన సందర్భాలున్నాయి. దాన్ని పూర్తిగా మార్చేశారు ఎన్.టి.ఆర్. ఐదు రూపాయల ఖర్చు కూడా లేకుండా నేతలను రాజ్యసభకు పంపారాయన. ఎన్.టి.ఆర్ నాయకత్వంలో రూ.25,000తో ఎమ్మెల్యేలుగా గెలిచినవారు చాలామంది ఉన్నారు. రాజకీయానికి అర్థాన్ని పూర్తిగా మార్చే ప్రయత్నం ఆయన చేశారు.

**ప్రజలకు మంచిదా, కాదా చెప్పండి.. అంతే!**

ఎన్.టి.ఆర్‌ది ఎంతో స్వచ్ఛమైన మనసు. ఆయనకు కులాలు, మతాలు, వర్గాలు అనవసరం. పరిపాలనా విషయంలో పార్టీలు కూడా ఆయనకి అనవసరం. అధికారులు రాజకీయంగా ఇబ్బంది కలుగుతుందేమో అంటే.. రాజకీయాలు మీకెందుకయ్యా, పొలిటికల్‌గా మేం చూసుకుంటాం, ప్రజలకు మంచి జరగటానికి ఏం చేయాలో చెప్పండి చాలు అనేవారు.

ఎన్నికల గొడవ, రాజకీయాల్ని మాకు వదిలేయండి బ్రదర్. ప్రజల్ని ఒప్పించే బాధ్యత మాది. ప్రజలు మమ్మల్ని ఎన్నుకున్నారు. ప్రజలకు మంచేమిటో చేద్దాం. రాజకీయాలు మాట్లాడకుండా అసలు ఏం జరగాలో చెప్పండి. మంచి ఏమిటో చెప్పండి, అంతే.. అనేవారు.

**ఎవరు చెప్పినా వినేవారు.. కానీ నిర్ణయం చేశాక గోతులు తవ్వితే సహించేవారు కాదు**

ఎన్నో సందర్భాల్లో ఎన్.టి.ఆర్ అధికారులు, నిపుణులు ఎవరు చెప్పినా వినేవారు. కానీ తుదకు నిర్ణయం తీసుకున్నాక, రాజకీయంగా నాకు వదిలేసెయ్యండి, ప్రజలు మమ్మల్ని ఎన్నుకున్నారు, బాధ్యత మాది, తప్పు చేస్తే మేం ఎదుర్కొంటాం, కానీ నిర్ణయం చేశాక గోతులు తవ్వబోకండి, సరిగా అమలు చేయండి అని అధికారులతో అనేవారు. ఎన్నో సందర్భాల్లో స్వయంగా నన్ను అడిగారు– నాది మొద్దు బుర్ర, నాకు ఏ విషయమూ తెలియదు, మీరు చెప్పండి

కరెక్టేనా ఇది అని. ఏ రకంగా చూసినా పరిపూర్ణ జీవితాన్ని సాధించిన వ్యక్తి కాబట్టి, అపారమైన ఆత్మవిశ్వాసం గల వ్యక్తి కాబట్టి ఆ మాట అనగలిగారు. ఈ రకంగానే 'మ్యాక్స్' (పరస్పర సహాయ సహకార సంఘాల) చట్టం వచ్చింది. తెలుగునాట గొప్ప విజయం సాధించిన ఆ చట్టానికి ఎన్.టి.ఆర్ ద్వారా పునాది వేయగలిగాను. ఆ తర్వాత అది దేశవ్యాప్తమయ్యాక, 97వ సవరణ ద్వారా రాజ్యాంగంలో మార్పుగా రావటానికి కూడా పునాది వేశాను. ఈ రాజ్యాంగ సవరణ వల్ల సహకార సంఘాలకస్వతంత్ర ప్రతిపత్తికి భరోసా సమకూరింది.

అవతలివాళ్ల మీద నమ్మకముంది అంటే, వాళ్లు నిజం చెబుతున్నారు, సొంతం కోసం కాకుండా, పక్షపాతం లేకుండా అని నమ్మకం కలిగితే.. ఎవరి మాటయినా ఆలకించేవారు. ఒక నాయకుడు చేయాల్సిన పని అది. వినదగునెవ్వరు చెప్పిన రీతిలో అందరు చెప్పేదీ విని బేరీజు వేసుకుని తుది నిర్ణయం తీసుకోవటం. రాజకీయం అంటే అర్థం అది.

**ప్రాంతీయ పార్టీ నేతే అయినా.. విశాల జాతీయ దృష్టితో, రాజనీతిజ్ఞతతో ఆలోచించేవారు**

అలాగే ఒక సందర్భంలో కర్ణాటకకి, మనకి నీటి వివాదం తలెత్తింది. తుంగభద్రలో నీళ్లు తక్కువ ఉంటే తన్నుకుంటుంటాం కదా! కావేరీ జలాల విషయంలో తమిళనాడు, కర్ణాటక తరహాలో.. తుంగభద్ర విషయంలో, ఉన్న నీళ్లలో సర్దుబాటు చేసుకోకుండా రాజకీయాలు చేయటం ఏపీ, కర్ణాటక మధ్య కూడా ఆనవాయితీగా ఉండేది. హీరోలుగా చెలామణి అయ్యేందుకు ముఖ్యమంత్రులు పోటీ పడుతుండేవారు. నీళ్లు వదలనని ఎగువ రాష్ట్రం ముఖ్యమంత్రి అంటే, ఎలాగైనా తెచ్చుకుంటానని దిగువ రాష్ట్రం ముఖ్యమంత్రి సవాలు విసురుతుండేవారు. అప్పుడు కూడా అలాగే జరిగింది.

దేవెగౌడ కర్ణాటక ముఖ్యమంత్రి అప్పుడు. ఆయన దిగువకు నీళ్లు వదలనని బీరాలు పలికారు. అప్పుడు తెలుగునాట ప్రభుత్వంలో ఉన్న మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ముఖ్యమంత్రి దగ్గరికి వచ్చి- దేవగౌడ్ గారు ఒక్క చుక్క నీరు కూడా ఆంధ్రప్రదేశ్‌కి ఇవ్వనంటున్నారు, మీరు ఒక్క పిలుపు ఇవ్వండి, మేమంతా వేల సంఖ్యలో కర్ణాటకకు వెళ్లి ఉద్యమాలు చేస్తాం, ధర్నాలు చేస్తాం అన్నారు. పక్కనే

## ఎంతో పొదుపరి అయినా.. సామాన్యుల అవసరం అంటే చేతికి ఎముక ఉండేది కాదు.. ఎన్.టి.ఆర్ కాలం నాటి ఉచితాలను, ఇప్పటి ఉచితాలతో పోల్చలేం

రామారావు గారు వ్యక్తిగతంగా ఎంతో పొదుపరి. పిసినారిగా కూడా అనిపించేవారు. ప్రజల సొమ్మును కూడా ఆయన అంతే జాగ్రత్తగా వినియోగించేవారు. ఒకసారి ముఖ్యమంత్రి కారు సరిగా లేదు, మార్చాలి అంటే.. ససేమీరా అన్నారు. పాత కారునే రిపేరు చేయించండి, ఎందుకు డబ్బులు దండగ అన్నారు. అలాగే ప్రభుత్వోద్యోగుల డిమాండ్లపై కూడా ఆయన వ్యతిరేకించి మంకుపట్టుతో పోరాడారు. అలాంటి వ్యక్తి కూడా సామాన్యుడికి అవసరం అంటే చేతికి ఎముక లేనట్లు వ్యవహరించేవారు. సామాన్యులు, రైతుల కోసం కిలో బియ్యం రెండు రూపాయలు, విద్యుత్ సబ్సిడీ వంటి కొన్ని రకాల ఉచితాల్ని ప్రవేశపెట్టారు. కానీ ఎన్.టి.ఆర్ కాలం నాటి ఉచితాలకు ఇప్పటి ఉచితాలకు పొంతన లేదు. ఆనాడు కిలో బియ్యం మార్కెట్‌లో రూ.3.50 దాకా ఉండేది. ఇప్పుడు కిలో బియ్యం రూ.1 కి ఇస్తున్నారు, మార్కెట్‌లో రూ.40-50ల దాకా ఉంది. ఇప్పుడు ఉచితాలు పేదరికం పోవటం కోసం కాకుండా పేదల్ని శాశ్వతంగా పేదరికంలో కొనసాగించేందుకు, ప్రజాధనాన్నే ఓటుకు నోటుగా పందేరం చేసి సొంత సొమ్మేదో దానం చేస్తున్నట్లు దానకర్ణుల్లా చాటుకునేందుకు పదవుల్లో ఉన్నవారు అత్యంత బాధ్యతారహితంగా చేస్తున్నవి. అలాగే ఎన్.టి.ఆర్ ఒక మేర కొన్ని రకాల ఉచితాలనిచ్చినా, ప్రభుత్వ బాధ్యతలైన మౌలిక వసతులు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి వంటి వాటిని నిర్లక్ష్యం చేయలేదు. ఆయన ప్రవేశపెట్టిన తెలుగు గ్రామీణ క్రాంతి పథం ద్వారానే నేను ప్రకాశం జిల్లాలో ఎకరాకు రూ.2,000ల ఖర్చుతో 2,00,000లకు పైగా ఎకరాలకు సాగునీరును ఆయా రైతుల సాధికార భాగస్వామ్యంతో అందించగలిగాను. స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే ఇదో రికార్డు. ఎకరాకు రెండు వేలతో సాగునీరిచ్చారంటే ఈవేళ నమ్మను కూడా నమ్మలేరు. ఎందుకంటే, ఇప్పుడు ఎకరాలకు రూ.4 లక్షలా, 5 లక్షలా, ఆ పైనా అన్న లెక్కలే గదా! కేవలం ఎన్.టి.ఆర్ ప్రవేశపెట్టిన పథకం ద్వారా ప్రకాశం జిల్లాలో ఆ విజయం సాధ్యమైంది. కానీ ఈవేళ్టి ప్రభుత్వాలు ప్రభుత్వోద్యోగులకు జీతాలు, ఉచితాలు, పప్పుకూడు కోసం చేసిన అప్పులకు వడ్డీలు కట్టటం తప్ప చేస్తున్నదేమీ లేదు. విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, చట్టబద్ధపాలన వంటివన్నీ నిర్లక్ష్యం చేస్తున్నాయి. అందుకే అనుత్పాదక ఉచితాలు ఒక పరిధి దాటకుండా కట్టడి చేసేందుకు ఎఫ్.ఆర్.బి.యం చట్టాన్ని విస్తరించటం తక్షణావసరం.

# అధికార యంత్రాంగంలో నిజాయతీని ప్రేమించేవారు.. వెన్నలాంటి మనసు

అధికార యంత్రాంగంలో నిజాయతీని ఎన్.టి.ఆర్ ప్రేమించేవారు. సమర్థులు, నిజాయతీపరులు అంటే ప్రాణం పెట్టేవారు. కొన్ని సందర్భాల్లో బైటికి కరకుగా కనిపించేవారుకానీ, వెన్నలాంటి మనసు ఆయనది. ఒకసారి ఎవరో అధికారి మంచి మనిషి, నిజాయతీపరుడు ముఖ్యమంత్రి గారి దగ్గరికి పైరవీ కోసం వచ్చారు. సొంత పని కోసం కాదు.. ప్రజల పని కోసమే. అయితే సాధ్యాసాధ్యాలను ఆలోచించకుండా కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులతో కలసి వచ్చారు. వారికి నచ్చచెప్పి పంపించాక, ఎన్.టి.ఆర్ నాతో అన్నారు.. జయప్రకాష్ గారూ! మన బ్రదర్స్ వచ్చి అభివృద్ధి కోసం కావాలీ అంటే ముఖ్యమంత్రిగా కాదనకూడదు. కానీ మనకేమో ఆర్థికంగా పరిస్థితేమీ బాగో లేదు. సాధ్యాసాధ్యాలు చూసుకోకుండా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాల గురించి ఆలోచించాలి గానీ, ఎక్కువ ఖర్చుతో ఫలితాలు కావాలంటే ఎలా? వాళ్లు కోరారు సరే, ఏదో చెబుతాము. వారికి సలహాదారుగా ఉన్న అధికారి కూడా వారికి నచ్చచెప్పకుండా వచ్చి ఇలా మాట్లాడితే ఎలా, తప్పు కదా అన్నారాయన. మీరు చెప్పింది నిజమే, మనం ఒకసారి ఆ అధికారిని పిలిచి చెబుదాం అన్నాను. పిలిపించండి అన్నారు. సాయంత్రం ఆయన్ని పిలిపిస్తే వచ్చారు. ఆయన్ను గదిలోకి పిలిచే ముందు నాతో చెప్పారు- జయప్రకాష్ గారూ! ఆయన చాలా మంచి మనిషి, నిజాయతీపరుడు. మీరు మరీ గట్టిగా చెప్పబోకండి, మెత్తగా చెప్పండి అన్నారు. నేను కొంచెం కఠినంగా చెబుతానని ఆయనకి తెలుసు. కాబట్టి నచ్చచెప్పండి అని ముందుగానే నాకు చెప్పారు. అంత సున్నితమైన మనిషి ఎన్.టి.ఆర్. కొన్ని సందర్భాల్లో పొద్దున ఆయన మనసులో ఎవరైనా గనక అభిప్రాయాల్ని ప్రవేశపెడితే, ముందు వెనక ఆలోచించకుండా నిర్ణయాలు చేయటం వల్ల ఇబ్బందులు ఎదురవుతుండేవిగానీ.. ప్రతిరోజూ స్వచ్ఛమైన పలకలాంటిది ఆయన మనసు. ఏ రకంగానూ వంక పెట్టటానికి వీల్లేనిది. ఉదాత్తమైన మనిషి. గొప్ప వ్యక్తిత్వం, గాంభీర్యం, క్రమశిక్షణ, ప్రజల పట్ల నిరతి ఉన్న నాయకుడాయన.

ఉన్న నేను భయపడ్డాను. పొరపాటున ఎన్.టి.ఆర్ ఓకే అంటారేమో, వీరంతా పోతే రెండు రాష్ట్రాల మధ్య పోరు అవుతుందేమో, ఇది సరైన పద్ధతి కాదు అని. ఎవరి సలహా అవసరం లేకుండానే ఎన్.టి.ఆర్ అన్నారు- ఏం మాట్లాడుతున్నారు, అంతా ఒక దేశం కాదా? కర్ణాటకలో ఉన్నది మన మనుషులు కాదా? అక్కడ తెలుగువాళ్లు, కన్నడవాళ్లు అందరూ ఉన్నారు. అందరూ మనవాళ్లే. పిచ్చిపిచ్చిగా మాట్లాడొద్దు. దేవెగౌడ అలా మాట్లాడొచ్చు. నేను కూడా అలా మాట్లాడితే ఎలాగ. బాధ్యతతో ఉండాలి. ఈ దేశమంతా ఒకటే అని వెంటనే కేబినెట్‌లో మంత్రులకు ఫోన్ చేశారు. మీరు వెంటనే వెళ్లి దేవెగౌడకు నా మాటగా చెప్పండి, కష్టం ఉంటే ఇద్దరం కలిసి పంచుకోవడం తప్ప తమాషాలు చేయొద్దని, ప్రజల మధ్య అలా గొడవలు సృష్టించవద్దని.. అన్నారు. అంటే రాజకీయం కోసం కూడా ప్రజల్లో కలహాలు సృష్టించే స్వభావం కాదు ఎన్.టి.ఆర్‌ది. చాలా ఉదార స్వభావం, ఉన్నత విలువలున్న మనిషి, మంచిని ప్రేమించే మనిషి. ప్రాంతీయ పార్టీ నేతే అయినా, విశాల జాతీయ భావాలతో, రాజనీతిజ్ఞతతో ఆలోచించేవారు, వ్యవహరించేవారు.

**1984 నుండే ఆర్థిక సరళీకరణను అమలు చేసిన నాయకుడు**

ఎన్.టి.ఆర్ వచ్చేటప్పటికి ఆర్థిక సరళీకరణ ఇంకా లోతుగా వేళ్లూనుకోలా. భారతదేశ రాజకీయాల్ని విశిష్టంగా ప్రభావితం చేసిన మరో తెలుగు నేత పి.వి నరసింహారావు గారి ఆధ్వర్యంలో 1991 నుండి మన దేశంలో ఆర్థిక సంస్కరణలు వేగవంతమయ్యాయి. కానీ 1984 సమయంలోనే, లైసెన్స్-పర్మిట్-కోటా రాజ్యం బలంగా ఉన్న సమయంలోనే ఎన్.టి.ఆర్ అమెరికా వెళ్లి పెట్టుబడుల కోసం ప్రయత్నం చేశారు. నిజాయతీ, నిబద్ధత, సామర్థ్యం గల అనేకమంది ఎన్నారైలు తెలుగునేలకు తిరిగొచ్చి అభివృద్ధి చేసేలా ఒప్పించగలిగారు. ఆ సమయంలోనే ఆయన పార్టీలో ఆగస్టు సంక్షోభం వచ్చింది. తిరిగి ఎన్నికల్లో నెగ్గాక కూడా ఆ కృషిని ఆయన కొనసాగించారు. అన్నీ ప్రభుత్వం చేయాలన్న వైఖరికి ఆయన విరుద్ధం. ప్రయివేటు రంగం సమర్థంగా చేయగలిగే పనులను ఆ రంగానికే వదిలేసేవారు. ఆర్థిక సరళీకరణకు ఎంతో ముందుగానే బాటలు వేసిన నేత ఎన్.టి.ఆర్.

**అధికార వికేంద్రీకరణ పట్ల అభద్రత చెందేవారు కాదు**

ఎన్.టి.ఆర్‌కు ప్రజల్లో ఎంతో బలం ఉండేది. ఆయన మంత్రుల్ని నమ్మేవాళ్లు. సమర్థులను మంత్రులుగా పెట్టి వాళ్లకు అధికారాలు ఇచ్చేవాళ్లు. ఈవేళ్టిలా అధికారాన్ని పూర్తిగా ముఖ్యమంత్రి చేతుల్లో కేంద్రీకరించుకోవాలనుకోలేదు. కొంతవరకైనా జిల్లాలకు, స్థానిక ప్రభుత్వాలకు అధికారాలనిస్తే ఇబ్బందిగా ఆయన భావించేవారు కాదు. వాళ్లు పెరిగితే నేను

తక్కువ అనుకోలేదు. ప్రత్యక్ష ఎన్నికలను నిర్వహించారు. అధికార వికేంద్రీకరణ పట్ల ఎన్.టి.ఆర్‌లో ఏనాడూ అభద్రత లేదు.

**మహిళల ప్రాధాన్యతను గుర్తించిన నేత**

మహిళలు సమాజంలో సగం అని వారి ప్రాధాన్యతను గుర్తించి వ్యవహరించిన నేత ఎన్.టి.ఆర్. తెలుగింటి ఆడపడచులు అని వారినుద్దేశించి ప్రత్యేకంగా మాట్లాడటమే కాకుండా.. వారి సాధికారతకి ఆస్తిలో సమాన హక్కు, స్థానిక ప్రభుత్వాల్లో రిజర్వేషన్లు వంటి ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ బస్సులో విద్యార్థులకు ఉచిత, రాయితీ బస్ పాస్‌లను అందుబాటులోకి తెచ్చారు. మండలాల దగ్గర్నుంచి ఇలా ఎన్.టి.ఆర్ తీసుకొచ్చిన అనేక మార్పుల్ని ఈనాటికీ ఎవరూ తొలగించలేకపోయారు. అంతగా అవి ఫలితాలతో ప్రజామోదాన్ని, విజ్ఞుల సమ్మతాన్ని పొందాయి.

ఎన్.టి.ఆర్ అప్పట్లో పాఠశాలల్లో ప్రవేశపెట్టిన దృశ్య శ్రవణ మాధ్యమ బోధన ఇప్పటికీ అందుకోవాల్సిన లక్ష్యంగానే ఉంది. అలాగే తెలుగుకు రామారావు గారు ఇచ్చిన ప్రాధాన్యతను ఆ తర్వాతి ప్రభుత్వాలు కొనసాగించకపోవటం వల్ల ప్రాథమిక స్థాయిలో మాతృభాష (తెలిసిన భాష)లో బోధన కొరవడటం దగ్గర్నుండి అనేక సమస్యలు తలెత్తాయి.

**ఎన్.టి.ఆర్‌లు నేటి యువతలో కూడా కోకొల్లలుగా ఉన్నారు.. వారిని ప్రోత్సహించే వ్యవస్థ లేదు**

వ్యక్తుల ప్రభావానికి కొన్ని పరిమితులుంటాయి. వెయ్యేళ్లకోసారి వచ్చే మహాత్మాగాంధీ లాంటి వ్యక్తి ప్రభావం కూడా స్వతంత్ర భారతంలో రెండు దశాబ్దాల అనంతరం వైఫల్యాల్ని అడ్డుకోలేకపోయింది. ఆ తర్వాత కొన్ని తరాలకు వచ్చిన ఎన్.టి.ఆర్ కూడా ఈవేళ అదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

ఎన్.టి.ఆర్ తన అపార సంకల్ప బలంతో, వ్యక్తిత్వంతో, వ్యక్తిగత ఆకర్షణతో తెలుగునాట, భారత రాజకీయాల్లో ఒక నూతన ఒరవడిని తెచ్చేందుకు కృషి చేశారు. అధికారాన్ని గమ్యంగా కాకుండా మార్గంగా భావించారు. కానీ వ్యవస్థీకృత ఏర్పాట్లు కొరవడటంతో, ఆయన తర్వాత కాలంలో క్రమంగా ధనరాజకీయాలు విశృంఖలమయ్యాయి. ఆయన స్థాపించిన పార్టీ సహా అన్ని పార్టీల్లో జాడ్యాలు పెరిగిపోయాయి.

రాజకీయం ఒక నైతిక కార్యక్రమం అని ఎన్.టి.ఆర్ లాంటి వాళ్లు విశ్వసించేవాళ్లు. కాబట్టి ఓట్లు కొనటం కాకుండా, ప్రజలకు తెలియచెప్పి ఒప్పించి వారి విశ్వాసం పొందాలని భావించేవారు. కానీ ఇప్పుడు రాజకీయం అంతా డబ్బు, ఎన్నికలుగా మారిపోయింది. ఎన్.టి.ఆర్ కాలంలో నిజాయతీ, సమర్థత లేకపోతే పదవికి పనికిరాడు అనుకునేవాళ్లం, ఇప్పుడు డబ్బు లేకపోతే పదవికి పనికిరాడు అనే రాజకీయం తయారైంది. ఎవరైనా యువత రాజకీయాల్లోకి రావాలనుకుంటే.. నీ కులమేంటి, నీ తండ్రి ఎవరు అనడుగుతున్నారు. లేదంటే, నా కాళ్లు పడతావా, నా మాట వింటావా, డబ్బుందా అని సతాయిస్తున్నారు.

ఏ పార్టీ అయినా కూడా దీర్ఘకాలంగా గనక స్పష్టత లేకపోయినట్లయితే, అవగాహన లేకపోయినట్లయితే, ఎందుకోసం చేస్తున్నామన్నది ఆలోచించకపోయినట్లయితే.. పార్టీ నిర్మాణం బలంగా ఉండొచ్చుగానీ, పార్టీ వెనకాల సిద్ధాంతపరమైన బలం తగ్గుతుంది. పార్టీ కోసం, కొన్ని లక్ష్యాల కోసమైతే మనసు పెట్టి పనిచేస్తారు గానీ, కాలక్రమేణా కేవలం అధికారమే లక్ష్యంగా మారినప్పుడు చాలామంది పార్టీ కార్యకర్తలు డబ్బు కోసం, పరపతి కోసమే చేస్తారు తప్ప లక్ష్యాల కోసం పనిచేయరు. అన్ని పార్టీల్లో ఆ ధోరణి కొనసాగుతున్నది. కాంగ్రెస్ పార్టీ ఒకప్పుడు జాతీయ స్థాయిలో గాంధీ గారి పార్టీయే. స్వతంత్రం తెచ్చిన పార్టీ. గొప్ప విలువలకి అంకితమైన పార్టీ. కానీ ఈవేళ ఏమైంది? తగిన జాగ్రత్తలు తీసుకోకపోయినట్లయితే, అధికారాన్ని వికేంద్రీకరించకపోయినట్లయితే, స్పష్టమైన లక్ష్యాన్ని నిర్వచించకపోయినట్లయితే జాతి కోసం, సమాజం కోసం, కాలక్రమేణా అన్ని పార్టీలూ చతికిలపడతాయి.

ఇప్పటికీ మన యువతలో ఎన్.టి.ఆర్‌లు కోకొల్లలుగా ఉన్నారు. కానీ వారిని ప్రోత్సహించే వ్యవస్థ లేదు. అందుకే ఎన్.టి.ఆర్‌లాంటి వ్యక్తుల నుండి విలువల్ని, నాయకత్వ సామర్థ్యాన్ని నేర్చుకుంటూనే వాటి ఫలితాల్ని కొనసాగించేందుకు తగిన వ్యవస్థల్ని నిర్మించుకునేందుకు కూడా మనం కృషి చేయాలి. ఎల్లకాలం గాంధీయో, ఎన్.టి.ఆరో, మరొకరో వస్తారని ఎదురుచూడకుండా, ఎవరి జీవితంలో వారే హీరోలని గుర్తించి ఉమ్మడి అవసరాలు, అభివృద్ధి కోసం మన వంతు బాధ్యతని తీసుకుని వ్యవస్థల్ని నిర్మించుకుందాం. అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, మూడో అంచె ఫెడరలిజంతో స్థానిక ప్రభుత్వాల సాధికారత, అవినీతిరహిత పౌర సేవలు మొదలైన సంస్కరణలతో నివారించదగ్గ బాధల్ని తొలగించుకుందాం, అందరికీ ఎదిగే అవకాశాల్ని సాధిద్దాం.

**(ఎన్.టి.ఆర్‌కి వందేళ్లు)**

# EBRTSను మల్లంపేట నుండి ప్రారంభించండి

**గౌరవ మంత్రివర్యులు శ్రీ కేటీఆర్ గారు,**
**మునిసిపల్, పట్టణాభివృద్ధి, ఐ.టి పరిశ్రమల శాఖ,**
**తెలంగాణ రాష్ట్రం**
డియర్ సర్,

**విషయం: ప్రతిపాదిత మెట్రో నియో (EBRTS) ప్రాజెక్టును (KPHB)కి బదులుగా మల్లంపేట నుండి ప్రారంభించి వయా బాచుపల్లి, నిజాంపేట్ మీదుగా KPHB మెట్రోకి అనుసంధానించాలని అభ్యర్థన.**

కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గాలలో తాగునీరు, రోడ్లు, మెరుగైన మురుగు వ్యవస్థ, కూడళ్లలో పైలాన్‌లు, ప్రకృతి వనాలు, పార్కుల అభివృద్ధి కోసం మీ ఆధ్వర్యంలో చేస్తున్న కృషికి అభినందనలు. అయితే ఇన్ని అభివృద్ధి పనులు చేస్తున్నా కొన్ని మౌలికాంశాలను నిర్లక్ష్యం చేయటం వల్ల ఆశించిన ఫలితాలు రావటం లేదు. ముఖ్యంగా జటిలమైన ట్రాఫిక్ సమస్య వల్ల.. చేసిన కృషి మరుగున పడుతోంది.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గల మల్లంపేట, ప్రగతి నగర్, బాచుపల్లి, నిజాంపేట్ పరిసర ప్రాంతాలలో సుమారు 150కి పైగా కాలనీలలో నివసించే చాలామంది ఉద్యోగులు, వృత్తులు చేసుకునేవారు, వ్యాపారస్తులు KPHB, JNTU, మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాలకు ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తారు. అంతేకాక ఈ ప్రాంతం గోకరాజు రంగరాజు, వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి లాంటి ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలు, పాఠశాలలతో ఎడ్యుకేషన్ హబ్‌గా విరాజిల్లుతోంది. ఇంకా అనేకమైన మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్, గేటెడ్ కమ్యూనిటీలు, హైరైజ్ మల్టీస్టోర్ కాంప్లెక్స్‌లు ఉండటం వల్ల వాహనాల ట్రాఫిక్ రద్దీతో ప్రజలు విలవిలలాడుతున్నారు.

ఈ సమస్య పరిష్కారానికి ఎంతోకాలంగా వేచి చూస్తున్న నిజాంపేట్ రేడియల్ రోడ్డు అందుబాటులోకి రాకపోవటం వల్ల ప్రజలు (TAX PAYERS) ట్రాఫిక్ సమస్యలతో అల్లాడిపోతున్నారు.

ఇటీవల మార్చి 12, 2022న శాసనసభలో మీరు రూ.2,500 కోట్లతో ప్రజారవాణా కోసం KPHB మెట్రో స్టేషన్ నుండి కోకాపేట నియో పోలీస్ వరకు (22 కి.మీ.) పీపీపీ పద్ధతిలో మెట్రో నియో (EBRTS) ప్రాజెక్టును ప్రతిపాదించిన విషయం మా అందరికీ సంతోషం కలిగించింది.

అయితే, జటిలమైన ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఈ మెట్రో నియో (EBRTS) ప్రాజెక్టు ప్రారంభం KPHBకి బదులుగా మల్లంపేట నుండి ప్రారంభించి బాచుపల్లి, నిజాంపేట్, KPHB మెట్రో స్టేషన్‌కి అనుసంధానించవలసిందిగా కోరుతున్నాము. అప్పుడే ప్రభుత్వం, వ్యక్తిగత శ్రద్ధతో మీరు, ముఖ్యమంత్రి కేసీఆర్, ఈ ప్రాంతాల ప్రజలు కలలుగనే ప్రజారవాణా వ్యవస్థ ఏర్పడి మీ ప్రయత్నానికి తగిన ఫలితం చేకూరుతుంది. వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారమై ప్రాజెక్టుకు మరింత విలువ సమకూరుతుంది, ప్రజలకు గరిష్టంగా మేలు జరుగుతుంది.

**ఈ ప్రాజెక్టు వల్ల పరిష్కారమయ్యే సమస్యలు, సమకూరే లాభాలు:**

1. ఎంతోకాలంగా వేధిస్తున్న మల్లంపేట, బాచుపల్లి, నిజాంపేట్, ప్రగతి నగర్ పరిసర ప్రాంతాలలోని అనేక కాలనీల ప్రజల రోజువారీ జీవితం గణనీయంగా మెరుగుపడుతుంది, వారి పన్నుల డబ్బుకు సార్థకత చేకూరుతుంది 2. ఇంధనం వాడకం తగ్గి వాహన కాలుష్యం తగ్గుతుంది 3. మెట్రోకూ ఆదాయం పెరుగుతుంది 4. ప్రయాణీకులకు ట్రాఫిక్ ఇబ్బందుల నుండి ఉపశమనమే కాకుండా ఎంతో సమయం ఆదా అవుతుంది 5. ఆస్పత్రులు ఎక్కువగా ఉన్న ఆ ప్రాంతంలో అంబులెన్స్‌లకు తరచూ ఎదురవుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవు 6. ఎడ్యుకేషన్ హబ్‌గా ఉన్న ఈ ప్రాంతంలో మంచి రవాణా సౌకర్యం ఉండటం వల్ల పిల్లలు అలసటకు లోనుకోకుండా తాజాదనంతో బాగా చదువుకోగలుగుతారు.

అనేక బహుళ ప్రయోజనాలు కలిగి ఉన్న ఈ ప్రాజెక్ట్‌ను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, తద్వారా మీపై, మీ పార్టీపై, మన ప్రభుత్వంపై ప్రజల ఆదరాభిమానాలు ఎల్లవేళలా ఉంటాయని ప్రజల తరుపున ఆశిస్తున్నాము.

ధన్యవాదములు
TAX PAYERS ASSOCIATION

**సత్య వెలిగట్ల (ప్రెసిడెంట్), ఎం. కోటేశ్వరరావు (వైస్ ప్రెసిడెంట్), ఎ. కుమార్ రెడ్డి (జనరల్ సెక్రటరీ), సురేష్ గోగినేని (జాయింట్ సెక్రటరీ)**

**కాపీ టూ: సంబంధిత నియోజకవర్గాల చట్టసభ సభ్యులు, మునిసిపల్, హెచ్ఎండీఏ అధికారులు**

# కలం-గళం నిర్భయంగా సంచరించాలి

"జర్నలిజం అండర్ డిజిటల్ సీజ్' థీమ్‌తో యునెస్కో ఆధ్వర్యంలో ఈ సంవత్సరం ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం జరుగుతున్న తరుణంలో కొన్ని విషయాలు నెమరువేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆఫ్రికా ఖండంలో పత్రికా ఆంక్షలకు వ్యతిరేకంగా నమీబియాలోని 'విండ్‌హోక్' నగరంలో 1991 ఏప్రిల్ 29 నుండి మే 3 వ తేదీ వరకు జరిగిన సమావేశంలో పత్రికా స్వేచ్ఛపై పలు తీర్మానాలు చేశారు. ప్రజా స్వామ్యం పరిఢవిల్లుటకు, భావ ప్రకటన కోసం క్రమ పద్ధతిలో అభివృద్ధి సాధించుటకు, జర్నలిస్టులు హక్కుల భద్రత తదితర అంశాలపై తీర్మానాలు చేశారు. ఆఫ్రికా ఖండ జర్నలిస్టులపై విధించిన ఆంక్షలకు నిరసనగా 'ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం'ను 1993 నుంచి మే 3వ తేదీన ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు జరుగుతోంది. పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నాణ్యత, అవగాహన సదస్సులు, జర్నలి స్టులపై జరుగుతున్న దాడులు, భద్రతా చర్యలు, మరణించిన జర్నలిస్టులకు నివాళులు, వివిధ దేశాలలో మీడియా పరిస్థితి తదితర అంశాలపై సభలు, సమావేశాలు నిర్వహించి పలు విషయాలు ఆరోజు ప్రజల ముందుంచు తారు. 1986 డిసెంబర్ 17న డ్రగ్ మాఫియా చేతిలో హత్య చేయబడిన ఎడిటర్ 'గుల్లెర్మోకేనో' పేరు మీద ఇచ్చే 'ప్రపంచ పత్రికా స్వేచ్ఛ' అవార్డును ఉత్తమ జర్నలిస్టులకు బహూకరిస్తారు. అవార్డుతో పాటు 25,000 అమెరికా డాలర్లు కూడా ఇస్తారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో, అవినీతి వెలుగులోకి తేవడంలో అనేక మాఫియాలు, సంఘ వ్యతిరేక శక్తులను పట్టుకోవడంలోను జర్నలిస్టుల పాత్ర అమోఘం. దేశాల రాష్ట్రాల అభివృద్ధిలో మీడియా కీలక పాత్ర పోషిస్తోంది. ఐక్యరాజ్యసమితి నిబంధన19(1 ఏ) ప్రకారం, భారత రాజ్యాంగం 19(1) ప్రకారం అందరికీ భావ ప్రకటన, స్వేచ్ఛ అభిప్రాయం కలిగి ఉండటం ఈ నిబంధనల ప్రకారం ఉన్నాయి. దీనిలో భాగంగానే పత్రికా స్వేచ్ఛ ఉంది. భారత రాజ్యాంగ సభ అనేక చర్చలు జరిపి, కొన్ని పరిమితులతో భావ ప్రకటన, వాక్ స్వాతంత్ర్యం కల్పించారు. అయితే నేడు అనేక దేశాల్లో, మన దేశంలోను ఈ స్వేచ్ఛకు తరచూ భంగం కలుగుతోంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 'నేను తప్పు చేసినా వదిలేయకండి' అని చెప్పిన పండిట్‌జవహర్‌లాల్ నెహ్రూ మాటతో అనేకమంది జర్నలిస్టులు ఉత్తేజం పొంది తమ విధులను సక్రమంగా నిర్వహించి ఆదర్శంగా నిలిచారు. అనేక విశ్లేషణలు, చర్చలు, గోష్ఠులు జరిపేవారు. అనేకమందికి జ్ఞానతృష్ణను కలిగించేవారు, నిష్పక్షపాతంగా, నిర్భీతిగా పత్రికారంగం మన దేశంలో అభివృద్ధి చెందింది.

అయితే నేడు పత్రికా రంగం కుల, మత, రాజకీయ ప్రభావాలకు లోనై, పెట్టుబడిదారుల కనుసన్నల్లో నడుస్తోంది, నాలుగో సింహంలా ప్రజా స్వామ్యాన్ని కాపాడాల్సిన మీడియా ఈ రోజు కొంతమంది చెప్పు చేతల్లో కొన్ని మీడియా సంస్థలు మసలడం బాధాకరం. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం అయిన భారత్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే పత్రికా రంగం ఒక 'చోదక శక్తిగా' పనిచేయాలి. స్వాతంత్ర్యం రాక పూర్వం, వచ్చి న తరువాత నేడు మీడియా ప్రముఖ పాత్ర పోషిస్తుందనడంలో సందేహం లేదు. అయితే 'రేటింగ్' పెంచుకునే క్రమంలో పెడధోరణులు పడుతున్నాయి. భావితరా లకు అవసరమైన విద్య, ఆరోగ్య, ఉపాధి, శాస్త్ర, సాంకేతిక అంశాలు, వాతావరణం, ప్రకృతి వనరులు వాటిపై చర్చలు జరపాలి. సినీనటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ర మరణం, సినీ నటులు మాదక ద్రవ్యాల కేసులపై నెలల కొద్దీ చర్చలు..చివరికి ఛేదించి కొన్ని నిజాలు బయటపెడుతున్నా, ఆర్థిక, కుల, మత, రాజకీయ ప్రభావాల వల్ల పత్రికా స్వేచ్ఛ మసకబారుతోంది. భారతదేశం లాంటి ఒక లౌకిక దేశంలో మీడియా సమతౌల్యత పాటించాలి. సత్యశోధనలో 'గౌరీలంకేష్' బలైంది. 'హత్రాస్'లో జరిగిన యువతి అత్యాచారం అనంతరం జరిగిన సంఘటనలు నిగ్గు తేల్చాలని బయలుదేరి వెళ్లిన కేరళ జర్నలిస్టు'సిద్దిక్ కప్పాన్'ను అక్రమంగా అరెస్ట్ చేయడం, గతంలో 'ఎలక్ట్రానిక్ కర్ఫ్యూ' కాశ్మీర్‌లో విధించుట ద్వారా ప్రపంచ పత్రికా స్వేచ్ఛ'లో భారతదేశం 46.56 స్కోర్‌తో 142వ స్థానంలో ఉండటం బాధాకరం. ప్రపంచంలో పత్రికా స్వేచ్ఛలో 6.72 పాయింట్లతో నార్వే మొదటి స్థానంలో ఉంది. యూరోపియన్ దేశాలు మెరుగైన స్థానాల్లో ఉన్నాయి. చైనా, సౌదీ అరేబియా, ఇరాన్, ఈజిప్టు పత్రికా స్వేచ్ఛలో చాలా వెనుకబడి ఉన్నాయి. హంగేరి ప్రధానమంత్రి విక్టర్ ఆర్బాన్ కూడా జర్నలిస్టులను ఇబ్బంది పెట్టే చట్టాలు చేశాడు.

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవి నుంచి దిగిపోయే ముందు చేసిన అనేక అరాచకాలు బట్టబయలు చేసిన మీడియా, భారత్‌లో గతేడాది లాక్‌డౌన్ సందర్భంగా వలస కార్మికుల వెతలు బహిర్గతం చేసిన మీడియా, నేడు మయన్మార్‌లో జరుగుతున్న ప్రజాస్వామ్యంపై దాడులను ప్రపంచానికి చూపెడుతున్న మీడియా, మన దేశ సరిహద్దుల్లో అక్రమ చొరబాట్లు చూపెడుతున్న మీడియా ముఖ్యంగా కరోనా కాలంలో ప్రాణాలు కూడా లెక్క చేయకుండా వాస్తవాలు ప్రపంచానికి తెలియపరుస్తున్న పత్రికాలోకం చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమైనవి. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్, బ్రెజిల్ అధ్యక్షుడు బోల్సినోరో పత్రికా ప్రపంచంపై విషం చిమ్మినవారే. కరోనా వివరాలు సరిగా చెప్పలేకపోవటం వల్ల చైనా, అంతర్జాతీయ మీడియాపై ఆంక్షలు విధించిన స్పెయిన్, ఆస్ట్రియా, ఇటలీ, గ్రీస్, మయన్మార్ పత్రికా స్వేచ్ఛకు అడ్డుతగులుతూ ఉన్నాయి. ఇరాక్, లెబనాన్, చిలీ, బొలివియా, ఫ్రాన్స్ దేశాల్లో 'ఎడ్లిమన్ ట్రస్ట్ బారో మీటార్' సర్వే ప్రకారం 57 శాతం మంది ప్రజలు ఇచ్చిన నివేదిక ప్రకారం జర్నలిస్టులు యదార్థత, నాణ్యత లేని వార్తలు రాస్తున్నారు అని, అందుచేత జర్నలిస్టులపై భౌతిక దాడులు జరుగుతున్నాయని తెలిపారు.

కొన్ని పత్రికా సంస్థలు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నాయి. ముఖ్యంగా రేటింగ్స్‌తో నిమిత్తం లేకుండా, కొన్ని సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న పత్రికలు ఈ ప్రభావానికి గురవుతున్నాయి. కొత్త, కొత్త పత్రికలు, ఛానల్స్ ఆవిర్భవించడం, వాటికి అన్ని రకాల ఆర్థిక, రాజకీయ అండదండలు ఉండటం, కొత్త, కొత్త మాధ్యమాలు సెల్‌ఫోన్ ద్వారా అందుబాటులోకి రావడం కూడా కారణాలే. వీటి రాకతో ఒక్క అమెరికాలోనే సగం మంది జర్నలిస్టులు ఉపాధి కోల్పోయారు. వార్తాపత్రికలు సర్క్యులేషన్ తగ్గిపోవడం, ప్రింట్ మీడియా కంటే ఎలక్ట్రానిక్ మీడియా జోరు అందుకోవడం, అంతేకాకుండా ఆన్‌లైన్ ద్వారా పత్రికలు అందుబాటులోకి వచ్చాయి. ఆర్.యస్.ఎఫ్ సెక్రటరీ జనరల్ 'క్రిస్టోఫర్ డెలోయర్' చెప్పిన ప్రకారం 'రాబోయే దశాబ్దం జర్నలిస్టులకు పెద్ద సవాల్..దీనికి ప్రధాన కారణం కరోనా ఆంక్షలతో కూడిన పరిస్థితులు ప్రపంచ వ్యాప్తంగా నెలకొని ఉన్నాయి,. ఏ విషయం గురించైనా విశ్వసనీయ, యదార్థ, నాణ్యమైన సమాచారం అందటం లేదు. ఉదాహరణకు కరోనా కాలంలో వివిధ దేశాల్లో మృతి చెందిన వారు, టీకాల పరిస్థితి, నిరుద్యోగం, విద్య, ఆరోగ్య పరిస్థితులు, జీడీపీ వివరాలు, మానవ హక్కుల వివరాలు మొదలైనవి.

ఏ సమాజమైనా, దేశమైనా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే ముఖ్యంగా వ్యక్తి భావ ప్రకటన, ప్రాథమిక హక్కుల పైనా ఆధారపడి ఉంటుంది. ఎక్కడైతే కలంగళం నిర్భయంగా, నిజాయితీగా, స్వేచ్ఛగా సంచరిస్తుందో అక్కడ ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. మానవుని మనుగడ, అభివృద్ధి చెందుతుంది. ఆ దిశగా ఐక్యరాజ్యసమితి, ప్రపంచ దేశాలు అన్ని రకాల మాధ్యమాలకు ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలకు, సిబ్బందికి స్వేచ్ఛ సమానత్వం కలగజేయాలని ఆశిస్తూ..ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవ శుభాకాంక్షలు..

– ప్రసాదరావు

(కర్టెసి: ప్రజాపక్షం)

గత సంచిక తరువాయి

# అందరికీ ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా

**సమర్థవంతం / అందుబాటు / అతి తక్కువ వ్యయం**

## జులై 2021

(తెలుగులో స్థూల అనువాదం)

(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)



**4.2.2.9.1. ప్రభుత్వం ద్వారా ఔషధాల కేంద్రీకృత సేకరణ**

భారత్‌లో తమిళనాడు తొలుత ప్రారంభించిన కేంద్రీకృత ఔషధాల సేకరణ వల్ల అనేక లాభాలున్నాయి. కేంద్రీకృత సేకరణ పద్ధతిలో.. అంతకుముందు వినియోగం, అవసరం ప్రాతిపదికన ప్రభుత్వం కొన్ని తప్పనిసరి ఔషధాల జాబితాను రూపొందిస్తుంది. కేంద్రీకృత సేకరణ వల్ల ఔషధాలను హేతుబద్ధంగా ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. దీనివల్ల, ఎటువంటి అదనపు విలువ లేకుండా సాపేక్షంగా ఎక్కువ ఖరీదయ్యే మందులపై డబ్బు వృథా కాకుండా ఉంటుంది. బ్రాండెడ్ మందుల్లో అదనంగా వేసే ధరల భారం కొనుగోళ్లపై లేకుండా ఉండేందుకు గాను.. నాణ్యతను సరైన పద్ధతిలో ధృవీకరించిన జనరిక్ మందులను మాత్రమే ప్రభుత్వం సాధ్యమైనంత వరకు కొనుగోలు చేయాలి. అటువంటి వ్యవస్థ రాష్ట్రంలో పంపిణీ చేసే మందుల్లో నాణ్యతా నియంత్రణ తగినంతగా ఉండేందుకు దోహదం చేస్తుంది. పెద్ద పరిమాణంలో సేకరణ అంటే, సేకరణ వ్యయాన్ని తగ్గించేలా ప్రభుత్వానికి గట్టిగా బేరమాడే శక్తి ఉన్నట్లు. ఈ ఏర్పాట్ల వల్ల ఔషధాల మొత్తం వ్యయం గణనీయంగా తగ్గుతుంది. వ్యయానికి గరిష్ట విలువ సమకూరటంతోపాటు ఔషధాల నాణ్యత, వాటి హేతుబద్ధ వినియోగం మెరుగవుతాయి.

తమిళనాడు ఈ ప్రయోజనాలను పెద్దఎత్తున పొందగలిగింది. ఆ అనుభవం ఇతర రాష్ట్రాలను కూడా అనుసరించేలా ప్రోత్సాహించింది (బాక్స్ 4.4). ఉదాహరణకి, ఔషధాల సేకరణకి కేంద్రీకృత పద్ధతిని ఎంచుకున్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి.

పట్టికలు 4.8, 4.9 లలో చూపినట్లు, తమిళనాడు ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలోని అన్ని స్థాయిల్లో అత్యంత సమంజసమైన ధరలకు ఔషధాలను సరఫరా చేయగలుగుతోంది. ఒక ఏడాదిలో తలసరి ఔషధాల వ్యయం చాలా తక్కువగా రూ.60 మేర ఉంటోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఔషధాల సేకరణలో వ్యయం కూడా ఇదే తరహా సరళిని తెలియచేస్తోంది (పట్టిక 4.10).

**(పట్టిక 4.8: తమిళనాడులో ఔషధాలపై వ్యయం**

**పట్టిక 4.9: తమిళనాడులో ఔషధాలు, మందుల కొనుగోలు విభాగాలవారీగా)**

తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో ఔషధాలపై మొత్తం వ్యయంలో అన్ని ప్రభుత్వ ద్వితీయ, తృతీయ స్థాయి ఆస్పత్రుల్లో పంపిణీకి సేకరించిన ఔషధాలు కూడా కలిపి ఉంటాయి. నిజానికి తమిళనాడులో ఔషధాలపై మూడింట రెండొంతుల కంటే ఎక్కువ వ్యయం బోధనాస్పత్రుల్లో అవుతుండగా, మొత్తం సేకరించిన డ్రగ్స్‌లో 10 శాతాన్నే పి.హెచ్.సిలు వినియోగిస్తున్నాయి. ఎఫ్.పిల ద్వారా ప్రాథమిక వైద్యంలో ఔట్‌పేషెంట్ సేవల్ని గణనీయంగా పెంచినా కూడా.. ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థలోని మొత్తం ఔట్‌పేషెంట్లకు డాక్టర్ చీటీలోని ఔషధాలను అందించేందుకు అదే తలసరి రూ.60 అవసరానికి మించి సరిపోతుందనుకోవటం సముచిత అంచనాయే అవుతుంది. పటిష్ఠమయిన, సమర్థవంతమైన వ్యవస్థ ఉన్న అనేక దేశాల్లో డాక్టర్ చీటీ ఔషధాలకు సహ చెల్లింపు ఉంటుంది. దీనివల్ల మితిమీరి మందులను రాయటం, యాంటిబయోటిక్స్ లాంటి అనవసర మందులను నివారించటం సాధ్యమవుతుంది. నాణ్యతతో చౌక ధరకు అందించేలా వ్యవస్థ మీద ఇది ఒత్తిడి తెస్తుంది. కాబట్టి ప్రాథమిక ఆరోగ్య స్థాయిలో తక్కువ ధరలో ఔషధాలు, అందులో కొద్దిమేర రోగి సహ చెల్లింపు చేసే ఏర్పాటు, ఆస్పత్రి సేవలు పొందే ఇన్-పేషెంట్లకు ఉచితంగా మందులనివ్వటం సరైన విధానం.

**బాక్స్ 4.5: ఔషధాల సేకరణ, పంపిణీలో తమిళనాడు నమూనా**

ప్రభుత్వ ఆరోగ్య సదుపాయాలలో ఔషధాలు తక్షణం అందుబాటులో ఉండేలా చేసేందుకు తమిళనాడు వైద్య సేవల కార్పొరేషన్ (టి.ఎన్.ఎం.ఎస్.సి) ను 1994లో నెలకొల్పారు. అది కేంద్రీకృత ఔషధాల సేకరణ పద్ధతిని అనుసరిస్తోంది. గతంలోని వినియోగ సరళిని అనుసరించి తప్పనిసరి ఔషధాల జాబితాను, అవసరమైన పరిమాణాన్ని రూపొందిస్తారు.

రెండంచెల టెండర్ ప్రక్రియ ద్వారా సరఫరాదారుల్ని గుర్తిస్తారు. థర్డ్ పార్టీ నాణ్యతా నియంత్రణ ద్వారా పారదర్శకత ఉండేలా చూస్తారు. మందుల పంపిణీకి టి.ఎన్.ఎం.ఎస్.సి పాస్‌బుక్ పద్ధతిని అనుసరిస్తుంది. ప్రతి వినియోగదారుని ఆరోగ్య సదుపాయానికీ ఒక పాస్‌బుక్ ఇస్తారు. ఇందుకు తమ మందుల నిధుల్లో 90 శాతాన్ని టి.ఎన్.ఎం.ఎస్.సి వద్ద సదరు ఆరోగ్య సదుపాయం డిపాజిట్ చేయాలి. అవసరానికి అనుగుణంగా ప్రతి ఆరోగ్య సదుపాయానికీ సరఫరాను దగ్గర్లోని గిడ్డంగి నుండి అందిస్తారు. ఆ వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు (రియల్‌టైమ్ ట్రాకింగ్) వీలుగా పాస్‌బుక్‌లో నమోదవుతాయి. ఇంకా, కంప్యూటరీకరించిన జాబితాల నిర్వహణ వ్యవస్థ అన్ని గిడ్డంగులు, వినియోగదారుల కేంద్రాలలో కూడా మందుల వివరాలను నమోదు చేస్తుంది. వృథాను నివారించటానికి గిడ్డంగుల మధ్య మందుల సర్దుబాటుకు అవకాశం కల్పించారు. ఈ రకమైన వ్యవస్థ పలు సానుకూల ఫలితాలకు దారితీసింది. ప్రభుత్వ ఆరోగ్య సదుపాయాల్లో మందులు తగినమేర అందుబాటులో ఉండేలా చేయటంలో ఇది విజయవంతమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఔషధాల సేకరణలో మరింత మెరుగ్గా ఖర్చుకు తగ్గ ఫలితాలను సాధించటానికి ఇది దోహదం చేసింది. అదే సమయంలో, రాష్ట్రంలో మందులపై ఓ.ఓ.పి.ఇని తగ్గించటం మరో పరిగణించదగ్గ పరిణామం. ఉదాహరణకి, మందులపై ఓ.ఓ.పి.ఇ వల్ల పేదరికంలో 1993-94 నుండి 2004-05 మధ్యకాలంలో తమిళనాట గణనీయమైన తగ్గుదల నమోదైంది (4.2% నుండి 1.7%కి- 60 శాతం మేర తగ్గుదల. అదే సమయంలో జాతీయ సగటులో కేవలం 20 శాతం తగ్గుదల- 3.6% నుండి 2.9% నమోదయింది). అంతేకాకుండా, నెలవారీ తలసరి వినియోగ వ్యయంలో పోల్చదగిన రాష్ట్రాల మధ్య ఓ.ఓ.పి.ఇలో మందుల వాటా తమిళనాడులోనే అతి తక్కువగా ఉంది.


(ఇంకా ఉంది...)



# ఆరోగ్య తెలంగాణ సాధన కోసం కార్యాచరణ..

ఆరోగ్య తెలంగాణ సాధనకై త్వరలో లోక్‌సత్తా పార్టీ చేపట్టనున్న ప్రజా ఉద్యమ కార్యాచరణపై చర్చించిన అనంతరం పార్టీ రాష్ట్ర సమన్వయ కమిటీ బృందం హైదరాబాద్‌లోని కార్యాలయంలో వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌ను కలిసి ఆ అంశాల్ని వివరించింది. సినీ, ఇతర ప్రముఖ కళాకారులు, వైద్యులు, సమాజ సేవకులు, సంఘాలతో కలిసి ప్రచార ఉద్యమ నిర్మాణంపై నేతలు చర్చించారు. లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసుతో పాటు కటారి శ్రీనివాసరావు, గన్‌రెడ్డి రాజారెడ్డి, నందిపేట రవీందర్, కె. శ్రీనివాస వర్మ, మారుతీరావు, వంశీ ప్రసాద్ బృందంలో ఉన్నారు.

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th May, 2022 Posting Date 15 &16th of every month




*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**